ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు

18-8-'54

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 49
18-8-54

జయ శ్రావణ బహుళ చతుర్థి బుధవారం

ఆగస్టు 15, 1947 స్వాతంత్ర్యం లభించిన రోజు; భారతావని మూడు ఖండాలుగా రెండు రాజ్యాలుగా రూపొందిన రోజు; గాంధి మహాత్ముడు ఉపవాసంతో ఉత్సవం జరిపిన రోజు. ఉత్తరాదిన ప్రజ్వరిల్లిన మతకల్లోలం స్వల్ప విరామం తీసుకున్న రోజు; లక్షలాదిగా ప్రజలు ఆస్తులు ఆశ్రయాలు బంధు మిత్రులను గోల్పోయి జన్మభూమి విడిచి ప్రాణా లరచేత పెట్టుకొని పారిపోయిన ఆ రోజులలో ఆగస్టు 15 వ తేదీని మహోత్సవం జరిగింది. దుఃఖమూ ఆనందమూ పెల్లివిరిసిన వారోజున. ఆనందోత్సాహాలతో హృదయ ముప్పొంగని భారతీయుడు లేడా నాడు. స్వతంత్ర వ్యవస్థలో భారతీయుడనని చెప్పుకొని గర్వపడనివాడు లేడు. అది ఏడేళ్ల నాటి మాట. ఆనాటి ఆనందోత్సాహాలు ఇప్పుడు లేవంటే ఆశ్చర్యంలేదు. దాస్యభారం తొలగి తేలికపడిన మనస్సు ఆరోజున. కొత్త కొత్త సమస్యలతో పెనగులాడుతున్న వ్యక్తికీరోజున ఆనాటి ఉత్సాహం జ్ఞప్తికి తెచ్చుకుంటే ఒక అంశ అనుభూతి కలుగవచ్చు.

ఈ ఏడేళ్లలో ఎన్నెన్ని విపత్తులో వచ్చాయి. కాటకాలు సంభవించాయి. భూకంపాలు, వరదలు, కాశ్మీరయుద్ధం మొదలైనవి సంభవించాయి. ఎప్పటికప్పుడు అన్నిటినీ తట్టుకుంటూవచ్చాం. క్రమంగా కరువులు తగ్గుతున్నాయి. ఆహార ధాన్యాల పంటలు వృద్ధిచెందాయి. పంచవర్ష ప్రణాళిక అమలు జరుగుతోంది. త్యాగధనుడు శ్రీరాములు ఆత్మాహుతి ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. అంతర్జాతీయ రాజకీయాలలో భారతీయుల విశిష్ట దృక్పథానికి గౌరవాదరాలు లభించాయి. కొరియా ఇండోచీనాలలో శాంతిస్థాపన కృషిలో భారతప్రభుత్వ సహాయ సహకారాలు లోకం ప్రశంస పొందాయి.

రాజకీయ స్వాతంత్ర్య లబ్ధితో దేశంలో ఆర్థికదైన్యం తగ్గలేదు. దారిద్ర్యం ఎక్కువౌతున్నదే కాని ఎక్కడా తగ్గుదల కనపడదు. నిరుద్యోగ బాధ మరింత అధికమైంది. పరిశ్రమలు వ్యాపారం వృద్ధికాకపోగా మందగిస్తున్నాయి. పెట్టుబడిదారుల ద్రవ్యం వస్తూత్పత్తి వృద్ధికి సక్రమంగా వినియోగపడటంలేదు. ఆనాటికీ ఈనాటికీ ప్రాజెక్టుల నిర్మాణం తప్ప మరే అంశంలోనూ వృద్ధికనపడదు. పంచవర్ష ప్రణాళికవల్ల దేశంలో ఆర్థిక పరిస్థితులలో మార్పు కనపడదు.

ఈ పరిస్థితులు మారాలి. స్వాతంత్ర్యం ప్రజలలో అన్నివర్గాలకూ వినియోగపడాలంటే ప్రజలూ ప్రభుత్వాల మధ్య సన్నిహిత సహకారం అవసరం. అది పాక్షిక రాజకీయాలవల్ల ఒనగూడేది కాదు. కాంగ్రెస్ వాదులు మనస్తత్వం మార్చుకొని దేశంలో రాజకీయ కక్షల కల్లోలాన్ని ఉపశమింప చేయడం అవసరం.

కాలక్షేపం

శ్రీ మహిత శ్రుతి స్మృతులచే,
బహు శాస్త్రపురాణ యుక్తిచే,
నేమి ఫలంబు? - లౌక్యజన
వృత్తికి నీడగు నిర్జరాలయ
గ్రామ కుటీనివాస ఫలకర్మముచే
ఫలమేమి? - జన్మ దుః
ఖామయ భేష జాతుయ మహా
సుఖ మొక్కటిదక్క నన్నిటన్.

తా॥ గొప్పవైన శ్రుతి (వేదముల) స్మృతి (ధర్మశాస్త్రముల) పఠనము చేతనే, అనేకశాస్త్రములయందు పురాణములయందు నేర్పరియగుట చేతను, ఏమి ఫలమున్నది? గ్రామంలో చక్కని కుటీరంలో నివసిస్తూ లౌకిక వ్యవహారములకు సమానమైన కర్మానుష్ఠానములను చేయుచు స్వర్గసౌఖ్యమును పొందుచుండిన ఫలమేమి? జన్మదుఃఖములనెడి వ్యాధులకు తగిన వైద్య చికిత్సయనదగు అత్యయ మహాసుఖము ఒక్కదానివలన తప్ప మిగిలిన యన్నిటివల్లను ఫలమేమి?

జగమెరిగిన బ్రాహ్మణునకు జందెమెందుకు? అనే సామెత జగమెరిగిన సామెత. కనుక జగమెరిగిన బ్రాహ్మణునకు కూడా యీ సామెత ఎందుకు పుట్టినదో తెలుసు. సమస్త లోకానికీ సద్బ్రాహ్మణుడని సంశయలేశం లేకుండా విస్పష్టమైన విప్రవరుడు, యజ్ఞోపవీతం ధరించక పోయినప్పటికీ, అతడు సద్బ్రాహ్మణుడే అని నిరభ్యంతరంగా లోకం శిరసావహిస్తుంది. కాని, నిరంతరముగా నిత్యకృత్యముగా బ్రహ్మయజ్ఞం పితృతర్పణము మొదలైన కర్మలను చేస్తూ నిరతాగ్నిహోత్రపరుడైన బ్రాహ్మణునకు యజ్ఞోపవీతం ఉండితీరాలి. అతడు యీ కర్మలను చేస్తున్నంత కాలము యజ్ఞోపవీతం ధరించడంకూడా యీ కర్మకాండలో చేరిన భాగమే. "నిర్మల ధర్మ కర్మ దీక్షా పరతంత్రు డంబురుహాగర్భ కులాభరణంబు" అయినట్లయితే, యజ్ఞోపవీతం కూడా ఆ ధర్మకర్మ దీక్షకు అవసరమైన ఆభరణంబుగా ధరించాలి. పోలీసు ఉద్యోగం చేసినంత కాలమూ పోలీసు టోపీయున్నూ, నెంబరున్నూ, తదితర వేష లాంఛనములున్నూ ఉండి తీరవలసినవే. వివాహం చేసికొన్న వధువుకు మంగళసూత్రం ఉండవలసిందే. లేకపోతే చాలా చిక్కులు వస్తాయి. సూత్రం, మంత్రం లేకపోయినా కంట్రాక్టుపత్రమైనా ఉండాలి. మంగళసూత్రం లే[illegible]తే వివాహం కాలేదనే వివాదం వస్తు[illegible]దా? లేక అపవాదం వస్తుందా? మెడలో ఈ లైసెన్సుబిళ్ళ లేకపోతే, అధికారులు ఎవరైనా చెక్కింగు చేసి, "ఎవ్వరిదానవీవు భీతహరిణేక్షణ!" అని సవాలుచేసి, తాఖీదు కాణా షోకాసు చేసి, "ఇంతకాలంవరకూ పెండ్లి చేసికొనకుండా ఉండుటకు కారణమేమిటో వెంటనే సమాధానం యివ్వవలసి యున్నది" అని నోటీసు జారీచేస్తారా? సంఘముయొక్క సందర్భ పరిస్థితులనుబట్టిగాని కాలావసరములనుబట్టి గాని అటువంటి నోటీసులనూ ఉత్తరువులనూ ప్రభుత్వం ఎందుచేత జారీ చేయజాలదో లోకావలోకనంచేసెడి పాఠకులే ఒక్కసారి మననంచేసి చక్కగా జవాబు చెప్పవలసి యున్నది.

ప్రభుత్వం అనేది అన్నివిషయాలలోను జోక్యం కలుగజేసికొనుటకు అధికారం కలిగి యుంటుంది. సంతాన నిరోధపద్ధతులను అవలంబించినటువంటి దేశంలో జనసంఖ్యాభివృద్ధి ఎక్కువగా ఉండదు. అటువంటి దేశంలో తగినంత జనసంఖ్య వృద్ధికాకపోవడమున్నూ, దాని యిరుగు పొరుగు రాజ్యాలలో జనసంఖ్య తామరతంపరగా వృద్ధి యగుటయున్నూ, అట్టి యిరుగుపొరుగురాజ్యాల సైన్యాభివృద్ధికి కావలసిన అంగబలము అఖండముగా లభించుటయున్నూ సంభవిస్తుంది. అటువంటిస్థితిలో యిరుగుపొరుగు రాజ్యాలు బలవత్తరమై, బలవత్తమమై, ఆ ఒక్క రాజ్యాన్ని ఒక్కగుక్కలో కబళిస్తాయి. అంతేకాదు. సంతాన నిరోధపద్ధతులను అవలంబించడం వల్ల, సంసారభారం వహించే బాధ్యతలు లేకుండా స్త్రీలున్నూ పురుషులున్నూ కేళీవిలాసంగా కాలక్షేపం చేయడమే జీవితలక్ష్యంగా భావించి, తదనుగుణమైన ఖుషీ, నిషా, మజా, జల్సా, విలాసాల తమాషా ఖులాసాలలో, చల్ మోహనరంగా అంటూ, మల్లెపూలా తెప్ప మీదా తేలిపోదమూ గదరా! అంటూ ఉంటారు. కాబట్టి భోగములలో మునిగిన భోగంజాతిగా ప్రజానీకం తయారవుతుంది. అది నిజం - అది సహజం. గత మహా సంగ్రామపు ఆరంభదశలోనే ఫ్రాన్సుమీదకు హిట్లరు దండయాత్ర సాగించాడు. తన జర్మను సేనలు ఫ్రాన్సును ఆక్రమించడానికి కనీసము మూడు మాసాలైనా యుద్ధం

విషయానుక్రమణిక

ముఖచిత్రం: "మా గోపి"లో జమున, వెంకటేశ్వర్.

లోపలి కవరు చిత్రం:-
"పొద్దు తిరుగుడు పువ్వు"
ఫోటో: జి. యస్. శర్మ-తేలప్రోలు

వెనుకపక్క కవరు చిత్రం:-
"సామర్లకోటలో భీమేశ్వరాలయ అంతర్భాగం"
ఫోటో: డి. వి. ఎస్. ఎస్. ఎస్. సోమయాజులు, కాకినాడ.

పంచతంత్రం - గమనిక

కారణాంతరాలవల్ల పంచతంత్రం-లబ్ధనాశం ప్రస్తుతానికి ప్రచురించలేక పోతున్నందుకు చింతిస్తున్నాం. తిరిగి త్వరలోనే - ప్రచురణ సాగించగలం.

—సంపాదకుడు.

చేయవలసియుంటుందని హిట్లరు అంచనా లెక్కలు వేసికొన్నాడు. కాని ఫ్రాన్సును జయించడానికి నలభైరోజులుకూడా పట్టలేదు. మూడు నెలలయుద్ధం మండలంలో ముగిసింది. ఫ్రాన్సు లొంగిపోయిందని ఫ్రెంచి సేనానియైన మార్షలు పెటేను తెల్ల జెండా పైకి ఎత్తినాడు. "జనసంఖ్యాబలం లేకపోవడం - భోగలాలసత్వం" ఇవే ఫ్రాన్సుయొక్క అపజయానికి మూల కారణాలు అని ఆ ఫ్రెంచి సేనాని ఏడ్చాడు. సంతాన నిరోధ పద్ధతులలో ప్రసిద్ధికెక్కిన వారు పరాసువారు. ప్యారీసు నగరం అంటే "ఆవ్ ప్యారీ!" అనే వ్యాపారం అపారంగా జరిగేది ప్యారీస్ నగరం. అటువంటి పరాసుజాతికి పరాభవం కలిగితే పరామర్శ చేయవలసిన పని లేదన్నట్లుగా పరాసు సేనాని ప్రసంగించాడు.

ఫ్రెంచిజాతి యావిధంగా భోగవిలాసములయందు మించి రమించుచున్న సంవత్సరములలోనే జర్మను జాతిని సర్వవిధముల సమరసమర్థముగా సమకూర్చుటకు హిట్లరు అనేక కట్టుబాట్లను అములుపరిచాడు. సాంక్రామిక వ్యాధులుగలవాళ్లకు సంతానయోగ్యతయుండకూడదని శాసించాడు. సంతాన వృద్ధికి తగిన సంసార నియమములు శాసించాడు. స్త్రీలకు గృహనిర్వహణం మహా బాధ్యత అన్నాడు. గృహం విడిచిన స్త్రీ సంఘానికి దేశానికి శనిగ్రహం అన్నాడు. సంతానం, సంసారం—అదే స్త్రీకి జీవితంలో స్థానం, అదే ఇహం,పరం అన్నాడు. స్త్రీకి యిల్లు విడిచి ఉద్యోగం చేయడం, నేల విడిచి సాము చేయడం అన్నాడు. జర్మనుజాతిని సమరభూమిలో అరివీర భయంకరులనుగా నిర్భీతిగా తర్ఫీయతు చేశాడు. అటువంటి శిక్షణపొందిన జర్మను జాతి ధాటికి, పరాసు భోగవిలాసుల సైనిక భట కోటి నిలువలేకపోయింది.

ఇదంతా గత సంగ్రామ పురాణేతిహాస ప్రమాణము. ఏ పరిస్థితులలో ప్రజానీకమును ఏ పరిపాకములోనికి తీసికొని రావలెనో, ఎటువంటి క్రమశిక్షణలో కవాతు చేయించవలెనో, ప్రభుత్వానికి ప్రత్యక్షావసరంగా కన్పిస్తుంది. దేశంలో ప్రజలందరూ ఎటువంటి ఆహారపద్ధతులను అవలంబించవలెనో ఆరోగ్యశాఖాధికారులు నిర్ణయిస్తారు. ఎంత వయస్సు వచ్చిన ఆడపిల్లను పెళ్లిచేయవలెనో దేశక్షేమ విశారదులు శారదా చట్టముచేసి శాసిస్తారు. అంతే కాదు. స్త్రీలు గాని, పురుషులు గాని వివాహము చేసికొనడం విరమిస్తే, ఆ పద్ధతిని విరమించవలెనని విధిస్తారు అధికారు. మధుపానం వల్ల అధోగతికి వస్తోంది మన జాతి యని మన మేలు కోరిన పాలకులు నిర్ణయిస్తారు. సారాసార విచార విశారదులు సారా దుకాణాలు మూయిస్తారు. ఒకప్పుడు ధర్మరాజులవారు జూదం ఆడినారు. నలమహారాజు జూదం ఆడినాడు. దుర్యోధనాదులు మధుపానం చేశారు. కౌరవులే కాదు యాదవులు కూడా నిషావస్తువులను నిరాక్షేపణగా విందు సభలో సేవించారు. బలరాముడు మద్యం మాంసం

★ కాలక్షేపం ★

పూజించకపోతే, బలంగల రాముడు కానే కాడు. జూదానికి రమ్మని ఒకరాజును ఇంకొకరాజు పిలవడం ఆకాలపు మర్యాద. జూదం ఆడిగెలిస్తే, కుస్తీ చేసి గెల్చిన పుస్తాదుకు వచ్చినంతకీర్తి వచ్చేది. జూదం ఆడలేని రాజు తన సాటిరాజులలో చెల్లని పైగానివలె తిరుగవలసి వచ్చేది. జూదాలు రాజమర్యాదలైన కాలంలో రాజులకు మధ్య మాంసాలు నిత్యనైమిత్తిక నైవేద్యాలు. రాయబారులు రాజులసభలకు వచ్చినప్పుడు మర్యాదకై మంచిపానీయం తెప్పించి సమర్పించే మర్యాద పాండవులకాలంలో లేదని వాదించగలమా? దుర్యోధనాదులవద్దకు పాండవులతరఫు రాయబారిగా వెళ్లిన శ్రీకృష్ణునకు మున్ముందుగా ఎన్ని సత్కారములు సలాంఛనంగా సలక్షణంగా జరిగియుండగలవో సహజంగా మన మూహించగలం. వ్యాసప్రోక్తంకాని ఇతిహాసం ఇతోధికంగా ఉందని అంగీకరిస్తే చాలు. అనాటి రాజమర్యాద లేమిటో శ్రీకృష్ణ బలరామాదులు ఏమితిన్నారో ఏమిత్రాగినారో ఏవిధంగా తిని త్రాగి రాసక్రీడలు చేసినారో, రాక్షసవివాహాలుకూడా ఏవిధంగా సలక్షణ సశాస్త్రీయ సమంత్రక వివాహాలతో సమానంగా సమ్మానింపబడినవో సమాలోచించి సర్వవిషయ సమన్వయంచేసి చూచినట్లయితే, ఏకాలానికి ఏది సంఘమర్యాదగా భావింపబడుతుందో అదే సత్కర్మకాండ. ఏకాలానికి ఏది సంఘ సమష్టి లాభనష్టదృష్టిలో శ్రేష్ఠమైన కర్తవ్యమని శిష్టులు నిర్ణయిస్తారో అదే ధర్మశాస్త్రం. అదే స్మృతికర్తలు శాసించే విధి నిషేధం.

ఒకప్పుడు బ్రాహ్మణ ధర్మం ఉత్తమ ధర్మం అని భారతదేశం గ్రహించింది. బ్రహ్మతేజం ఆరిపోకుండా వెలుగుతూ ఉండేటట్లుగా దానికి తైలంపోసితే, జాతియొక్క శీలం ప్రబలం అయి, ప్రభుత్వం నిర్మలంగా సాగుతుంది అని ప్రభువులు గ్రహించారు. ప్రభుత్వంలో అందువల్ల పటుత్వం ఏర్పడింది. కాని బ్రహ్మతేజం అంటే అదికూడా ఒక "ఇజం" అన్నారు బ్రిటిష్‌వారు. "భారతదేశంలో అశాంతి" (*Unrest in India*) —దీనికి కారకులు బ్రాహ్మణులే అన్నారు. సిపాయీల తిరుగుబాటునకు నాయకుడు బ్రాహ్మణుడు. దానినే *Indian war of Independence* ("భారత స్వాతంత్ర్య సమరం") అని సవర్కారుగారు వివరించి విపులీకరించి విశదీకరించారు. "స్వరాజ్యం నా జన్మహక్కు" అనే నినాదం బ్రహ్మనాదంగా సాగించిన లోకమాన్య తిలక్ మహారాష్ట్ర చిత్పావన్ బ్రాహ్మణుడు-బ్రిటిష్ అధికారాన్ని ధిక్కరించడంలో అందెవేసిన చెయ్యి యీతిలక్ అనేతలతిక్క బ్రాహ్మణుడు అని సర్ వాలంటైన్ షిరాల్ వంటి సామ్రాజ్యవాద శిరోమణులు వాదించారు. కనుక, వారు సూచించిన చికిత్సా ప్రక్రియ ఏమిటంటే. బ్రాహ్మణుని ప్రాబల్యానికి సమాధికట్టాలి, బ్రాహ్మణునిపై బ్రాహ్మణేతరులచే ధ్వజమెత్తించాలి. ఈ విధంగా హిందువులకూ ముసల్మానులకూ మధ్య మిత్రభేద తంత్రం ప్రయోగించిన బ్రిటిష్ ప్రభువులే బ్రాహ్మణ బ్రాహ్మణేతర విభేద భావమును, మనమీద తమ సామ్రాజ్యాధికారమును ప్రయోగించడానికి అవసరమైన మంత్రంగా జపించారు. ఆ మంత్ర ప్రభావం యీనాటివరకూ మనమీద పనిచేస్తూనే ఉంది. ఇంచుమించు యిప్పటికి మూడు పుష్కరాల క్రిందట మాంటాగ్యూ - చెమ్సుఫర్డు (మాంటు ఫర్డు) సంస్కరణలనబడు భారత రాజ్యాంగ సంస్కరణలకు పాకం పట్టుచుండిన దినములలో ఇంగ్లాండులోని సైడెన్హాం ప్రభువు ఆంగ్ల సామ్రాజ్యాగ్నికి ఆజ్యంపోసి యీ బ్రాహ్మణా బ్రాహ్మణ స్పర్థలనెడి సమిధలను ఏర్చి కూర్చి పేర్చి తన పని తాను నెరవేర్చినాడు. ఆ సమిధలు సామ్రాజ్యం పోయినా చల్లారకుండా మండుతున్నాయి. ప్రజలకు కావలసిందిఅన్న వస్త్రాలు. అందుకు కావలసింది పాడిపంటలు. అందుకు కావలసింది వ్యవసాయ వాణిజ్య వ్యాపార పరిశ్రమలు - ఆనకట్టలు - కాల్వలు - చెరువులు - ఎరువులు. బ్రాహ్మణ కాల్వలనిగాని, అబ్రాహ్మణ కాల్వలనిగాని త్రవ్వగలరంటే లోకులు నవ్వగలరు. జీవనదులకు ఆనకట్టలు కట్టితే, బ్రాహ్మణా బ్రాహ్మణ విభేదాలకు ఆనకట్టలు తెగిపోతాయి. దేశంలో పరిశ్రమలు పెంపొందితే, ఈ పరస్పర స్పర్థలు ఆ

యంత్రాలమధ్య నలిగిపోతాయి. ప్రస్తుతం యీ స్పర్థలు దోమలవలె వృద్ధిపొందుతూ ఉండేచోటు ఒక్కటిమాత్రం ఉంది. ప్రభుత్వోద్యోగాలనెడి జీవితాశాపకాశ జలాశయములవద్దనూ, ఈ ఉద్యోగాల కొరకైన విద్యాశిక్షాపకాశ జలాశయముల వద్దనూ, యీ బ్రాహ్మణా బ్రాహ్మణ వైషమ్య మశకజనిత మలేరియా "మన తీరు యింతేనయా" అంటోంది. వెనుకబడిన తరగతులవారిని ముందుకు తీసికొని రావాలి గనుక, ప్రాబల్యం లేనివారికి ప్రాబల్యం కలిగించవలెను గనుక, వారిని గుమాస్తాలుగా ముస్తాబుచేస్తే కట్టుమస్తీగా ఎదుగుతారా? ఎన్ని కోట్లమంది జనులు వెనుకబడిఉన్నారు? ఎన్ని వేలమంది మందభాగ్యులను సర్కారు నవుకరీలు ముందుకు తీసికొనిరాగలవు? ఉద్యోగాలవల్లనే వెనుక వాళ్లు ముందుకూ, క్రిందివాళ్లు పైకీ, చీకట్లో ఉన్నవాళ్లు వెలుతురులోకీ రావడంగాని, బక్కచిక్కినవాళ్లు బలవడంగాని, సంభవిస్తుందా? ఉద్యోగాలు అంటే ఊరపిచ్చుక లలేహ్యమా? పతితులనూ అసమర్థులనూ ఉద్ధరించే సిద్ధమకరధ్వజమా? వెనుకబడినవారి నందరిని ముందుకు నడిపించడం కోసం ఈ ఉద్యోగాల చిట్టుతట్టను చూపించి సర్కారు వారు తమ సర్కసుకంపెనీని ఎన్నాళ్లు నడిపించగలరు? ఆ కలువరింతపోయి,కళ్లు తెరచి, నిద్రలేచి, భద్రంగా బాగుపడేమార్గం సర్కారు నవుకరీకాదని స్పష్టంగా గ్రహించేవరకే, యీ ఉద్యోగ వ్యామోహాస్త్ర ప్రయోగ ప్రభావప్రమేయం. కృషి వాణిజ్య పరిశ్రమలు కృశించినప్పుడే సర్కారు కచ్చేరీలు కన్యకాపరమేశ్వరీ ధర్మసత్రము లవుతాయి. సత్రంలో భోజనపువిస్తరికోసం వెనుకబడినవారూ ముందుపడినవారూ ఒకరిమీద ఒకరుపడి ఒకరినింకొకరు త్రొక్కుకొనడం త్రోసికొనడం సంభవిస్తోంది. బ్రాహ్మణుడూ ముందుకురావడం క్షేమం కాదని బ్రిటిష్ తంత్రజ్ఞులు నిర్ణయిస్తే, వారి సామ్రాజ్యం వారికి జీర్ణంకావడానికి చేసిన నిర్ణయం, అది మొత్తంమీద వారి సామ్రాజ్యం శీఘ్రమై శిథిలమై కాలప్రవాహంలో కార్తీక దీపం లాగున కొట్టుకొనిపోయింది.

ఎందుకీమిత్రభేదతంత్రం అనే యోచన ఉంటే అదే విమోచనకు మార్గం. ఏమైనప్పటికీ ఒకప్పుడు అవశ్యకర్తవ్యం అని స్మృతి కర్తలు విధినిషేధాలు కొన్ని కల్పించి తీగెలు శ్రుతి చేస్తారు. లాభనష్టాలు సమష్టిదృష్టితో నిర్ణయిస్తారు. కాని, కాలం మారుతుంది. దానినిబట్టి కాలావసరం మారుతుంది. రాగం మారుతుంది. శ్రుతి మారుతుంది. స్మృతికూడా మారుతుంది. వేసవికాలంలో విసనకర్రలు కావాలి. చలికాలంలో శాలువలు కావాలి. ఒకప్పుడు బ్రాహ్మణధర్మానికి బ్రహ్మరథం పట్టి, బ్రహ్మతేజాన్ని కళ్లకద్దుకొని బ్రహ్మాండ నాయకులై ప్రభువులు పాలించారు. శాయణాచార్యులు, విద్యారణ్యులు అన్నదమ్ములు. హరిహర రాయలు చేతను బుక్కరాయలు చేతను విజయనగర రాజ్యాన్ని స్థాపింప చేసినది విద్యారణ్యులవారే. కృష్ణదేవరాయలు హిందూరాజ్య రమారమణుడైనాడు. శివాజీ చక్రవర్తిని హిందూసామ్రాజ్య సంరక్షణ దీక్షాదక్షునిగా చేయగల్గినది సమర్థ రామదాసుగారి సత్ప్రబోధం. అదంతా పూర్వ గాథ.

మన దేశం బాగుపడే మార్గం ఉపదేశం చేయగల్గినవాళ్ళే మన పూర్వ స్మృతి కర్తలు. వారే మన ధర్మశాసనకర్తలు. సంఘసమష్టి లాభనష్టముల దృష్టిలో సృష్టి చేసినవే అష్టాదశపురాణాలు. సంఘాన్ని సరియైన గురిలో పెట్టి, సుళ్లు మొసళ్లు లేని ప్రమాదం లేని కాలప్రవాహ మార్గంలో చుక్కాని పట్టి నడిపించడమే శ్రుతి స్మృతుల పురాణేతిహాసాల ముఖ్య కర్తవ్యం. ఇవన్నీ ఎందుకయ్యా? అంటే, సంఘసమష్టి లాభం సాధించడానికి.

కర్మకాండలకు లాభనష్టాల దృష్టిలో ఖరీదు కట్టవలసి వస్తుంది. ఏ ధర్మశాసనంలోనైనా లాభనష్టముల వాసన ఉండక మానదు. ఇదంతా కోమటి బేరం. అనారోగ్యంపోయి ఆరోగ్యం కలగాలి. దుఃఖం పోయి సుఖం కలగాలి. దారిద్ర్యంపోయి అయిశ్వర్యం రావాలి. పారతంత్ర్యంపోయి స్వాతంత్ర్యంరావాలి. కనుక, నియమ నిష్ఠలు కావాలి, శాస్త్రజ్ఞానం కావాలి. బుద్ధిసామర్థ్యం - యుద్ధసామర్థ్యం కావాలి. ఈ విధంగా మనం ఉద్ధరింపబడాలి. వెనుకబడిన వాళ్లం ముందుకువచ్చి లేవాలి. ఇటువంటి ముందంజలతో ముందుకువచ్చిన వాళ్లంతా "పదండి పోదాం పైపైకి!"; ఇంకా పదండి పోదాం పైపైకి అంటూనే ఉంటారు. సుఖదుఃఖాలు లెక్కచూచుకుంటూ ఉన్నంత కాలమూ, సుఖదుఃఖాల చిఠా అవర్జాల లెక్కలబుక్కులు లెక్కలేకుండా పెరుగుతూనే ఉంటాయి. ధర్మశాసనాలు లా రిపోర్టుల గ్రంథసముదాయం లాగున బీరువాలు నిండుతూ ఉంటాయి. ఒక ధర్మపీఠం తాలూకు తీర్పు యింకో ధర్మపీఠ నిర్ణయాన్ని ఖండిస్తూనే ఉంటుంది. ధర్మమే జయించును అనేమాట నీటిమూటగా కన్పిస్తుంది. ఒక యుగధర్మం ఇంకో యుగ ధర్మానికి విరుద్ధం. ఆనాడు "తాటాకుల లోన వ్రాసిరి" అని యీనాడు ఆ తాటాకులను ఉఫ్ అని ఊదివేస్తుంది లోకం. తాటాకుల నిబంధనలు కట్టుబాట్లు అక్కరలేని కాలంలో విడాకులు మిగులుతాయి. విచ్చలవిడిగా ఎగురుతారు. స్వతంత్రంగా ఎగరడం స్వాతంత్ర్యం. స్త్రీపురుష సమాన స్వాతంత్ర్యం. ఇది వర్తమానప్రపంచ ప్రవర్తన ధర్మసూత్రం. ధర్మమార్గం సదా తారుమారవుతోంది. సవరను ధరలమార్గాన్ని ధర్మమార్గం అనుసరిస్తోంది. ధర్మమే జయించును అనే మాట వినిపించుచున్న దేగాని, ఆమాట కొక తేటబాట కనుపించదు.

ఈ ధరలశాసనం సమ్మతపుంటు జూదం ఆడినట్లే అవుతుంది. సుఖదుఃఖాల బోటుకు చుక్కానీలేదు. సుఖమే కావాలిగాని దుఃఖం అక్కరలేదని వాదించేవాడు లాభమే కావాలిగాని, నష్టం అక్కరలేదని వాదిస్తాడు. కాని లాభం వచ్చినవెంటనే వ్యాపారం మర్తబుచేసి, అంగడికి మంగళం అంటాడా? లేదు. లాభం వచ్చినప్పుడే లోభం ఎక్కువవుతుంది. ఈ లోభంతో "పోదాం పైపైకి" అంటాడు. "మనం పైకి ఎక్కిన శిఖరం స్థిరమైన నికరమైన స్థావరం అనుకుంటాం. కమ్యూనిజంవంటి ఒక "ఇజం" పట్టుకొని, ఎక్కుతాం పైపైకి. కాని గట్టిపట్టుతో గట్టుపై కెక్కితే, ఆ గట్టు విరిగి మనము పట్టు తప్పి క్రింది మెట్టుకే రావచ్చు. ఎందుకీ భేషజం?

నిజమైన "ఇజం" ఆర్థికంగా లాభ నష్టాలు గుణించేది కాదు. జన్మదుఃఖాలను జయించే సద్వైద్యవిధానం అసలైన భేషజం. అది ఆత్మశాంతినిచ్చే భేషజం. అది భేషైన 'ఇజం'అని యోగులు గ్రహించి మనస్సును నిగ్రహించారు. దానిమూలంగా సుఖదుఃఖాల మూలకారణం త్రవ్వి కుళ్ళగించారు.

"కలదె సౌఖ్యము మాడ్కి కలిమిసంపదలకె?
ఉగ్రమాపులకుగూడ నొనరు గష్టములు
సామ్రాజ్య మదియేల సౌఖ్యంబు లేక?"

ఈవిధంగా తత్వజిజ్ఞాస చేసిన యోగులకూ సన్యాసులకూ సలాము చేశారు సామ్రాట్టులు - సాష్టాంగ ప్రణామాలు చేశారు భారత పృథ్వీపతులు.

"జన్మదుఃఖామయ భేషజాతుయ మహో సుఖ మొక్కటి దక్క"

మరొక్కటి నిక్కమైన చొక్కమైన ఫక్కి కాదన్నారు. ఇతర "ఇజం" లో నిజం లేదన్నారు.

అందుకనే త్యాగరాజుగారు "దాంతుడైనా, వేదాంతుడైనా, శాంతములేక సౌఖ్యములేదు" అని సంబోధించి సంకీర్తనం చేశారు. ఇంద్రియములను వశపరచుకొనే శక్తి దాంతి. అటువంటి దాంతి వల్ల కూడా సౌఖ్యం లేదన్నారు. దాంతికంటె ఎక్కువైనది శాంతి. శాంతిలేని వేదాంతం కూడా విషాదాంతమేగాని సుఖాంతం కాదన్నారు. త్యాగయ్యగారి మాట త్యజింతవలసింది కాదు. భజించి తరించవలసినది. ★

తిరస్కృతి

'డాక్టర్ ... డా-క్ట-ర్ ... పెం...డ్లి చేసు...కోరూ, డా...క్ట...'

ఇన్‌జెక్షన్ యిస్తున్న డాక్టరు మధుసూదనరావు చేతులు వణుకుతున్నాయి. బాధతో ముఖం పక్కకు తిప్పుకొని నిల్చున్నాడు. పేషెంటు స్వరం క్షీణించిపోతున్నది. మరల మైకం వచ్చిందని తెలుసుకొని ఒక దీర్ఘనిట్టూర్పు విడిచి తనరూముకు బయలుదేరాడు.

ఎదురుగా వస్తున్న నర్సు(గేస్ నవుతూ 'డాక్టరుగారూ, మీ పేషెంటు ఎలావుంది? పాపం, సరే అని అనకూడదూ?' అన్నది. డాక్టరు మాట్లాడే పరిస్థితిలో లేడు. పలక్కుండా తన రూముకుపోయి కూర్చొని ఆలోచిస్తున్నాడు.

రోజూ అనేక ప్రాణాలు పోవటం చూట్టానికి అలవాటుపడ్డ యీ నర్సులకు డాక్టర్లకు ఎంత భయంకర పరిస్థితి కూడా బాధ కలిగించదు. ప్రాణం విలువే తెలియకుండా పోతుంది. కాని తను కొత్తగా యీ వృత్తి ప్రారంభించాడు. కాబట్టి పూర్తిగా హృదయం మొద్దుబారిపోలా. ఒక్కొక్క ప్రాణం పోయినప్పుడల్లా తను చాలా బాధపడతాడు. కాని యిలాంటి హృదయవిదారక దృశ్యం యింతకుముందు ఎప్పుడూ తను చూడలేదు.

ఆ అమ్మాయికి దాదాపు యిరవయినాలుగు సంవత్సరాలుండవచ్చును. రాత్రి పదిగంటలకు వార్డులో చేర్చేప్పటికి స్పృహ లేదు. తను ఇన్‌జక్షన్ యివ్వగానే కళ్ళు తెరిచింది. తెరుస్తూనే ఎదురుగా నిల్చొని వున్న తననే పిచ్చిగా చూసింది. ఆమె తన జీవితంలో అనుభవించిన బాధనంతా ఆ కళ్లలోనే దాచుకున్నదా అనిపించింది. మరల పాలిపోయి క్షీణించివున్న పెదాలు కొంచెంగా కదిలాయి. అవి ఏదో చెప్పటానికి ప్రయత్నిస్తున్నాయి. తను దగ్గరకు వొంగి వినటానికి ప్రయత్నించాడు. క్షీణస్వరంలో 'డాక్టర్ ... నన్ను ... పెండ్లి చేసుకోరూ' అన్న మాటలు విని తెల్లపోయాడు. ఆమె అదే వాక్యాన్ని రెండుమూడుసార్లు వల్లించి మరల మైకంగా పడిపోయింది.

ఆమెకు కొంచెం స్పృహ వచ్చినప్పుడల్లా అదేవాక్యం పలవరిస్తూ వున్నది. డాక్టర్‌కు ఏమిచేయాలో, ఏమనాలో బోధపడటంలేదు. ఆమె యిలా డెలీరియంలో అనటానికి కారణమేమై వుంటుందా? అని ఆలోచిస్తున్నాడు.

'డాక్టర్, పదకొండవ నెంబరు బెడ్ వెరీ సీరియస్' అన్న (గేసుమాటలకు వులిక్కిపడి, యంత్రంలాగ లేచి ఆమె వెంటనే భారంగా నడిచి వెళ్ళాడు.

*　　*　　*

గిరిజ అతిసాధారణకుటుంబంలో, చాలా చిన్న గ్రామంలో జన్మించినా, చిన్నప్పటి నుండి జీవితాన్నిగురించి ఎన్నో కలలు కనేది. చాలావరకు తన సమయాన్ని ఊహాసౌధాలలోనే గడిపేది. తనతోటి పిల్లలతో కలిసి ఎప్పుడూకూడ బొమ్మలాటలుకానీ అమ్మలాటలుగానీ ఆడేది కాదు. ఆమెకు అలాంటి ఆటలంటే చాలా అసహ్యం.

వాసిరెడ్డి సీతాదేవి

ఊహాసౌధాలంటే సాధారణంగా ఆ యీడు ఆడపిల్లలు నిర్మించుకొనేవి కావు అవి. తనూ అందరు ఆడపిల్లలలాగ అత్తవారింటిలో అంట్లుతోమవలసిందేనా? ప్రొద్దస్తమానమూ యింటిచాకిరీ, అత్తమామల చాకిరీ, భర్త చాకిరీ చేసి పొట్ట నింపుకోవలసిందేనా? అత్తకు మనమళ్లను ఎత్తుకోవాలని వుంటే పిల్లలను కనవలసిన బాధ్యత కూడ తనదే. పిల్లలను కంటూ, వాళ్లు పెట్టే బాధలతో, ఏడ్పులతో -తీరికలేక, ఓపిక చచ్చి, విసుగుతో కూడిన జీవితాన్ని గడపవలసిందేనా? మిగతా సమయాన్ని ఎల్లమ్మ పుల్లమ్మ కబుర్లలో గడపవలసిందేనా? ఇంతకంటే స్త్రీకి సమాజంలో వేరే స్థానం లేదూ? యీ పనులన్నీ తన అమ్మ చేసింది, అమ్మమ్మ చేసింది. తను అలాంటి అతిసాధారణ జీవితాన్ని గడపలేదు. ప్రపంచంలో నూటికి నూరుమందీ గడిపేలాంటి జీవితాన్ని తను గడపదు. తనలాంటివాళ్లు వెయ్యికి ఒక్కరుకూడ వుండరు.

ఇలాగ గిరిజ ఆలోచిస్తూ వుండేది.

యస్. యస్. యల్. సి. పాసయిన తరువాత యింకా చదవాలనే వుద్దేశ్యం వున్నప్పటికి చదవలేకపోయింది. దానికి కారణం కుటుంబ ఆర్థికపరిస్థితే. బంధువులకు, కులపువాళ్ళకు యిష్టం లేకపోయినా ఆమె ఉద్యోగంచేయ నిశ్చయించుకున్నది. ఆమె తల్లిదండ్రులు కూడ ఆటంకపరచలేదు.

కొద్దిరోజుల్లోనే తెలిసినవాళ్ళ ద్వారా ఒక ఆఫీసులో ఉద్యోగం దొరికింది గిరిజకు. జీతం నెలకు ఎనభైఅయిదు రూపాయలు. మద్రాసులో అమ్మానాన్నతో కాపరం పెట్టింది.

ఆమె మాటల్లోని నిండుతనమూ, చూపుల్లోని గాంభీర్యమూ, నడకలోని ఠీవీ, చూసిన ప్రతివారూ ఆమెను గౌరవించకుండా వుండలేరు. ఆమె అందరితో చాలా ఫ్రీగా మాట్లాడేది. స్త్రీలతో మాట్లాడేప్పుడు ఎలా వుండేదో అలాగే నిర్వికారంగా పురుషులతో మాట్లాడేప్పుడు కూడ వుండేది. కొంతమంది స్త్రీలు పురుషులతో మాట్లాడేప్పుడు ఎందుకు సిగ్గుపడతారో ఆమెకు అర్థంకాదు. అలాగ కులుకుతూ, కళ్లు తిప్పుతూ సిగ్గుపడే ఆడపిల్లలంటే ఆమెకు పరమ అసహ్యం.

సిగ్గు అనేది స్త్రీలోని బలహీనత మాత్రమేనని ఆమె అభిప్రాయం. అందువల్లనే సిగ్గు నభినయించాలంటే ఆమెకు చాలా సిగ్గు. అంటే ఆమె సిగ్గు విడిచిందని కానీ బొత్తిగా సిగ్గు లేదనిగానీ అనుకోకూడదు. ఆమెకు యీ సిగ్గు అభినయించే చాలా ఆడవాళ్ళకంటే చాలా ఎక్కువ సిగ్గే. అందువల్లనే ఆమె ఎప్పుడూ చాలా జాగ్రత్తగా, నిర్వికారంగా, గంభీరంగా, ఠీవిన్నీ తప్పకుండా జీవితాన్ని లాక్కువస్తున్నది.

మూడు సంవత్సరాలు గిరిజ జీవితం సాఫీగా గడిచిపోయింది, ఏ ఒడుదుడుకులూ లేకుండా. యీమధ్యలో ఆమెకు చాలా మంది స్నేహితులు కూడా అయ్యారు. స్నేహితులతో ఖులాసాగా కాలం గడుపుతుంటే ఒకదినంగా తన ఆదర్శాలన్నింటినీ మర్చిపోయిందనే చెప్పాలి అంటే ఏదో చేయాలి, ఏమో కావాలి అనే కోర్కె తగ్గింది. కాని మొత్తంమీద జీవితంలో ఏదో వెలితి అనుభ

విస్తున్నది. అదేదో ఆమెకే అర్థంకాదు ఎంత ఆలోచించినా.

క్రమంగా ఆమె వాస్తవిక జగత్తులోకి వస్తున్నది. జీవితమంటే ఏమిటో అర్థమవుతున్నది. ఒకోకసారి ఒంటరిగా కూర్చొని గంటలతరబడి ఆలోచించేది. ఒకస్త్రీ, ఒక పురుషుడు, ఏ యిద్దరు స్త్రీలలాగనో లేక ఏ ఇద్దరు పురుషులలాగనో స్నేహభావంతో ఎందుకు మెలగలేరు? ప్రపంచం అనేకవిధాలుగా ఎందుకు ఆడిపోసుకుంటుంది?


తను నాలుగురోజులు నవ్వుతూ మాట్లాడేప్పటికి రామారావు పెండ్లి చేసుకోమన్నాడు. సుబ్బారావు ప్రేమిస్తున్నానన్నాడు. అతని ప్రేమ క్షణికం కాదట. అతని ప్రేమకు ప్రతిఫలం లభించనిపక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని బెదరించాడు. రాజారావు జీవితమంతా బ్రహ్మచర్యం అవలంబిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. యిలాగ తనకు పరిచయమైన ప్రతివాడూ కొంచెం పాతిపడగానే తమ ప్రేమను ప్రకటించేవారే. యీరోజు వాళ్ళంతా పెళ్ళిళ్ళు చేసుకొని కులాసాగా జీవితం గడుపుతున్నారు. అంతేకాదు అందులో కొంతమంది తననుగురించి దుష్ప్రచారంకూడ చేస్తున్నారు.

ఒకోసారి తన ప్రవర్తనకూడ దీనికంతా కారణమేమోననే అనుమానం కలుగుతుంది. కాని తన ప్రవర్తనలో ఎలాంటి బలహీనతా కన్పించదు. ఒకటిమాత్రం ఒప్పుకోక తప్పదు. ఒక్కొక్కడూ తనదగ్గర ప్రేమను ప్రకటించి, తిరస్కరింపబడి, ముఖం వేలవేసుకుని వెళ్ళినప్పుడల్లా, తనకేదో తృప్తిగా వుంటుంది. ఒకరకమైన ఆనందం కూడ కలుగుతుంది. బహుశా అందువల్లనే కావచ్చు, తనకు తారీఖులతో సహా ఎవరిని ఏ రోజు ఎలా ఏడ్పించి పంపినదీ, యిప్పటికీ జ్ఞాపకం వున్నది.

ఒకోసారి యిదంతా ఆలోచిస్తే ఆమెకు బాధగా కూడ వుంటుంది. తనచేత తిరస్కరింపబడిన వారిమీద జాలి కలుగుతుంది. మరల యిలా సరిపెట్టుకుంటుంది. తను మాత్రం ఏమి చేయగలుగుతుంది? తనకు ప్రేమ అనే ఆ రెండు అక్షరాలకు అర్థం తెలిస్తేగదూ ప్రేమించటానికి? సాధారణంగా నూటికి నూరుమందిలో వుండే ఆ బలహీనత తనలో ప్రవేశించటం అసంభవం. అదేమిటో కాని తనను ఎవరైనా చాలా యిష్టపడుతున్నట్లు బయటపడితే ఆమె సహించలేదు. అలాంటి వారంటేనే తనకు చాలా అసహ్యం.

యీమధ్య రంగారావుతో ఆమెకు కొత్తగా పరిచయమేర్పడింది. అతనిది ఎప్పుడూ నవ్వుతూవుండే స్వభావం. ఎప్పుడూ చాలా కులాసాగా, హుషారుగా కబుర్లు చెబుతుంటాడు. బాగా చదువుకున్నవాడూ, కల్చర్ కలవాడు కూడ. గిరిజను నిలేసి 'నీకు అతనంటే యిష్టమా' అని అడిగితే చస్తే ఒప్పుకోదు, కాని అతనంటే తనకు యిష్టమా అని అప్పుడప్పుడూ ఆమెకే అనుమానం కలుగుతూండేది. కొంతకాలం పాటు రంగారావు తన ప్రేమను వెల్లడించకపోతే ఎలా పోయి ఎలా వచ్చేదో! కాని ముక్కుకు సూటిగాపోయే రంగారావు ఒకరోజు అడిగేశాడు—

'నీవంటే నాకు యిష్టం, నేనంటే నీకు యిష్టమేనా?' అని. ఆ ప్రశ్నతో గిరిజ



గేట్ వే ఆఫ్ ఇండియా

(ఫొటో:) ఎమ్. జగన్నాధరావు (జెమ్‌షెడ్పూర్)

★ తిరస్కృతి ★

ఉలిక్కిపడ్డది. చాలా సిగ్గు, కోపం కలిగాయి. కాని నిబ్బరించుకుని 'లేదు' అన్నది. కాని ఆ 'లేదు' అనేప్పుడు యింతకుముందు కలిగే ఆత్మతృప్తిగానీ, ఆనందంకానీ ఈమారు కలుగలేదు. ఒకరకమైన బాధకూడ కలిగింది. తన హృదయాన్నంతా వెతకసాగింది; ఏ మూలనైనా అతనికి స్థాన మున్నదేమోనని.

తలెత్తి చూసింది. రంగారావు లేడు. ఆశ్చర్యం కలిగింది. అంత త్వరగా, తేలిగ్గా వదులుతాడనుకోలా. కొంచెం బుర్రవున్నవాడే ననుకున్నది.

ఆ రాత్రంతా గిరిజకు నిద్రపట్టలేదు.

తను చేసింది పొరపాటని హృదయం ఘోషిస్తున్నది. కాని మనస్సు చాలా తెలివైనదానివని వీపు తడుతున్నది.

రెండవరోజు రంగారావు స్నేహితుడు ప్రభాకర్ అతన్ని వెతుక్కుంటూ వచ్చాడు. రాత్రినుండి అతను రూముకు రాలేదట.

ప్రభాకర్ డాక్టరు చదువుతున్నాడు. ఆవలిస్తే పేగులు లెక్కపెట్టే ఘటం. తూచితూచి మాట్లాడుతాడు. సాధారణంగా యిలా చాలా తక్కువమాట్లాడే, వాళ్ళ ఎక్కువమాటలు వ్యర్థంగాపోవు. ఇతరుల మీద చాలా ప్రభావం పడుతుంది. యిలాంటివారు వీలయినంతవరకు ఇతరుల నుండి విన ప్రయత్నిస్తూ, తాము మాత్రం చాలా తక్కువ మాట్లాడతారు.

ప్రభాకర్ ఒకటి రెండుసార్లు రంగారావుతో గిరిజయింటికి వచ్చాడు. ఆ కొద్ది పరిచయంలోనే చాలావరకు గిరిజను అర్థం చేసుకున్నాడు. అంగువల్ల రంగారావును తొందరపడవద్దని హెచ్చరించాడుకూడ. మొగవాడు ఎంత తొందరపడి తన ప్రేమను వెల్లడిస్తాడో ఆడదాని దృష్టిలో అంత తేలికయిపోతాడని అతని నమ్మకం.

గిరిజనుండి సరైన జవాబు రానప్పటికీ జరిగిందంతా వూహించుకున్నాడు. 'రంగారావుకు నీవు చాలా ద్రోహం చేసినట్లు తెల్సుకున్నావా? అతన్ని నీవు సరిగా అర్థం చేసుకోలేదు. మరల చస్తే తిరిగి రాడు.' అన్నాడు ప్రభాకర్ కొంచెం తీవ్రస్వరంలో.

'దానికి నేను బాధ్యురాలను కాను. ఆడది కొంచెం స్వతంత్రంగా మాట్లాడగానే అపార్థం చేసుకోవటం, మరల తమ కేదో ఘోర అన్యాయం జరిగినట్లు వూహించుకొంటూ ప్రపంచంనుండి పారిపోవటం ఆడదానితప్పా?' చాలా తీవ్రస్వరంలో అన్నది గిరిజ.

ప్రభాకర్ మౌనంగా కూర్చొని ఆలోచిస్తున్నాడు. స్త్రీ తన ప్రేమను వెల్లడించదు. పురుషుడ్ని కవ్వించి, అతనిచేత చెప్పించి మరల తేలిగ్గా ఎందుకు చూస్తుందో? స్త్రీ ఎలాంటి పరిస్థితిలోనూ తానే ముందు బయటపడదా? ముఖ్యంగా తన సంయమ శక్తిమీద అంత గర్వమూ, అహంకారమూ గల గిరిజ?

'కాఫీతాగండి తరువాత ఆలోచిద్దురు గాని' అన్నమాటతో ఉలిక్కిపడి యాదాలాపంగానే కప్పు చేతిలోకి తీసుకున్నాడు. ఎదురుగా కూర్చుని కాఫీ తాగుతున్న గిరిజ ముఖంలోకి గుచ్చిగుచ్చి చూస్తున్నాడు. అతనలా చూడటం గిరిజకు చాలాసిగ్గుగావున్నది. అటూ యిటూ చూస్తూ అతన్ని మాటలోకి దించ ప్రయత్నిస్తున్నది. కాని మౌనంగా కూర్చొని ఆమె మాటలను మాత్రమే వింటున్న ప్రభాకర్ ముందు ఎక్కువసేపు మాట్లాడలేకపోయింది. టేబుల్ మీదవున్న పుస్తకాన్ని తిరగేస్తూ కూర్చున్నది.

'యింక నే వస్తాను' అంటూ జవాబుకు ఎదురుచూడకుండానే వెళ్ళిపోయాడు ప్రభాకర్. ప్రభాకర్ లాంటి మగవాళ్ళను గిరిజ జీవితంలో మొదటిసారిగా కలుసుకున్నది. ఇంతకుముందు కలుసుకున్నప్పుడు కొత్తవల్లనూ, రంగారావు కూడ వుండటం వల్లనూ అతనలా మౌనంగా వున్నాడనుకున్నది. యింకొకసారి ప్రభాకర్ ను కలుసుకుంటే బాగుండు ననిపించింది. మరల కాలు జారుతున్నది జాగ్రత్త అని లోలోన ఎవరో హెచ్చరిస్తున్నారు.

ఎంత మర్చిపోవాలని ప్రయత్నిస్తున్నదో ప్రభాకర్ అంత జ్ఞాపకం వస్తున్నాడామెకి. ఆఫీసు పనిలోకికూడ మనస్సు పోవటంలేదు. మరల తనయింటికి వస్తాడా? ఒకవేళ రాకపోతే? రాకపోతే తనకేం? లేదు, తప్పక వస్తాడు. ఆఫీసు పనిలో విసుగు కలిగినప్పుడల్లా అరచేతిలో ప్రభాకర్ పేరు రాసి రాసి చెరుపుతూన్నది. యీ వారంరోజుల్లో ఎక్కడ ఏ పేపరు దొరికినా ప్రభాకర్ పేరు రాయడం జరుగుతున్నది. తనలో బలహీనత ఏర్పడుతున్నది. చివరకు తనూ, అమ్మ, అమ్మమ్మల జీవితాన్ని గడపటానికే తహతహలాడుతున్నది కాదు, ఎప్పటికీ కాదు. తన వున్నత భావాలేమైనవి?

ఇక తను ప్రభాకర్ పేరుకూడ ఉచ్చరించదు. తనుతప్పక ఆదర్శమయమైనజీవితంగడపాలి. అంటే ఏంచేయాలి? ఉద్యోగంలో ప్రవేశించకముందు ఉద్యోగం చేయటమే జీవితాదర్శమనుకున్నది. కాని యిప్పుడు ఏదో అసంతృప్తి తనను వెంటాడుతూంది. ఎనభైఅయిదు రూపాయల చాలీచాలని జీతం. పొద్దస్తమానం సిరామరకలతో నిండి నలిగివున్న ఫైల్సూ, సిరాబుడ్డి, కలం, యిదేనా తన జీవితం. ఆదర్శమయ జీవితం?

కాదు. తను తప్పక పైకిపోవాలి. ప్రైవేటుగా యింటరు, బి. ఏ పాసు కావాలి. తరువాత? కొంచెం ఎక్కువ జీతం యిచ్చే ఉద్యోగం వస్తుంది. సరి బాగానేవుంది. ఆ తరువాత? జీతం పెరగటమేనా జీవితాదర్శం?

కాదు. మరి? ప్రభాకర్ ను పెండ్లిచేసుకుంటే? ఛీ. విసుగుతో మధ్యాహ్నం సగం

వరకూ చదివిన నవల తీసుకుంది చేతిలోకి.

మరల ఆలోచనలు ఈగల్లాగ ముసురుకుంటున్నాయి. అందులోని కథానాయిక స్వభావంకూడా తన స్వభావంలాంటిదే. కాని ఒక భేదంమాత్రం కన్పిస్తున్నది. తన జీవితలక్ష్యం ఒకటంటూ నిర్ణయించుకోలేకపోతుంది. కాని ఆమె మాత్రం తన జీవితలక్ష్యాన్ని దేశసేవగా పెట్టుకున్నది. మగవాళ్ళతో ఎంత చక్కగా, ధైర్యంగా కలిసి మెలిసి పనిచేస్తుంది! ఆ మగవాళ్లుకూడ తను చూసినవాళ్ళకు భిన్నంగానే వున్నారు. ఎంత చక్కగా దేశ, విదేశాల సమస్యలను గురించి చర్చించుకుంటారు! ఎవరు ఎవర్నీ అనుమానించరు. అసలు వారు స్త్రీ పురుష భేదాలను గుర్తిస్తున్నట్లే కన్పించదు. తనుకూడ ఏ విప్లవకారులముఠాలోనో చేరితే?

కాని తనలో అంత ధైర్యమూ శక్తీ వుందా? రాత్రిళ్లు ఒంటరిగా నాలుగుగోడల మధ్యవుండడానికే భయపడుతుంది. అలాంటి ఆమె కొండగుహల్లో అరణ్యాల్లో వుండగలదా?

గిరిజ మొదటినుండి యిలాంటికలలతోటే కాలం గడిపేది. కాని యిప్పుడు బలహీనతను దాచుకోవటానికి పగటి కలలు మరింత ఎక్కువైనాయి. కలలు కనటం తప్పుగాదు. కాని ప్రతికలా నిజంకావాలని ఆశిస్తూ వాస్తవికజగత్తునుండి పారిపోవ ప్రయత్నించటమే గిరిజ చేసినతప్పు.

ఆదివారంవచ్చింది. ప్రభాకర్ వచ్చాడు. గిరిజ గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. అతన్ని కూర్చోమంటూనేపోయి అద్దంముందు నిలబడింది. పౌడరు కొట్టుకొని ముంగురులు సరిచేసుకొనివచ్చి కూర్చున్నది.

'ఏమండీ, ఎక్కడికేనా వెళ్లుతున్నారా?' అన్నాడు ప్రభాకర్ 'లేదే, ఏమి?' అన్నది గిరిజ, అలా ఎందుకడుగుతున్నాడో అర్థం కాక. 'ఆఁ ఏంలేదు, పౌడరు వేసుకొని వచ్చారులాగున్నది. అందువల్ల బయటకు వెళ్ళబోతున్నారేమో అనుకున్నాను' అన్నాడు వచ్చేనవ్వు ఆపుకుంటూ.

గిరిజకి తల కొట్టేసినట్లయింది. యింకొకరయితే యీపాటికి గెట్ అవుట్ అని వుండేది. అసలు యింకొకరు మాట్లాడేప్పుడు తనకు పౌడరు వేసుకోవాలనిపిస్తేగదూ? చివరకు చేసేదేమీలేక చాలా కొంటెగా మాట్లాడుతాడని సరిపెట్టుకున్నది.

మరల నిశ్శబ్దం. గిరిజ చాలా యిరుగ్గా ఫీలవుతుంది. తనకు ఏ రోజూ ఎవరిముందూ సిగ్గు కలగంది, ప్రభాకర్ ముందు ఎందుకో అంత సిగ్గు? అతన్ని చూస్తేనే అదోలా వుంటుంది. ఎలా వుంటుందని ఎవరైనా అడిగితే తనకు చెప్పటం రాదు. అతను ఏమన్నా తనకు కోపంరాదు. పైగా అతని ఒక్కొక్క మాట తన హృదయంలో చక్కిలిగింతలు పెడుతుంది.

'ఏమిటో చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నారు' అన్న ప్రభాకర్ మాటలకు గిరిజ ఉలిక్కిపడి అతని ముఖంలోకి చూసింది. అతను సిగరెట్టుపొగ వూదుతూ ఆ అలలలోకే దీక్షగా చూస్తున్నాడు. అతను తనను చూడటంలేదు కాబట్టి అతని ముఖాన్ని చూస్తున్నది. యింకా కొంచెంసేపు అలా వుంటే బాగుండు ననిపించింది. ప్రభాకర్ కళ్ళతో ఆమె కళ్లు కలవగానే రెప్పలు సిగ్గుతో బరువుగా వాలిపోయాయి.

క్రమంగా రెండు సంవత్సరాలు రెండు రోజుల్లాగ గడిచిపోయాయి గిరిజకు. ప్రభాకర్ దాదాపు ప్రతి ఆదివారం వస్తూనే వున్నాడు. రెండు సంవత్సరాలక్రితం ఒకరికొకరు ఎంత దూరంగా వున్నారో యిప్పుడూ అంతే. ఒకరికంటే ఒకరు చాలా మర్యాదగా, తెలివిగా, తూచితూచి మాట్లాడతారు. కాని ఎంత జాగ్రత్తగా వున్నా గిరిజమాత్రం అప్పుడప్పుడూ ప్రభాకర్‌కు చిక్కిపోతూనే వుంది.

ఒకోసారి గిరిజకు తనమీద తనకే జాలి కలుగుతుంది. గంటల తరబడి ప్రభాకర్ హృదయంలోని భావాన్ని గ్రహించటానికి ఆలోచించేది. తనను ప్రభాకర్ ఎందుకు యిలా ఏడ్పిస్తున్నాడు? తనను యిలా వూబిలోకి లాగి ఏడ్పించినందువల్ల అతనికి కలిగే లాభం ఏమిటి? అతను నిజంగా తనను ప్రేమిస్తున్నాడా? ప్రేమిస్తే యింతకాలం బయటబడకుండా వుండగల్గుతాడా? అలా వుండబట్టే కాదు తను అతన్ని ప్రేమి... కాదు యిష్టపడుతుంది. లేకపోతే యీ ప్రభాకర్ అందరిలో ఒకడైపోయేవాడే గదూ?

బహుశా అతను తన స్వభావాన్ని అర్థం చేసుకొనే తన ప్రేమను గుప్తపరుస్తున్నాడేమో! అలాగయినా, యిప్పుడు అతనంటే తనకు పూర్తిగా యిష్టమని తెలుసుకున్న తరువాతనైనా ఎందుకు బయటపడకూడదు? కొన్నిసార్లు కొన్ని విషయాలలో తనే తొందరపడి సిగ్గుపడ్డది. అప్పుడు కూడ అతను తనకు ఏమీ అంటనట్లే ప్రవర్తించేవాడు.

ఒకోరోజు అతని నిర్లక్ష్యతను చూస్తుంటే ఆమెకు చాలా కోపం, బాధకూడ కలిగేవి. ఆడవాళ్లు యిలా బాధపడేప్పుడు చూడటం అతనికి సరదా యేమోనని అనుమానం కలిగేది. తనుమాత్రం తక్కువేం తిన్నది? పాపం. ఆ రంగారావు ఎంత బాధపడ్డాడో? ఎక్కడ వున్నాడో, ఎలావున్నాడో కూడ ఎవరికీ తెలియదు. ఎంత కపటంలేని మనిషి? అతని ప్రేమనే స్వీకరించివుంటే? తనను దేవతలాగ పూజించి వుండేవాడు.

చివరిచివరకు ప్రభాకర్ కేవలం తనను ఏడ్పించటానికే యిలా స్నేహం చేస్తున్నాడని వూహించుకుంటుంది. అతనిపరిచయమైన మొదటినాటినుండి ఏరోజైనా, ఏ మాటల్లోనైనా ఆమెను ప్రేమిస్తున్నట్లు కన్పిస్తాడేమో నని గంటలకొద్దీ ఆలోచించేది.

అబ్బే లేదు. తన గుర్తున్నంతవరకు అతని మాటలవల్ల తన హృదయ బలహీనతను బయటకులాగి విజయగర్వంతో చిరునవ్వు నవ్వేవాడే కాని అతనుమాత్రం ఎప్పుడూ తనకు చిక్కలేదు.

ఒకరోజు తనకు చాలా యిష్టమయినచీరె కట్టుకున్నది. ప్రభాకర్ వచ్చినవాడు వూరుకున్నాడా? 'యీ చీరలో మీరు చాలా అందంగా ఉన్నాననుకుంటున్నారుగదూ?' అన్నాడు. తన హృదయం చాలా బాధపడింది ఆరోజు. యింకొకరోజు 'పాపం, మీరు చాలా జాగ్రత్తగానే వుంటారు, కాని అప్పుడప్పుడు మాత్రం మీకు తెలియకుండానే బయటపడుతుంటారు' అన్నాడు.

పోయినఆదివారంరోజు అతను జేబులోనుండి సిగరెట్టుపెట్టె తీసుకొనేప్పుడు ఒక ఫొటో క్రిందపడింది. అది చేతిలోకి తీసుకొని చూసింది. ఒక అందమైన అమ్మాయి ఫొటో. తనుఫొటో చూస్తుంటే, ప్రభాకర్ తనముఖం చూస్తున్నాడని గ్రహించుకుని అడిగింది 'యీ అమ్మాయి ఎవరూ?'

'నీలాంటి ఒక స్నేహితురాలు.'

ఆ మాటకు తను చాలా బాధపడ్డది. పలక్కుండా ఫొటో టేబుల్ మీద పెట్టింది.

'ఏం, యీర్ష్య కలుగుతుందా?' అన్నాడు నవ్వుతూ కళ్ళలోకి చూస్తూ.

'నా కెందుకయ్యా యీర్ష్య?' అంటూ నవ్వ ప్రయత్నించింది.

'అదేమాట నా కళ్ళలోకి చూస్తూ చెప్పండి' అన్నాడు. తనకు నిజంగా కోపంకూడ వచ్చింది.

'అంటే, మీ అభిప్రాయం?' అన్నది కొంచెం తీక్ష్ణంగానే. కాని ఆమాట అనేప్పుడు అతని ముఖంలోకి కాక ఎక్కడకో చూస్తున్నది.

యిదంతా ఒకసారి తిరిగి తల్చుకుంటే ఆమెకు ఎప్పుడూ ఎక్కడా ప్రభాకర్ తనను ప్రేమిస్తున్నట్లు కన్పించలేదు.

ఒకోరోజు విసుగుపుట్టేది గిరిజకు. ఇలా ఎన్నిరోజులు? పోనీ తనే తన ప్రేమను ప్రకటించి అతని అభిప్రాయం అడిగితే? కాని ఒకవేళ ప్రభాకర్ తన ప్రేమను తృణీకరిస్తే? బాధకంటే ముందు అవమానంతో తను ఆత్మహత్యం చేసుకోవాలింక

★ తిరస్కృతి ★

ఎంత బాధనైనా హృదయంలో దాచుకొని తను బ్రతకగలుగుతుంది కాని, ఒకసారి అవమానింపబడి తను బ్రతకలేదు ప్రభాకర్ ఒప్పుకున్నా, ముందు తానే అతన్ని పెండ్లిచేసుకోమని కోరి దాంపత్య జీవితం సుఖంగా గడపగలుగుతుందా? లేదు, జీవితమంతా ప్రభాకర్ తనమీద దయదలచి చేసుకున్నట్లు ప్రవర్తిస్తాడు తను అణిగిమణిగి పడివుండాలి

ఇలాంటి మానసిక సంఘర్షణలోనే మూడు సంవత్సరాలు దొర్లిపోయాయి యిప్పుడు ప్రభాకర్ సివిల్ సర్జన్‌గా పని చేస్తున్నాడు. గిరిజ జీవితంలో ఏ మార్పూ లేదు. 'గొర్రెతోక బెత్తెడే' అన్నట్లున్నాయి జీతం, జీవితం


గిరిజ ఆశలన్నీ నిరాశలుగా మారుతున్నాయి. జీవితంమీదనే విరక్తి కలుగుతున్నది. ప్రభాకర్ మొదటినుండి చివరివరకు తనకు ఒక ప్రశ్నలాగ తయారయాడు. ప్రభాకర్ మనస్సులోని అభిప్రాయాన్ని గ్రహించే శక్తి తనకు లేదు

చివరకు అతను తనను ప్రేమించటం లేదని నిర్ణయించుకున్నది. ఎలా ప్రేమిస్తాడు? అతను ఒక డాక్టరు, డబ్బున్నవాడు. పైగా అందగాడనే కీర్తీ కూడ వున్నది. మరి తనో, ఒక మామూలు క్లార్కు. చెప్పుకోతగ్గ అందమూ లేదు. పెద్దలు సంపాదించినదైనా ఇంత వున్నదా అంటే అదీ లేదాయె మరి యిక తనలో ఏ గుణాన్ని చూసి ప్రభాకర్ తనను ప్రేమిస్తాడు! యీ ఆలోచనే మూడు సంవత్సరాల క్రితం తట్టి వుంటే? ఇప్పుడు సమయం మించిపోయింది. అక్కడనుండి వెనక్కుపోలేదు. జీవితయాత్రలో ఎంతోమంది వ్యక్తులతోటి పరిచయం కలుగుతుంది. అందులో చాలా కొద్దిమంది మాత్రం హృదయకవాటంవరకూ ప్రవేశిస్తారు. ఆ కొద్దిమందిలో ఏ ఒకరిద్దరో లోపలకు తొంగి చూడగలుగుతారు. కాని లోపలకు ఒక్కరుమాత్రమే ప్రవేశింపగలరు. ఆ అదృష్టం ఏ కొద్దిమందికో కలుగుతుంది.

రామారావు, సుబ్బారావు మొదలైనవారు తన హృదయకవాటంవరకూ వచ్చికూడ విఫలులై వెళ్ళిపోయారు. రంగారావు తొంగి చూడగలిగాడు. కాని యీ ప్రభాకర్ సునాయాసంగా లోపలప్రవేశించటమే కాకుండా హృదయాన్నంతా ఆక్రమించుకున్నాడు.

యీమధ్య ప్రభాకర్ గిరిజయింటికి రావటం తగ్గించాడు. వచ్చినా ముళ్ళమీద నిల్చున్నట్లు కన్పిస్తాడు. గిరిజమీద దయదలచి వస్తున్నట్లుంటుంది అతనిమాటలధోరణి. గిరిజహృదయం అతను యింత నిరక్ష్యంగా నిర్దయగా మాట్లాడుతూంటే బాధతో మూల్గేది కాని ఆమూల్గు ప్రభాకర్ చెవులవరకూ పోకుండా అణిచిపట్టేది.

అతను వెళ్ళిపోతూంటే 'మరల ఎప్పుడు వస్తారూ?' అని అడగాలనిపించేది కాని ఆత్మాభిమానం ఆమె పెదాలను బంధించేది. అతని రాకపోకలవల్ల తనకు ఎలాంటి ఆనందమూ, బాధ లేనట్లు ప్రవర్తించేది.



తాజ్‌మహల్

ఫోటోలు: ఎమ్. జగన్నాథరావు (జమ్‌షెడ్పూర్)

ఒకోసారి అతను తనను చాలా తేలిగ్గా చూస్తున్నాడనే భావం రాగానే ఆమెకు అభిమానం వచ్చేది. హృదయానికి దెబ్బ తగిలేది. యీసారి అతను వచ్చినప్పుడు తనూ చాలా నిర్లక్ష్యంగా ప్రవర్తించాలని వూహించుకొనేది. ఒకోరోజు వీలయినంత వరకు అవమానపరచి 'నీవు వూహించుకుంటున్నట్లు నీమీద నా కేమంత ప్రేమ ఒలికిపోవటం లేదులే' అన్నట్లు ప్రవర్తించాలనుకొంటుండేది.

కాని ప్రభాకర్ ను చూడగానే ఆమె కోపమంతా మంచుగడ్డలాగ చల్లబడిపోయేది. దీపంముందు కరిగిపోయే కొవ్వొత్తిలాగ ఆమె ఆత్మాభిమానం ప్రభాకర్ మౌనం ముందు కరిగిపోయేది.

ఒకరోజు ప్రభాకర్ అకస్మాత్తుగా రాత్రి ఎనిమిది గంటలకు వచ్చాడు. గిరిజ కిటికీ దగ్గర కుర్చీలో కూర్చొని ఎక్కడో శూన్యంలోకి చూస్తోంది. ఆమె కళ్ళవెంట నీరు కారుతున్నది. ప్రభాకర్ దగ్గేంత వరకూ ఆమె యీ ప్రపంచంలోకే రాలేదు.

అతను చూడకుండా కన్నీళ్లు తుడుచుకో ప్రయత్నించింది. 'ఏడుస్తున్నారెందుకండీ?' అన్న అతని మాటలకు సిగ్గుపడింది.

అతని ముఖంలోకి చూసింది. అదే కొంటెచూపు, చిరునవ్వు, మౌనం. గిరిజ శరీరమంతా అవమానంతో బాధతో వణికిపోయింది. గుండెల్లో గంగాళాలు కుతకుతలాడుతున్నాయి. 'ఛీ, రాక్షసుడా, నా జీవితాన్ని నాశనం చేశావు' అని గట్టిగా అరవబుద్ధయింది. కాని అరవలేదు. వణుకుతున్న పెదాలతోనే వుద్రేకాన్ని అణచుకున్నది. ఎలా తిడుతుంది? ఏమని తిడుతుంది? ప్రభాకర్ తన పాత్రను చాలా నేర్పుగా నిర్వహించుకున్నాడు. అతను తనకు ఏమయినా మాట ఇచ్చాడా? లేక ఏమన్నా ఆశలు చూపించాడా? ఆశలు చూపలా? చూపాడు కాని నోటితో కాదు, మౌనంగానే...

'మీరూ అందరు ఆడపిల్లల్లాగానే ఏడుస్తారన్నమాట' యీ మాటల్లోని వ్యంగ్యం గిరిజను చాలా బాధపెట్టింది.

'అంటే మీ అభిప్రాయం?"

'ఆఁ ఏమీ లేదు. ఎందుకు ఏడుస్తున్నారా అని ఆలోచిస్తున్నా. నూటికి నూరుమంది ఆడపిల్లల్లో వుండే బలహీనత మీలోనూ కన్పించటం చాలా ఆశ్చర్యంగానే వున్నదిసుమా!'

'అదంతా మీ కనవసరం. మీరు మీ స్థానాన్ని గుర్తుంచుకొని మాట్లాడండి. ఒక్క విషయంమాత్రం తెలుసుకోవాలని నా మనవి. మీకూ యీ ఏడుపుకూ ఎలాంటి సంబంధమూ లేదు"

'నిజంగానా?' అంటూ తన కళ్ళలో ఏదో చదవటానికి ప్రయత్నిస్తున్న ప్రభాకర్ మీద అసహ్యం కోపం కలిగాయి. 'మీరేదో అపోహపడుతున్నారులాగున్నది. మీరు వూహించేది ఏమాత్రం నిజంగాదని తెలుసుకోవాలని నా మనవి. దయచేసి మీరు మా యింటికి రావటం తగ్గిస్తే కూడ మంచిదే.'

'క్షమించండి. పాపం. ఈ రోజు మీ మనస్సు మీ వశం తప్పిపోతోందిలా వుంది. నేను అనవసరంగా మిమ్మల్ని బాధపెట్టతల్చలేదు. కాని వెళ్ళేముందు ఒక్కవిషయంమాత్రం చెప్పదల్చుకున్నాను. మిమ్మల్ని నేను ఎప్పుడూ తేలిగ్గా చూడలేదు. అంతేకాదు. నేను మిమ్మల్ని చాలా గౌరవంగాకూడ చూస్తున్నాను. ఎప్పుడైనా మీకు నా అవసరముంటే కబురుచేయండి వస్తాను. జీవితంలో మీరు ఏదికోరినా చేయటానికి సిద్ధంగా వున్నాను."

గిరిజకు కోపంతో శరీరం వణికిపోతుంది. ఎంతగర్వం అనుకున్నది.

'మీరు నాకు చేయగలిగింది, నేను మిమ్మల్ని కోరదగింది నాకేమీ కన్పించటం లేదు' అన్నది గిరిజ.

'దానికేంలెండి. మనిషికి మనిషి ఎప్పుడైనా అవసరమౌతారు' అంటూ తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు ప్రభాకర్. ఆ చివరివాక్యాలు వణుకుతున్న కంఠంలోనుంచి వచ్చాయి. ముఖంలో కళ్ళలో ఒక రకమైనబాధకూడ కన్పించింది గిరిజకు.

వెళ్లిపోతున్న ప్రభాకర్ ను 'ప్రభాకర్! నిన్ను ప్రేమిస్తున్నాను. పెండ్లిచేసుకోవూ' అని అరుద్దామనిపించింది. కాని అంతలోనే ప్రభాకర్ వెళ్ళిపోయాడు.

నెలరోజులు గిరిజకు చాలా ఘోరంగా భయంకరంగా గడిచిపోయాయి. ప్రభాకర్ వస్తాడని ఎదురుచూసింది. రోజులు పిడకల్లాగ గడిచిపోతున్నాయి. కొద్దిరోజుల తరువాత జ్వరం వచ్చింది. వారంరోజుల వరకూ జ్వరం తీవ్రత తగ్గలేదు. హాస్పటల్లో చేర్చారు. ఆరోజు ఆమెకు పూర్తిగా స్పృహ లేదు.

* * *

'డాక్టర్...నన్ను...పెండ్లి...చే...సు...కోరూ' అంటూ డాక్టరు మధుసూదనరావు చెయ్యి గట్టిగా పట్టుకున్నది గిరిజ.

డాక్టరు ఆలోచిస్తున్నాడు. యీమె రాత్రినుండి యిలాగనే పలవరిస్తున్నది. తెల్లవారుతుంది. కాని ఆమె డెలీరియమ్ తగ్గలేదు సరిగదా ఆమె పరిస్థితి యింకా ఘోరంగావుంది. యిప్పుడు తన కర్తవ్యమేమిటి? తను చేసుకుంటానంటే యింతలో తన సొమ్మేమిపోతుంది? కనీసం ఆమె ఆత్మశాంతితోనైనా వెళ్లిపోతుంది. ఒకవేళ ఆమె బ్రతికి బయటపడుతుందా, ఒక ప్రాణదానం చేసినవాడవుతాడు. తరువాత నిజంగానే పెండ్లి చేసుకోమంటే? తను ప్రేమిస్తున్న లలితసంగతేం కావాలి? లలితను తను ఎంత బాధ పెట్టాడు? పదిహేను రోజులనుండి వెళ్ళనేలేదు తను లలితను చూట్టానికి.

'డాక్ట...ర్...పెం...డ్లి' అన్న క్షీణస్వరం అతని ఆలోచనలకు అంతరాయం కలిగించింది. ఆమె చెయ్యి తన చేతినివదలి మంచంమీద పడిపోయింది. తల ప్రక్కకు వాలిపోయింది. ఆమె అశాంత హృదయం పూర్ణశాంతిని పొందింది.

డాక్టరు కళ్లనుండి రెండు వేడి కన్నీటి చుక్కలు రాలాయి. ఎవరిదో 'గిరిజా' అన్న బాధతో కూడిన స్వరంతో ఉలిక్కిపడ్డాడు డాక్టర్ మధుసూదనరావు.

ఎవరది? ప్రభాకరా? డాక్టర్ ప్రభాకర్? అతనికీ యీమెకూ ఏమి సంబంధం?

గిరిజ చల్లని చేతిని రెండు చేతులతో తీసుకొని ముఖానికి అద్దుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు ప్రభాకర్. డాక్టరుకు బాధకంటె ఎక్కువ ఆశ్చర్యం కలుగుతున్నది.

ప్రభాకర్ భుజముమీద చెయ్యి వేసి 'అదేమిటి, ప్రభాకర్? ఎప్పుడూ తొణకని వాడివి అలా ఆడపిల్లలాగ ఏడుస్తున్నావు? యీ అమ్మాయి నీకు తెలుసా?' అన్నాడు.

'అవును తెలుసు. మే మిద్దరం ఒకరి నొకరు ప్రేమించుకున్నాము. వీణ తీగెలు బిగించినకొద్దీ మంచి శబ్దం పలుకుతుంది. కాని మేము చేసిన తప్పల్లా తెగేంత వరకూ బిగించటమే' అంటూ పిచ్చివాడిలాగ వార్డునుండి వూగుతూ వెళ్ళిపోయాడు.

డాక్టరు ప్రభాకర్ వాక్యాన్ని అర్థంచేసుకొనే ప్రయత్నంలో అదేవాక్యాన్ని వల్లించాడు "మేము చేసినతప్పు, తెగిందాకా బిగించటమే" అని. ఒకసారి ప్రభాకర్ వెళ్ళే వైపుకూ మరల గిరిజశవంవైపుకూ చూసి 'తెగిపోయిన తీగెలు' అంటూ ఒక దీర్ఘనిట్టూర్పు విడిచి, కుర్చీలో కూలబడ్డాడు. ★

మూషికాలూ - శేషగిరీ


"ఏమండోయ్!" - భార్య సరోజ కేక.

"—" భర్త శేషగిరి మౌనం.

"ఇదిగోనండీ -"

చేయి చాపాడు శేషగిరి.

"ఏమిటది?" అంది ఆవిడ ఆశ్చర్యంతో.



"నీవు 'ఇదుగోనండీ' అంటే ఏదో ఇస్తున్నావు కాబోలుననుకుని చేయిజాస్తున్నా!"

"బ్రాగుంది సరసం! మీతో ఒకవిషయం చెప్పాలని నేననుకుంటుంటే, మీ రిలాంటి చిల్లర వేషాలు వేస్తారేం?"

"అబ్బే! చిల్లరవిగానీ టోపవిగానీ - మరి వేషాలు వేయడం మా నేస్తాగాని నీవు ఆ విషయమేమిటో విని పించు."

"ఇదుగో - ఈ ఇంట్లో ఈ బాధ నేను ఇంతకాలం నుండిఎలాఓర్చుకున్నానో గాని, మరి భరించలేనుసుమండీ -".

"ఇదుగో ఇదుగో .... సరోజా......! ఎంత మాటను ఎంతచులాగ్గా అనేశావ్! సాధ్యమయినంతవరకూ, నా ఆర్థికప్రపంచపు సరిహద్దును అతిక్రమించియయినాసరే నీ ముఖం వంకరకాకుండా వుండడానికి - నా ఇంటి కలకంఠి కంట కన్నీ రొలుకకుండా వుండడానికి ప్రయత్నిస్తూనేకదా వున్నాను?"

"అబ్బబ్బ! మీరేదో చేశారనీ, చేయ లేదనీ, చెప్పడానికి రాలేదండీ!..."

శేషగిరి కాస్త ప్రాణవాయువు పీల్చగలిగాడు.

..."ఈఇంట్లో ఆ ఎలుకలు పెడుతున్న ఇక్కట్టు భరించలేనండీ!...మనుష్యులుతిని నాశనంచేయడం చాలదన్నట్టు ఎలుకలు వేరా మనకి?"

'మనుష్యులు' అని భార్యారూపమయిన శత్రువు సరోజ సూచించింది తన మనుష్యుల నేనని' శేషగిరికి తెలుసు. కానీ శాంతికాముడు కావడంమూలాన్ని తెలుసుకోనట్టుండంతో ఊరుకున్నాడు. నెలలతరబడి 'దాని' బంధువులొచ్చి తిష్ఠ వేసినప్పుడెల్లా వారు ఈ తివాయుభక్షణం చేస్తారన్న సరోజ సిద్ధాంతం కాబోలుననుకున్నాడు.

అయినా సరోజఎదుట నిలబడి శేషగిరి ఈమాట అడగ్గలడా? అలా అడిగేధైర్యమే అతనికివుంటే ఇంగ్లాండును ఆరో హెన్రీ స్థానే మన మూడుసింహాలమార్కు 'అశోకుడు' పాలించివుండును!

"సరో! నామట్టుకు నేనేదయినా తప్పు చేసివుంటే శిక్షించు. అందుకు సిద్ధం...ఎల

కలూ, సాలీళ్లు, దోమలూ నల్లులూ - ఇవన్నీ చేసేపనులకి నేనా బాధ్యుణ్ణి? ... నేనేం క్రిమికీటకమహాసామ్రాజ్యానికి అధిపతి ననుకున్నావా, వాటిరాకను నిషేధించడానికి?" అన్నాడు శేషగిరి.

"చాలుచాలండీ మీ తెలివి...అసలు... మీరు చేయాల్సింది 'ఏమిటి' అంటే ఎలుకలు పట్టడం - అంతే - తెలిసిందా?"

"ఏమిటీ? ఎలుకలు పట్టడమా? నేనా? మంచి ఆలోచనే!... నేను పట్టేటప్పుడూ ఎలుకలు వూరుకుంటాయా? మితిమించిన ఆక్రోశంతో అవి, మీదికుఱికి కరిస్తే బాధపడేది ఎవరనుకున్నావ్..?" అని అంటుండగానే గౌరీశిఖరంమీద వున్ని దుస్తులు లేనట్టు వణికింది శేషగిరి పాంచభౌతిక దేహం..."ఏదో నేను నాలుగు కథలురాసి పత్రికలకు పంపుతూ, అవి వెనక్కు వస్తాయో లేదా అని ఎదురుచూస్తో కూచోడం నీకంటి కింపుగాలేదా? ఇంత కల్పనాశక్తి కలవాణ్ణి, భూదేవితో సమానమయిన ఓర్పుకలవాణ్ణి, రోజూ ఒక భూకంపానికి తట్టుకుంటున్నవాణ్ణి - నన్ను - కేవలం ఒక ఎలుకలు పట్టేవాడికింద తేల్చేశావే?" అని ఏదేదో అర్థంలేకుండా మాటాడేడు శేషగిరి.

"ఉస్ ... రామచంద్రప్రభో! మీరెపుడూ ఇంతేకదా?... ఏదో వెకిలిగా మాటాడుతూ వుంటారు. ఇప్పుడు మీ చేతుల్లో ఎలుకలు పట్టమని ఎవరన్నారండీ?"

"మరి నేను నా చేతుల్తోకాక మరొకరి చేతుల్తో ఎలా పడతాను?"

"అబ్బబ్బ...మీరు నన్ను సాంతం చెప్పనీరుకదా?...ఎలుక బోను తీసుకొచ్చి పట్టమన్నాను. తెలిసిందా ఇప్పుడు?"

"హమ్మయ్య...ఇదా విషయం? ఎలక్షన్ మీటింగులో అభ్యర్థి ఓటడిగినట్టు - దీనికింత పెద్ద తొలిపలుకా? ఇంత విశాలమయిన పీఠికా?" అన్న శేషగిరి ఆరోజు సాయంత్రమే ఒక ఎలుకలబోను తెస్తానని వాగ్దానం చేశాడు.

ఇంట్లో ఎలుకలబాధ 38 వ అక్షాంశ రేఖను దాటివుండడం శేషగిరి ఎరుగును. ఒకరోజు కుర్చీలో కూర్చుని ఏదో ఆలోచిస్తుంటే ఒక మూలనుండి ఒక ఎలుకా మరో ప్రక్కనుండి అంతకన్నా చిన్నది మరో ఎలుకా ఎదురెదురుగావచ్చి మూతులు నాక్కుని ముచ్చటలాడుకుంటూ 'కిచకిచ' మని వెళ్ళిపోవడం చూచాడు శేషగిరి. అది నాంది. ఆ తర్వాత మరిక్రొత్తగా బయట నుండి గృహప్రవేశం చేశాయో, లేకపోతే సినిమా షూటింగు సాగేటట్లు 'శరవేగం'తో వంశవృద్ధి జరిగిందోకాని, శేషగిరి ఇంట్లో ఎలుకల నివాసం మూడు పూవులూ ఆరు కాయలూగా విరాజిల్లింది. ఏతన్మూషిక మహాశయుల ప్రభావం సరోజినమ్మగారి ఉప్పూ పప్పూ మిరపకాయలూ వగైరాలతో ఆగక మెత్తదిండ్లూ, శేషగిరి చొక్కాలూ మొదలయినవాటి మీదకు వ్యాపించ నారంభించింది. ఇన్ని రకాల ఆహారాలను తిని బలిసిన ఎలుకలు, తమ యింట్లోకే సరోజా శేషగిరులు అక్రమంగా ప్రవేశించారన్నట్టుగా స్వైర విహారం సలిపేవి. అసలు శేషగిరి విస్తుపోయేదల్లా "ఈ ఎలుకలు నా భార్యకే భయపడ్డంలేదే! వీటి రక్తనాళాల్లో ద్రవరూపమయిన ధైర్యం ప్రవహిస్తూందేమో!" నని.

ఆరోజు సాయంకాలమే శేషగిరి ఇనుప కమ్మీలు అమర్చబడిన ఒక ఎలుకబోను పట్టుకొచ్చి సరోజ ఎదుట పెట్టాడు.

"దీన్ని మాత్రమే తెచ్చేరా?" అన్నది సహధర్మిణి.

"ఏం! ఇంకోబోను పట్రావాలా? ఒక్కటి చాలదూ?"

"అయ్యో రామా! ఎలుకకి తినడానికి ఏదైనా పెడితే కదండీ అది బోనులోకి రావడానికి? వెంటనే వెళ్లి వెంకటాకేఫ్‌లో ఒక మసాలా గారె పట్టుకురండి."

"ఎలుక మనకేం వియ్యంకుడా వియ్యపురాలా మసాలా గారెతో సత్కరించడానికి?...అందులోనూ వెంకటా కేఫ్ 'గారె' కావాలని 'మెమొరాండాం' సమర్పించిందా ఏం...హూం...ఏమీ అక్కర్లేదు. ఇంట్లో ఏదైనా వుంటే పెట్టు. 'తినను' అంటే పళ్లూడదన్ని బయటికి తరుము."

"చాలండీ. ఎవరయినా వింటే నవ్విపోతారూ - అయినా ఇలా ఏదీ తెలియని మొగాళ్లెక్కడయినా వుంటారా? ఉల్లిపాయ వాసనకయితే గాని ఎలుకలు త్వరగా రావండీ..."

ఉల్లిపాయగారె వెంకటా కేఫ్‌లో పెద్ద పళ్లెంనుండి శేషగిరిద్వారా సరోజను చేరింది. దాన్ని సరోజ బోనులోని కమ్మీకి తగిలించి 'సుస్వాగతం' అన్న బోర్డు తగిలించడం మినహా అన్నివిధాలా బోను సిద్ధం చేసి వంటింట్లో అలమారమీద వుంచింది.

'బాంబార్డ్‌మెంట్'కి ముందురోజు 'ఫ్రంట్ లైన్'లోని సైనికుడిలా వుంది సరోజ మనసు. ఆరోజు రాత్రల్లా ఆవిడ జాగరణ చేయడం కాక శేషగిరిని కూడా సరిగా నిద్రపోనీలేదు. "ఏదో చప్పుడు వినపడుతూందండీ! ఎలుక పడినట్లుంది. వెళ్లి చూచిరండీ!" అని శేషగిరిని ప్రతీ అరగంటకోసారి వంటింటివైపు పంపించేది. ఐదారుసార్లు శేషగిరి వెళ్ళిచూచాడు కానీ ఎలుక పడ్డ సూచన లేదు. తమ ప్రయత్నాల ఫలితాన్ని ఎదురుచూచి చూచి దంపతు లిద్దరూ మూడు గంటలకల్లా నిద్రపోయారు.

ప్రొద్దున్నే మొదట సరోజ మేల్కొంది. వెంటనే శేషగిరిని లేపింది. ఇద్దరూ కలిసి వంటింట్లోకి వెళ్లి చూచారు. ఆశ్చర్యం! ఎలుకబోను ఎలా వుంచారో అలాగే వుంది. ఎలుక లేదు సరికదా బోనులోపలి గారె కూడా కనపడలేదు. "ఆహా ఎలుకలారా! మీముందు వర్జిల్ సార్కార్లెందుకూ? మీకివే నా జోహారులు" అన్నాడు శేషగిరి నోరు తెరవకుండానే.

"అసలు...ఆ ఉల్లిపాయగారె ఎక్కడికి పోతుందీ అని? బోనులోకి ఎలుక వచ్చి ఉన్నట్లయితే గారెమాత్రం తీసుకుని బయటికి ఎలా పోగలదూ?" అంది సరోజ.

ఆవిడ పలుకులు బాగా గమనించితే... "రాత్రి ఐదారుసార్లు వంటింట్లోకి వచ్చి పోయినపుడెల్లా కొద్దికొద్దిగా తానే ఆ గారెను స్వాహా చేసినట్టు ఆమె సందేహపడుతున్నట్టుంది" అని ఊహించిన శేషగిరి "నాకా వెంకటా కేఫ్‌లోని ఫలహారాలేవీ నచ్చవని నీకు తెలుసునుకదా" అందామనుకుని "బహుశా! నీవు గారె సరిగ్గా తగిలించలేదేమో!" అని వూరుకున్నాడు.

నాలుగురోజు లిలాగే వరుసగా గారెలు నష్టపడ్డారు దంపతులు. ఎలుకల బోను సరిలేదా, మరి అందులో గారెలు పెట్టడంలో ఏదైనా సూక్ష్మాంశం గమనింపబడలేదా...అదీ కాకపోతే ఆ ఎలుకలు, ఎంత ఎత్తున, దేన్లో పెట్టి, ఎలా మూసినా, తినుబండారాలను అతిలాఘవంగా కొట్టేసే తన బావమఱది జగదీశం రకానికి చెందినవా, అన్న సందేహాలు మెరిశాయి శేషు బుర్రలో.

అయినా ఒక్కరోజు జరగనే జరిగింది; నిజంగానే జరిగింది! అవిరళ హర్షానికీ అంతులేని అక్కజానికీ హేతుభూతమయిన ఆ అత్యద్భుత సంఘటన సంభవించింది... ఇదంతాకూడా శేషగిరి ఇంట్లో ఒక తెలివి తక్కువ ఎలుక బోనులో చిక్కుకోవడాన్ని తెలుపుతున్నాయని ప్రజలు పెదవి విరవొచ్చు గాని, ఆ దంపతుల కది కేవలం ఒక 'పద్మవిభూషణ' పట్టప్రదానోత్సవంలాంటి సంఘటన!

టప్‌మన్న శబ్దం విని శేషగిరిని సరోజ మేల్కొల్పింది. సంభ్రమాశ్చర్యాలు సముపాళ్ళలో సమ్మిళితమయి ప్రతిఫలిస్తున్న ముఖారవిందంతో భర్తృసమేతంగా వంటింట్లోకి ప్రవేశించింది శ్రీమతి సరోజ.

బోను కమ్మీలసందునుండి 'గురుగురు' మని తన చిన్నకళ్ళతో చూస్తున్న నల్లపిల్ల ఎలుక కనబడింది. తనఇంటి ఎలుకల్లో ఇంత

"ఆహా! ఏమి నా భవిష్యత్తు. ఈ ఐదు సంవత్సరములు ఎంత ఆశాపూరితమైనవి! ఆ నది కడ్డముగా ఉక్కుతోను, కాంక్రీట్‌తోను బ్రహ్మాండమైన గోడ కట్టుచున్నారు. అది ఒక ఆనకట్ట. నా భూములకు, మరి అనేక ఇతర భూములకు సమృద్ధిగా నీళ్లు దొరగలవు. నమ్మకములేని ఈ వానలమీదనిక నాధారపడ నవసరములేదు."

అని, పలుకు ఆ అమాయకపు రైతు మాటలలోని ఆతురత మన జాతీయ దృఢ నిశ్చయాన్ని తెలియజేయును. దారిద్ర్యములో మునిగితేలు మన భారతదేశమును సౌభాగ్యవంతముగ చేయదగు వ్యవసాయపు పరిస్థితుల నభివృద్ధిచేయుటకై పంచవర్ష ప్రణాళికలో 195 కోట్ల రూపాయలు ఖర్చుచేయనున్నారు. ఈ మహత్తర జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమములో భూమిని దున్నే రైతుదే ప్రముఖమైన పాత్ర. నిజంగా, మనదేశపు భవిష్యత్తు అతనిచేతిలోనే యున్నది.

హెచ్చైన పంట

ఈ ప్రణాళికలోని వివిధ కార్యక్రమములను ఆచరణకు తెచ్చుటకు వేలాది టన్నుల ఉక్కు ఉపయోగింపబడును. ఈ విధముగ భావి భారత భాగ్యోన్నత సౌధ నిర్మాణమునకు ఉక్కు నానా రీతుల తీరని సహాయము చేయును.

ది టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ లిమిటెడ్



TN 3932

★ మూషికాలూ - శేషగిరీ ★

మూషకముతివుందా అని ఎంతో ఆరాటపడ్డాడు, మేధాసంపత్తి ఎక్కువవున్నా అంజలు లర్పించే శేషు.

లంగరులేని నౌకలా ఆనందసాగరంలో కాసేపు అటూ ఇటూ తేలింది సరోజ. 'ఆస్టర్ లిట్జ్' తర్వాత నెపోలియన్‌లా, 'వాటర్లూ' వెనుక నెల్సన్‌లా '47 ఆగస్టు పదిహేనున భారతీయునిలా, '53 అక్టోబరు ఒకటిని ఆంధ్రునిలా ఫీలయింది సరోజ.

క్షణంలో సంతోషం మాయమయింది; దానిస్థానే తినింట్లో ఇన్నాళ్లనుండీ అపారమయిన నష్టాన్ని కలుగచేస్తూ వచ్చిన ఆ ఎలుకమీద ఆగ్రహం పుట్టుకొచ్చింది. "నిన్ను కట్టెల్లో పెట్టా!... మా అమ్మ కడుపులో చిచ్చుపెట్టా ... వెధవ ఎలుకా ... ఇన్ని రోజులనుండి నన్నా మోసగిస్తున్నావ్?... హూ ... ఏం చేస్తానో చూడు నిన్ను" అని హుంకరించి శేషగిరినై పుతిరిగి "ఏమండీ! ముండీబోను తీసికెళ్ళి ఈ వెధవ ఎలుకని వీధి చివర నొదిలిపెట్టేరండి" అని ఆజ్ఞాపించింది.

నిప్పుమీద అడుగిడినవానివలె ఎగిరి దుమికాడు శేషగిరి.

రాత్రి ఒంటిగంట. చీకటి ముసుగుతో నిశ్శబ్దం నగరాన్ని పాలిస్తూంది. అలాంటప్పుడు బయటికిపోవడమే శేషగిరికి ప్రాణాంతికమనిపించేది. అందులోనూ ఇపుడు ఎలుకబోను (ఎలుక లోపలవుండగా) తీసుకుని పోవాలట! వెళ్తూండగా ఎలుకబోను తలుపు తెరచుకుని మీదబడితే ... అమ్మయ్యో... "ఆ... ఇపుడు దీనికేం అవసరంలే? తెల్లవారనీ చూచుకుందాం" అన్నాడు శేషగిరి, తప్పించుకునే ధోరణిలో.

కానీ భైరవి వరునికి వరమీయలేదు.

"చాలబాగుంది మీరు చెప్పడం! ఇపుడే దీన్ని తీసుకువెళ్లి వదిలితే మళ్ళీ పొద్దున లోపుగా మరో ఎలుకను పట్టొచ్చు .... ఈ ఇంట్లో ఎలుకలు దొరకడమే కష్టంగా వున్నపుడు పొద్దునదాకా కాచుకుని కూచుంటారట... ఊ ఇదిగో... వెళ్ళిరండి ......"

"ఇపుడు మళ్లీ బోను పెడితే తెల్లవారే లోపుగా ఒక ఎలుక పడుతుందని ఏం నిశ్చయం?" అన్నాడు శేషగిరి.

"పడదని ఎందు కనుకోవాలి?" అన్నది సరోజ. "అర్ధరాత్రిపూట వృథాగా వింత తర్కాలు చేస్తూ నిలబడకండి. చెప్పినట్టు చేయండి!" అంది. చేయక తప్పిందికాదు శేషగిరి.

ప్రపంచమే ఒక ఎలుకబోను కాగా, ఈ గోళంమీది "గండక పుండరీక మాతంగ తురంగ మహిష వరాహ గవయగండ సింధుర సింహ శరభాది మృగగణంబు" లన్నీ అబోనులో వున్నట్టుగా శేషగిరి ఆ బోను చేత పట్టుకుని నిష్క్రమించాడు.

"అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ! హే భగవాన్! కొలతిలకందని వలువలతో ద్రౌపది మానాన్ని ఆరోజు కాపాడేవు; మరోనాడు 'సిరికిం చెప్పక శంఖ చక్రయుగముఁ జేదోయి సంధింపక'యే గజేంద్రుణ్ణి రక్షించావు; ఇంకోసారి 'చిదిమిన పాలుగారు పసిడిబుగ్గల' ధ్రువుడికి అండగా నిలిచేవు. ఇవాళ నన్ను నీటముంచవుకదా?"... "నేను ఆడదానిగా పుట్టి వుండకూడదా? ఎలాటి బాధ్యతా లేకుండా సరోజలా భర్తమీద అధికారం వుండొచ్చు కదా!"... ఇలా ఎన్నెన్నో విధాల ఏమేమో అనుకుంటూ బోను చేతబూనిన శేషు వీధిమలుపు చేరాడు.

అయినా బోను తలుపుతీయడానికి ధైర్యం చాలలేదు. ఇంతసేపట్నుంచీ లోపల అల్లాడుతున్న ఎలుక ఎంత ఉగ్రోవంతో వుంటుంది? "వీడేకదా నా స్వాతంత్ర్యాన్ని అరికట్టిన సామ్రాజ్యవాది?" అన్న కోపంకొద్దీ పీకితే-? ఇలా అనుకుంటూ బోనును క్రిందవుంచాడు శేషగిరి. కొంతసేపు అలాగే నిలబడ్డాడు. కాని అర్ధరాత్రిపూట రోడ్డుమీద ఎంతసేపని నిలుస్తాడూ?

ఐదు నిమిషాల తర్వాత - ధైర్యం చిక్కబట్టుకుని, కులదైవాన్ని స్మరించుకుని... బాలచంద్రుడు, శివాజీ, మొదలయినవారి వీరగాథలను అతివేగంగా నెమరు వేసుకుని ... నెమ్మదిగా ఎలుకబోను తలుపు తీశాడు శేషగిరి. గభుక్కున ఎలుక బయటపడి పరుగెత్తింది. అదే క్షణంలో శేషగిరి వెనక్కు త్రుళ్ళిపడి ఆ దారివెంబడే వస్తున్న ఒక వ్యక్తిని ఢీకొన్నాడు.

ఎవడో దొంగ అనుకుని శేషగిరి చేతులు రెండిటినీ గట్టిగా పట్టుకుని ఆ చీకటి వ్యక్తి "ఎవరోయ్ ఈ చీకట్లో? ఏం చేస్తున్నావ్ ఇక్కడా? దున్నపోతులా మీదికొచ్చి పడతావేం?" అని గర్జించాడు.

స్వరాన్నిబట్టి ఆ వచ్చినవ్యక్తి చివరియింటి చిదానందం అని తెలుసుకుని శేషగిరి "నేనేనండి! మీ రెక్కడికి వెళ్తోస్తున్నారూ?" అని పల్కరించాడు.

"ఓహో! మీరుటండీ"-అని ఆయన అనడంతో ఆయన తన్ని గుర్తుపట్టాడని తెలుసుకున్నాడు శేషు. దొంగ అనుకుని చిరునామా అవీ కనుక్కోకుండా పీపు మరమ్మత్తు చేస్తాడేమో అని భయపడ్డ శేషగిరికి ఇది శుభసూచక మనిపించింది.

★ మూషికాలూ - శేషగిరి ★

"నేను 'సెకండ్ షో' ప్రభాత్‌కి వెళ్ళి వస్తున్నానండీ! ఈ అకాలంలో మీరేమిటి చేస్తున్నారిక్కడ?" అని అడిగారు చిదానందం.

పూసగ్రుచ్చినట్లు శేషగిరి కథంతా వివరించేసరికి చిదానందంగారికి ఆనందం మాయమయింది. "ఏమండోయ్? ఇదేం పనీ?" అని ఉచ్చస్థాయిలో ప్రశ్నించాడు.

తాను ఎలుకలు పడితే ఈయన కింత కలవర మెందుకో అని బోధపడలేదు శేషగిరికి. "'ఇందేం పని' అని అడుగుతున్నారా. హీ-హీ-హీ-ఎలుకల వేట. హి హి హి" అన్నాడు శేషగిరి.

"మీరు ఎలుకల వేటయినా ఆడండి; దోమల వేటయినా ఆడండి.....దాంతో నాకేమీ సంబంధం లేదు! కానీ మీరు పడుతున్న ఎలుకలన్నిటినీ అర్ధరాత్రిపూట ఈవిధంగా, చడీ చప్పుడూ లేకుండా, నా ఇంటిముందర వదిలిపెట్టడం-ఏం మర్యాదా అని అడుగుతున్నా. ఏవిట్రా నా ఇంట్లో రెణ్ణెల్లనుంచీ ఎలుకల బాధ ఎక్కువయిందే అనుకుంటున్నా నేను. చాల రోజులనుండి మీరు చేస్తున్న పని ఇది అని ఇవాళకదా తెలిసింది——!" అని భూనభోంతరాళాలు ప్రతిధ్వనించేటట్లు కేకలేశారు చిదానందం.

అనాడే తను ఇంట్లో మొట్టమొదట సారిగా, బోనులో ఎలుక పడిందని శేషగిరి శతవిధప్రమాణాలతో చెప్పినా చిదానందంగారు నమ్మలేదు. చేతిలో బోనుతో శేషగిరి వుండగా అతనిమాటల నెలా నమ్మతాడూ?

"ఏమండోయ్! మీకే మహాతెలివుందను కున్నారుకాబోలు! నేను మంచికి మంచీ చెడుకు చెడూను. దీనికి ప్రతిగా ఏం చేయాలో నాకూ తెలుసండీ - నాకు తెలుసు. ఇకమీద ప్రతిరోజూ పట్టపగలే రోజుకి డజన్ ఎలుకలచొప్పున తీసుకొచ్చి మీ ఇంటిముందర వదిలిపెట్టకపోతే నన్ను మారుపేరుతో పిలవండి!" అని ప్రతిజ్ఞ చేశారు చిదానందం.

అవమానంతో కొంప చేరాడు శేషగిరి. జరిగినదంతా సరోజతో చెప్పగా - అవునూ; మీరు చేసిందీ తప్పేకదూ? వాళ్లింటిముందర తీసుకెళ్లి ఎందుకు వదిలిపెట్టారూ, ఇల్లూ వాకిలీలేనిచోట ఊరికవతల వదలాలిగానీ-" అంది. వీధిచివరను వదిలిపెట్టమని చెప్పిన వాలుకకూడ ఈ సరోజదేకదా అని గిరి బుర్ర గిరగిర తిరిగింది!

అటుపిమ్మట పక్షంరోజులకి రెండు ఎలుకలుమాత్రం పట్టుబడ్డాయి. కాని శేషగిరి మాత్రం 'రానున్నది రాకమానద' నేధీమాతో అర్ధరాత్రిపూట ఎలుకల్ని వదిలిపెట్టడానికి నిరాకరించాడు. తెల్లవారింతర్వాత ఎలుకల్ని తీసుకెళ్లి అరమైలుదూరంలోవున్న హైస్కూలు గ్రౌండ్ మధ్యనున్న 'క్రికెట్ పిచ్' లో వదిలేశేవాడు.

ఒకరోజు శేషగిరికి ఒక ఆలోచన తట్టింది. వెంటనే సరోజతో ఇలాఅన్నాడు. "ఇదిగో! ఇలా చూడు! మనం ఈ బోను తీసుకొచ్చి మాసంరోజులయింది షుమారు. ఇంతవరకూ వేటాడబడిన ఎలుకలు మూడే! ఈ రేటులో వ్యవహారం సాగితే 'మూషికరహితమయిన గృహమున్' కన్నుల కానలేము. తెలిసిందా? అందుచేత ... నేను నిన్న కందస్వామికోవిలదగ్గర ఒక క్రొత్త రకపుబోనుచూశాను. దానిలో ఒక 'లీవర్ ఎరేంజిమెంటు' వుంది. లీవర్ అంటే ఏతాంకోయ్యలాటిది. దానికి ఒక కొసను అర్థచంద్రాకారంగా సూక్ష్మంగా, వాడిగా, చిన్నగా అనేకపళ్లుంటాయి. ఎలుక ఆ పలకమీదికి రాగానే ఆ అర్థచంద్రాకారపు పండ్లచక్రం ఎలుకమెడను టక్కుని నొక్కి పట్టేస్తుంది. ఇపుడు గారెలనుమాత్రం - దేవతలు హావిస్సునందుకున్నట్లు - కొట్టేసిపోతున్నాయే ఎలుకలు - ఆ బోనులో అలా పోవడానికి అవంతయినా ఆస్కారంలేదు ... ఎలాంటి ఎలుకయినా సరే కిక్కురుమనకుండా వెంటనే చావాల్సిందే ... దాని ప్రాణం మహావుంటే - 'రామరామ' అని అంత్యస్మరణ చేసుకునేదాక వుండొచ్చునేమో - అంతే...ఎలుక చచ్చిపోతుంది గనుక శుభ్రంగాతీసి వీధి కుప్పతొట్టెలో పారేయొచ్చు. ప్రతీసారీ ప్రాతఃకాలానే, నేను చేతిలో బోనుతో 'పచ్చపార్క్ గ్రౌండ్' దాక పయనమవాల్సినపనివుండదుకూడా...ఇలా ఓపడిచస్తే మిగతావి ఎక్కడివక్కడ మాయమయిపోతాయి ..ఏం, అలా చూస్తున్నావ్?... ఆబోనొకటి ఇవాళ సాయంత్రం తీసుకునిరానా?"

"హరిహరీ" అని చెవులు మూసుకుంది ఆ సాధ్వీమణి సరోజ ద్రామాల్లోని పతివ్రతల్లాగా.

"చేస్తున్న పాపాలన్నీ చాలవన్నట్లు జీవహింస వేరే చేతులారా చెయ్యమంటారా, మంచియోచనే!" అంది సరోజ.

పెళ్లయినరోజునుండి ఆవిడ తన్ను పెడుతున్న బాధ 'జీవహింస' శీర్షిక క్రిందికి రాదుకాబోలు అనుకుని "మరి అలాగంటే ఎలుకలెలా పోతాయీ?" అన్నాడు శేషగిరి.

"అందుకు వేరే ఉపాయం కనిపెట్టాను లెండి. రేపట్నుండి పిల్లిపిల్ల నొకదాన్ని పెంచబోతున్నాను" అంది సరోజ ఉత్సాహంగా. 'సరే' అనక - 'వద్దు' అనలేక వూరుకున్నాడు శేషు.

మరుచటిరోజు ఒక స్నేహితురాలి దగ్గర నుండి ఓ చిన్న గోధుమరంగు పిల్లిపిల్లను తీసుకొచ్చింది. ఆ పిల్లిపిల్లకు రాజోపచారాలు జరిగాయి. "హా! పిల్లిపిల్లా! నీ జన్మ మెంత ధన్యం!" అని అనూయ చెందాడు శేషగిరి.

మాసంరోజులు మళ్ళీ గడిచాయి. మూషిక సంచయపు సంఖ్యాబలానికి ఆరోహణే కాని అవరోహణలేదు. పిల్లిపిల్లకూడా 'ఇంతింతై వటు డింతయై' అని పెరిగింది.

"పిల్లిపిల్ల బాగా పెరిగిందికదా ఇంకా అది ఎలుకలు పట్టదేం?" అన్నాగు భర్త.
"పాపం! అది చిన్న బిడ్డండీ, బిడ్డ- పసి కూన! అప్పుడే దానికి క్రూరయుక్తులూ ప్రాణిహింసలూ ఎలా తెలుస్తాయి? ఇంకా

★ మూషికాలూ - శేషగిరీ ★

కనీసం రెండు మాసాలయినా కావాలి." అంది సరోజ.

మళ్లీ మూడురోజుల తర్వాత శేషగిరి ఈ విషయం ప్రస్తావించినపుడు "పిల్లికి ఎలుకలు పట్టడం ఎలాగు అని మనం నేర్పించాలా ఏం? మీరు చెబుతున్నది చాల బాగుందిలెండి. దాని కడ్డొస్తే అదే పట్టుకుంటుంది, చూస్తూవుండండి" అని 'జూఆలజీ'లో ఒక పాఠంలా చెప్పింది సరోజ.

కానీ ఎలుకలబాధ తాలూకు 'థర్మామీటరు'లోని పాదరసం మరింత పైకి పోవడం మూలాన్ని - పిల్లి ప్రయత్నాలు అటుండగా మసాలా గారెతో బోను పెట్టడం మంచిదని శేషగిరి సూచించాడు. సరోజ సరేనన్నది. తర్వాత మూడువారాలో బోనులో ఒక ఎలుక పడింది కాని పిల్లి మాత్రం..

ఒకరోజు రాత్రి నిద్రపోతున్న శేషగిరిని లేపి ఎడమచేతిని ఎడమచెవికి వెనుక ఆనించి కుడిచేతి చూపుడు వేలుతో లోపలివైపు చూపిస్తూ "ఏమండీ! చూశారా! ఆ శబ్దం విన్నారూ వంటింటిలో" అంది సరోజ.

వంటింట్లోనుండి "గడగడా దబదబా" అని పెద్ద శబ్దాలూ 'మ్యావ్ మ్యావ్'మన్న పిల్లి కేకలూ వినవస్తున్నాయి

"ఈ భూకంపమంతా ఏమిటంటావూ?" అన్నాడు శేషగిరి

"నేనవే చెప్పేది" పిల్లి ఎలుకను పట్టుతూంది.. ఇది కూడా తెలీదటండీ?"

"ఉరుములూ పిడుగులూ గావున్న ఈ వాతావరణంలో - ఇంత రణగొణధ్వని చేస్తూనా పిల్లి ఎలుకను పట్టడం?" అన్నాడు.

"చాలు చాలు! అన్నీ తెలిసినట్టు మాటాడకండి. కావాలంటే వెళ్లి చూద్దాం రండి."

ఇద్దరూ వంటింటిలోకి వెళ్ళారు; శేషగిరి లైటు స్విచ్ నొక్కాడు శేషగిరి కంటికింపూ - సరోజకి కంటకింపూగా వున్న దృశ్యం కనపడింది

సరోజ ముద్దుపిల్లి మొద్దుతల ఆ పెద్ద బోనులో చిక్కుకునివుంది. బోను తలుపు పిల్లి మెడను నొక్కి పట్టగా ఏతెంచినా విముక్తికై పోరాడుతూ - పంచమ స్థాయిలో భీషణ ఘోషణలు సలుపుతూ ఆ మార్జాల కిశోరం ఇటూ అటూ తిరుగుతున్నది.

"పాపం! దీనికికూడా 'వెంకటాచలే' మసాలాగారెలంటే ఇష్టముల్లేవుందే?" అని గొణిగాడు శేషగిరి

సరోజ వెళ్ళి పిల్లితలను బోనులోనుండి విడిపించి దానిని రొమ్ముకు హత్తుకుని దాని మెడ దువ్వుతూ ఎత్తుకొచ్చింది శేషగిరి దాని మెడకేసి చూస్తూ "పెద్దగాయమేమీ తగలలేదుకదా పాపం" అన్నాడు జాలిగా.

కొంత, పరుషంగా సరోజ అంది "మీ వేళాకోళాలకి సైము లేదూ? .. నే నింక ఈ ఇంట్లో వుండలేను; ఈ ఎలుకలబాధ పడలేను. చెప్తున్నా ముందు మరో ఇల్లు చూడండి"

"ఏమిటీ.. మరో ఇల్లా?"

"ఔను! మరోఇల్లు—మనం కాపురం వుండడానికి చూడమంటున్నాను"

"అబ్బే ఈ మద్రాసులో అద్దె కొంపలన్నీ ఇంచుమించు ఇంతే సరోజా!"

"అయినా ఇలా ఎలుకల బాధవుండదు."

"ఎలుకలు లేకపోతే నల్లులుంటాయి"

"నల్లులుంటే డి డి టి కొడదాంలెండి!"

"ఎలుకలు కాకపోతే దోమలుంటాయి"

"అబ్బబ్బ—దోమలుంటే దోమతెరలు వేసుకుందాం కాని శ్రీకారంలోనే హంస పాదు పెట్టక ముందర చొక్కా వేసుకుని వేళ్ళాలి.."

"ఆ ఆ ఇప్పుడు చొక్కా వేసుకో వడెందుకూ...గంటెంతనుకుంటున్నావ్?"

హాల్లోని 'వాల్ క్లాక్', 'సా—రీ' అని పలికి పూరుకుంది ★



కొబ్బరితోట

ఖారాకిల్లీ

రేడియో ప్రోగ్రాం అయిపోగానే చెక్ పుచ్చుకొని బయటపడ్డా. బస్ స్టాప్ దగ్గరకొచ్చి నిలుచునేసరికి మెరీనా బీచ్ నించి చల్లని గాలి వీస్తోంది. 'ఎర్ కండిషన్డ్ రూమ్'లో కృత్రిమ వాతావరణానికి తల్లడిల్లిపోయిన శరీరానికి ఎంత హాయిగావుందో వర్ణించాలంటే కనీసం ఓ నాల్గు ఖారాకిల్లీలైనా వుండక తప్పదు. బ్రాడ్‌కాస్టింగ్ శాఖవారు, ప్రసారాలలో ఫిల్మ్ సంగీతాన్ని తగ్గిస్తే తగ్గించారుకానీ - కొత్త స్టూడియో భవనానికి ఇంత చక్కని ప్రదేశాన్ని ఎన్నుకున్నందుకు ఎంతైనా అభినందనీయులు.

...కానీ ఎంతసేపటికీ బస్ రాదేం?... నిట్టూరుస్తూ ప్రక్క జేబులోకి చేతిని పోనిచ్చాను. ఖారాకిల్లీ పొట్లాం చేతికి తగిలింది. ఈ ప్రపంచంలో నాకు అతిముఖ్యమైన వస్తువుల్లో ఖారాకిల్లీ ఒకటి. అది గనక లేకపోతే నేను చచ్చినా బ్రతకలేను. కనీసం రెండుగంటలకు ఒక కిల్లీ చొప్పునైనా నమిలేయకపోతే నా శరీరం కొయ్యబారిపోతుంది. ఖారాకిల్లీ తయారు చేయటంలో ఎక్స్‌పర్ట్ అని మా ఇంటికి ఎదురుగానున్న బుర్రమీసాల కొట్టు ఆసామీకి ఎప్పుడో ఒక సర్టిఫికేట్ యిచ్చాను. ఎక్కడికైనా బయలుదేరేముందు అతని కొట్టుకు వెళ్ళగానే, స్పెషల్‌గా నాకోసం- ఆరు ఖారాకిల్లీలను స్వహస్తాలతో తయారు చేసి ఒక కాగితంలో చుట్టివ్వటం ఆకొట్టు ఆసామీకి పరిపాటి. రెండుగంటలకు ఒక కిల్లీ చొప్పున ఆ ఆరు కిల్లీలూ నాకు ఒక రోజుకు సరిపోతాయి. ఈవేళ మరి రెండు ఖారాకిల్లీలు ఎక్కువగా తయారుచేయించుకుని మరీ వచ్చాను - మైక్ ముందు జమాయించి కూర్చోనేందుకు.

జేబులోనించి ఖారాకిల్లీ పేకెట్‌ను అలా తీశానో లేదో, కుడివైపునించి విజయగర్వంతో వస్తూన్న అడయారు బస్సు దర్శనమిచ్చింది. కిల్లీని బస్సులో నెమరవేయొచ్చులే - అనుకుంటూ పేకెట్ మళ్ళీ ప్రక్క జేబులోకి మెల్లగా పోనిచ్చేంతలోగా, నా కళ్ళెదుటనే క్షణకాలంలో తుర్రుమంటూ వెళ్ళిపోయింది ఆ బస్సు. కండక్టరు 'సీట్ - ఇల్లే' అంటూ వెనకవైపు నాకేసి చూస్తూ, ఇంకా చేతిని ఊపుతూనే వున్నాడు. "నువ్వు చెయ్యి ఊపింది చాలుకానీ - అక్కడ దేనినైనా భద్రంగా పట్టుకో - కిందపడి పళ్ళు ఊడగొట్టుగోగలవు" అనుకున్నాను.

మళ్ళీ మరోబస్సు వచ్చేటప్పటికి ఈ కలియుగంపోయి మరో యుగం రావొచ్చు. ఉస్సూరుమంటూ బస్‌స్టాప్ బోర్డుకేసి జాలిగా చూశాను. అక్కడ ఆశ్చర్యార్థకపు చిహ్నం ప్రత్యేకంగా నాకోసమే పెట్టేరేమో!

జి. వి. జి. కృష్ణ

ఎనిమిదింపావు కనుకుంటా — నేను అక్కడికి వచ్చి నిలుచుంది......ఇప్పుడు చూస్తే తొమ్మిదిపైగా అయింది. ఈలోగా బస్‌స్టాప్ స్తంభానికి నా తలకూ ఒక సాలెపురుగు గూడు కట్టేస్తోంది. రేడియో స్టేషన్‌కి ఎన్నో కార్లు వస్తున్నాయి—ఎన్నో పోతున్నాయి కానీ, ఏ వాహనానికీ నోచుకోలేని నేను మాత్రం వెల్లంకొట్టిన రాయికి మల్లే ఇంకా అక్కడే నిలుచొనివున్నాను.

మళ్ళీ సందు మలుపులో మరొక బస్సు కనిపించగానే పోయిన ప్రాణాలు లేచి వచ్చినై. బస్సు ఖాళీగా వున్నట్లుంది కూడానూ. ఇందులో తప్పకుండా సీట్ దొరుకుతుంది. బస్‌ను ఆపబోయాను. కానీ ఆ బస్సు సారథి ఆపకుండా 'ఇదు షెడ్‌కు పోవుదు సార్' అంటూ తుర్రున పోనిచ్చాడు.

ఇక ఇది లాభం లేదనుకున్నాను. ఉన్నది ఒకే ఒకమార్గం ఏమిటంటే— ఈ మారు బస్సు అనబడేది ఏదైనా అటునించి ఇటు వస్తే, నేరుగా వెళ్ళి దానికడ్డంగా రోడ్ మీద పడిపోవటమే. నిశ్చయంగా నన్ను మోసుకు వెళ్ళి బస్సులో కెక్కించి, తాత్కాలిక జనరల్ హాస్పిటల్ వద్దకు చేరుస్తారు. అక్కడినించి ఎలాగో ఇంటికి చేరుకోవచ్చు. మన బుర్రకు ఇంత చక్కటి యోచన తోచిందన్న మాటే గానీ, ఆ మార్గాన మళ్లీ ఏదైనా బస్సు వస్తేగా?

ఎంతసేపు కాచుకొని వుండినా ఇక ప్రయోజనమేమీ వున్నట్లు కనపడటంలేదు. బ్రతుకుజీవుడా అని నడక సాగించాను. అదే ఊపులో సరాసరి 'క్వీన్ మేరీస్ కాలేజ్'వరకూ వచ్చేశాను.


......తారురోడ్‌మీద వెన్నెల నిద్రపోతోంది. ఆ ప్రశాంత వాతావరణానికి సముద్రపు కెరటాల హోరు గంభీరాన్ని గొల్పుతోంది. రోడ్డుమీద అప్పుడప్పుడూ కార్లు తిరుగుతున్నాయ్. నా వెనుక ఓ నలుగురైదుగురు తప్పితే ఆ ప్రాంతంలో జనసంచారం లేదు.

ఈవేళ ఎక్కువదూరం నడిచానేమో — కాళ్లు నొప్పెడుతున్నాయ్. నిట్టూరుస్తూ అక్కడొక బెంచివుంటే దానిమీద కూలబడ్డాను. అవలింతలుకూడా ముంచుకొస్తున్నాయ్. కాస్సేపటికి ఏమీతోచక జేబులోనించి ఖారాకిల్లీ పేకెట్ తీశాను. ఇందాక నా వెనుకవుండిన నలుగురు వ్యక్తులూ దగ్గరవుతున్నారు. వాళ్లు సరాసరి నావంకే చూస్తున్నారు. వాలకం చూడబోతే టిప్‌టాప్‌గా తయారైన కాలేజ్ విద్యార్థుల్లా వున్నారు.

మెల్లిగా పొట్లాన్ని విప్పి ఒక ఖారాకిల్లీని చేతబట్టాను. వాళ్లుమాత్రం ఇంకా నావంక అదేవిధంగా చూస్తూనే ముందుకు వస్తున్నారు. జేబులో చిల్లర, మనీపర్సు వున్నాయా - అని ఓసారు తాకి చూసుకున్నాను. వాళ్లు నలుగురూ పిక్‌పాకెట్ చేసేవాళ్లు కాకపోతే నావంక అలా పరీక్షగా ఎందుకు చూస్తారు? అదీగాక వెళ్ళేవారు అలా నేరుగా పోతారా అంటే - అదీలేదు. అక్కడొక సిమెంట్ బల్లవుంటే దానిమీద కూర్చుని ఇంకా నావంక అలాగే చూస్తూవున్నారు.

ఐనా నేనంతగా భయపడాల్సిన అవసరం ఏమీలేదు. ఎందుకంటే నా పర్స్‌లో రూపాయిన్నరకు పైన లేదు; రేడియో చెక్ ఒకటి. దాన్ని కేష్ చేయటానికి వాళ్ళ తరంకాదు. - కానీ ఏదైనా నాకు చూపించి దానిమీద సంతకం పెట్టమ్మని బెదిరించి, నాచేత సంతకం పెట్టించి, ఆ చెక్‌ను రేపు ఉదయం బేంక్‌కు వెళ్ళి కేష్ చేసి వచ్చేంతవరకూ నన్ను వాళ్లు ఎక్కడైనా కస్టడీలో వుంచితే!!!

ఏమిటో - చూడటానికి అన్నిటికీ తెగించిన వాళ్లలా వున్నారు. ఈరోజే నన్ను ఇటో అటో తేల్చేస్తారు. ఇటువైన [illegible] రోజులో నా ప్రసంగాలు [illegible] కొమ్మారు అనుకుంటూ వారికేసి [illegible] వాళ్ళు అక్కడించి లేచి నడిచి [illegible]



అడవి రెక్క
ఫొటో: లక్ష్మణ్ (వరంగల్)

★ ఖాకీల్లీ ★

పోతున్నారు. 'హమ్మయ్య' అంటూ లేచి ప్రయాసతో కాళ్ళీడుస్తూ ఆయాసంతో అడుగులు వేస్తున్నాను. కొంతదూరం అలా వెళ్ళేసరికి వాళ్ళు నలుగురూ ఒక పోలీసును వెంటబెట్టుకొని తిరిగి వస్తున్నారు.

పోలీసు వెత్తిన ఎర్రటోపీవుంది కానీ - అతడునిజంగాపోలీసేనా? - లేక వాళ్ల జట్టులోనివురొకడెవడో అలా వేషం వేసుకొని వస్తున్నాడా? - అలా అక్కడ ఆగి ఆలోచిస్తూండగానే ఆ దుష్టచతుష్టయం పోలీసుతో సహా నాముందు వచ్చి ఆగారు. వాళ్లలో ఒకడు "ఈయనేనండీ!" అన్నాడు నన్ను ఆపోలీసుకి చూపిస్తూ.

"ఏమిటి - ఈయనే?" అన్నాను అతని వంక గుడ్లెర్రచేసి చూస్తూ.

"ఇదిసార్ - ఓమారు మీ జేబులు చూపించండీ" అన్నాడు పోలీసు.

"ఏమిటి - నా జేబులు చూపించాలా? ఎందుకు చూపించాలి? అసలు నువ్వెవరంటాను? - నిజంగా పోలీసేనా? నీది ఏబీటు? నీ నెంబర్ ఎంత?"

"అదంతా తర్వాత చెప్తాగానీ, ముందు చూపించండిసార్"

"నా జేబులు సోదా చేసేంత అవసరం ఏమొచ్చింది?.. నేనేమైనా ఆటంబాంబులు తుంచుకున్నాననుకున్నారా?" మీ ఎత్తులు నాకు తెలీదనా! ఇదిగో! నువ్వే గనక నిజంగా పోలీసువైతే ఏంచేస్తానో చూసుకో. పోలీస్ డిపార్ట్మెంటులో పనిపోయిన మా మేనకోడలి చెల్లెలిమొగుడు పెద్ద అఫీసరు. నన్నిలా నడిరోడ్డులో అవమానించినందుకు అతనితో చెప్తే చాలు - జాగ్రత్త! నన్నేమనుకుంటున్నావో..."

"సార్!...మీరు ఎక్కువగా మాట్లాడేస్తున్నారు...మర్యాదగా మీ జేబులు చూపిస్తారా లేదా?"

"చూపించను...చచ్చినా చూపించను"

"ఐతే నడవండి పోలీస్ స్టేషన్కు"

ఈ నెపంతో వీళ్లంతా కలిసి నన్ను ఏ రహస్యస్థలానికో తీసుకువెళ్ళి, నా తల నరికేసి - డబ్బాలు, రిస్టువాచీ కాజేస్తారు. ఏంచేయటానికీ తోచక ఇటూ అటూ చూశాను. దైవవశాత్తూ వెనకవైపునించి రెండుకార్లు ఒకటి నొకటి ఓవర్ టేక్ చేస్తూ వేగంగా వస్తున్నాయ్. వాటి కడ్డంగా నిలుచొని చేతులూపాను. రెండు కార్లూ సడన్గా ఆగిపోయాయి. ఒక్క పరుగున ఆ కార్ల వద్దకువెళ్ళి "సమయానికి వచ్చారు...రక్షించారు...వీళ్ళంతా దొంగలు...ఆ పోలీసు దుస్తుల్లో వున్న అతను వీళ్ల జట్టుకు నాయకుడు." అనే వరకూ ఆ రెండు కార్లనించీ ఒక అయిదారుగురు దిగి వాళ్లందర్నీ చుట్టు ముట్టేశారు. వాళ్ళలో ఒక లావుపాటి ఆయన ఆ పోలీసువంక తిరిగి "ఎవరు మీరు? ఏమిటిదంతా?" అన్నాడు తీక్ష్ణంగా చూస్తూ.

"ముందు ఈయన జేబులను చూపించమనండి."

"ఏం? ఆయన జేబుల్లో దొంగసొమ్ము ఏదైనా వుందా?"

"సార్! వాళ్ళ మాటలు నమ్మకండి... ఉత్త దగాకోర్లు" అని నే నంటూంటే—

"—చూపించమనండి సార్" అంటూ మళ్ళీ అదే మాటన్నాడు ఆ పోలీసు.

"ఏముందయ్యా ఆయన జేబుల్లో?"—

"ఏముందో మువ్వెప్పుడు చూశావు?"—

ఇత్యాది ప్రశ్నలు వరుసగా కురిపించారు - కారుల్లోనించి దిగిన అపద్బాంధవుల్లో మరి కొందరు.

"ఈ ఘరానా మనుష్యులకు నా జేబుల్లో చెక్ మీదా, మనీపర్సుమీదా కళ్లు పడ్డాయండీ"—అన్నాను.

"కాదు...కాదు......" అన్నాడు ఆ దుష్టుల్లో ఒకడు.

"కాదేమిటి—వల్లకాదు" గద్దించాను నేను.

"మీరే చెప్పండయ్యా—వివరంగా" అన్నాడు ఆ పోలీసు—తలిమ్మానలుగురితో.

వాళ్లల్లో ఒకడు ఎలాగో గొంతు పెకలించు

కొని "ఈయన ఆత్మహత్య చేసుకోబోయా రండీ" అని పుటుక్కున అనేశాడు.

నిజం చెప్పొద్దూ—నాకు వొళ్లు మండి పోయింది "ఏమిటీ! నేను ఆత్మహత్య చేసుకోబోయానా? ... నన్ను హత్యచేసి పాపిష్ఠి కాజేసేందుకు మీరు ఈ ఎత్తు వేసి - నామీద ఆత్మహత్యా నేరం మోపుతారా? బస్ దొరక్క, ఇంటికి చేరుకునే మార్గంలేక నేను చస్తూంటే—" అంటూ నేను వాక్యం పూర్తిచేసే లోగానే—

"ఓహో! బస్సు దొరక లేదని మీరు ఆత్మహత్య చేసుకోబోయారా?" అన్నాడు ఆ కారులోనించి దిగినవారిలో ఒక మనిషి—అతి తెలివిగా. "నేను అవస్థలో ఇరుక్కొని చస్తూంటే నీకు తమాషాగా వుందా" అన్నట్టు ఒక్కచూపు చూశాను. లోపలికోటితో నవ్వుతూన్న ఆ వ్యక్తికేసి

"—లేకపోతే, జేబుల్లో ఏమున్నాయో చూపించమంటే ఆయనకు ఇంత భయం ఎందుకండీ" అని ఆ దుష్ట చతుష్టయంలో మరొకరు అనేసరికి నాకు కోపం ఆగింది కాదు.

"ఏమున్నాయో చూసుకోండి" అంటూ జేబులంతా ఖాళీచేసి, సర్వం తీసి బయట పెట్టాను.

"అదోనండీ - అపొట్లామే!.. అందులో ఏమిటో వుంది.... ఇందాక తినబోయి, మమ్మల్ని చూసిగానే, ఏమీ ఎరగనట్లు ఆ పొట్లాన్ని జేబులోకి పోనిచ్చారు" అన్నాడు ఆదుష్టుల్లో నాలుగోవాడు.

తాపీగా "ఇది ఖారాకిల్లీ పేకెట్ అండీ" అన్నాను, కారునించి దిగిన పెద్దమనుష్యులతో.

"ఖారాకిల్లీయా?" ఆ దుష్టులందరూ తెల్ల మొహాలు వేశారు.

"ఊఁ—కావలిసే చూడండి. .మీకింకా అనుమానం తీరకపోతే, మీ ఎదుటనే ఇప్పుడొకకిల్లీతీసి తినమంటే తింటాను. నేను చావకపోతే, కాస్సేపటికైనా మీకు తెలుస్తుందిగా?"

అందరూ ఫకాలున నవ్వేశారు. ఆ పోలీసు మొదట బిక్కమొహం వేసినా, తర్వాత అతిబలవంతంమీద పెదిమలమీదికి నవ్వు తెచ్చుకోగల్గాడు. మిగతా నలుగురి మొహాల్లోమాత్రం కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు.

"భేష్.. బలే తమాషాగా వుంది. ఆఁ.. మీరు ఎంతవరకూ వెళ్ళాలండీ" అన్నాడు ఒకాయన కారు వెనుక తలుపు తెరుస్తూ.

"చాలా థాంక్స్.. పేరీస్ కార్నర్ వద్ద దింపితే సరి, అక్కణ్ణించి సునాయాసంగా మా ఇంటికి చేరుకోగలను... ఈ ప్రాంతమంతా దొంగతనాలకు పుట్టిల్లండీ."


"ఊఁ...ఐతే కారెక్కండి"

"మీకు చాలా శ్రమఇస్తున్నానేమో.." అంటూ కారెక్కి కూర్చున్నాను. నా తర్వాత మిగతా వాళ్లు కూడా కూర్చున్నారు. కారు కదిలాయి.

జేబులో మరొక ఖారాకిల్లీ వుంది ఇన్ని సంఘటనలు జరిగాక, మెదడుకు కాస్త చురుకుదనం కల్గించేందుకు ఆ కిల్లీ తినబుద్ధయింది. కానీ, ఆకారులో తింటే-ప్రక్కనున్న పెద్దమనుష్యుల్లో ఎవరికైనా, అందులో ఏదైనా విషం వుండొచ్చని— ఇంకా అనుమానం వుండినా వుండొచ్చు. అంచేత కారులో కిలీ తినకుండా కాస్సేపు మనస్సును కంట్రోల్ చేసుకోగలిగాను. ఇలాగున - తిన బుద్ధయినప్పుడు ఖారాకిల్లీని తినకుండా కొంతసేపు మనసును కంట్రోల్ చేసుకోగల్గటం నా జీవితంలో ఇదే ప్రథమం! ★

వొంగిన చెక్క

ఫొటో: బి. రంగనాథన్ (మద్రాసు)



వనితాలోకం

మూఢవిశ్వాసాల కంచుగోడలు:

'మనుషుల మధ్య ప్రత్యక్షంగా కనపడే సంబంధాలు శాశ్వతమైనవని చాలామంది నమ్ముతుంటారు. అటువంటి నమ్మకాలతో నే (అవి మూఢనమ్మకాలని వేరే చెప్ప నక్కరలేదు) ఆచారమనీ, సాంప్రదాయమనీ కొన్ని గోడలు కట్టుకుని చీకటిలో మ్రగ్గిపోవటం జరుగుతోంది. ఆ గోడలమధ్య ఏ కొద్ది వెలుతురైనా ప్రసరింపచేయటానికి ప్రయత్నిస్తే కళ్లనూసుకుంటారు, గోలచేస్తారు, నెత్తి బాదుకుంటారు, వక్ర వాదనల్లోకి దిగుతారు.

మన సమాజంలో అనాదినుంచీ స్త్రీలు వంటచేస్తూ యిల్లు చూసుకోవటమూ, పిల్లల్ని పెంచటమూ జరుగుతోంది. గుమ్మం దాటి బయటికివస్తే కుటుంబగౌరవం, కొన్ని డిగ్రీలు తగ్గిపోతుందని భయపడేవారు. పుట్టింట్లో వున్నన్నాళ్లూ ఆమె తల్లిదండ్రులకి బరువు. పెత్తనం చెలాయించే అన్నా వదినా వుంటే యిక ఆమె సంగతి వేరే చెప్పనక్కరలేదు. కాపురానికి వెళ్లినప్పటి నుంచీ అత్తగారిచేత చివాట్లు తింటూనా సరే, ఆడపిల్లలకి పెట్టిపోతలకి చెయ్యవలసి వచ్చినాసరే, ఆమె నోరుమెదపకూడదు. భర్త ఏవేళవస్తాడు, ఎటువంటి స్థితిలో యింటికి వచ్చినాసరే, బూట్లు విప్పి, కాళ్లు ఒత్తి, ఉపచర్యలు చేస్తుంది. మొగ వాళ్లుబయటపనులు చూసుకుంటారు. ఉద్యోగాలుచేస్తారు. డబ్బు సంపాయిస్తారు. యింటిపెత్తనం చెలాయిస్తారు. భర్తరాగానే భార్య లేచి నిలబడుతుంది. గొడ్డును మోదినట్లు చావమోదినా ఏ బియ్యం బస్తామీదో పడుకుని కాస్సేపు ఏడ్చి, మళ్లీ యధాప్రకారం పనులు చేసుకుంటూ వుంటుంది. ఆమెకి చదువు సంధ్యలూ, సంగీత జ్ఞానమూ పొందదగినవి అనవసరము. ఒకవేళ అలవడినా వాటిని సక్రమంగా ఉపయోగించుకోవ

కౌమారి
ఉషారాణి

టానికి అవకాశం వుండదు. తీరుబడి అంతకంటె తక్కువ. మన సమాజంలో స్త్రీలగతి యిలా వుంటోంది. ఆమెకి అటువంటిస్థానం ఏర్పడటానికి కారణాలు లేకపోలేదు. అంతమాత్రాన అటువంటి పరిస్థితి, ఏర్పాటూ, అనాదినుంచీ వస్తున్నట్టూ శాశ్వతంగా అమలుజరిగేట్టూ భావిస్తుంటారు కొందరు.

కొన్ని ప్రాంతీయమైన అలవాట్లూ, జాతీయమైన ఆచారాలూ అంటూవున్నాయి. కొన్నిచోట్ల ఆడవాళ్లు పరదాలచాటునుండి బయటికి రారు. మరి కొన్నిచోట్ల ముసుగులేనిదే స్త్రీలు వీధుల్లో కనబడరు. కానీ కొన్ని దేశాలలో స్త్రీలు పురుషులమాదిరి దుస్తులు ధరిస్తారు. మోటారుకార్లూ విమానాలూనడుపుతారు. పురుషులతో సమానంగా స్వేచ్ఛగా అన్ని కార్యకలాపాలలోపాల్గొంటారు. ఆ ప్రాంతాలవారికీ, ఆ జాతులవారికీ అటువంటి ఆచారాలు ఒప్పుకోయను కోవటం పొరబాటు. అవి వారికే శాశ్వతమనీ అనుకుంటారు కొందరు.

* * *

అలా అనుకోవటం వట్టి భ్రమ. ఒకప్పుడు మానవసమాజంలో వివాహాల పద్ధతులిలా వుండేవి కావనీ, ఆస్తిహక్కులు స్త్రీపరంపరగా సంక్రమించేవని చెబితే ఈనాడు కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చు. స్త్రీలకి ఆస్తి హక్కు విషయంలో మహమ్మదీయులు మనకంటె మేలు. స్త్రీలకు సమాన ఆస్తి హక్కులు కావాలనేది ఈనాడు కొత్తగావచ్చిన వాదం కాదు. పూర్వ మీమాంసలో స్త్రీలకు ఆస్తిహక్కువుందని జైమిని వివరించాడు. పూర్వకాలంలోగూడా వివాహమనేది స్త్రీ పురుషులిద్దరికీ కూడా పావనహేతువుగా ఎంచబడింది.

ఇంతేకాదు. కొన్ని వాస్తవ విషయాలను తీసుకుని వాటినే శాశ్వత సత్యాలనుకోవటంవల్ల చాలా అపోహలు కలుగుతుంటాయి. ఈ అపోహలు కారణంగా మనం చాలా పొరబాట్లు చేస్తుంటాము. ఉదాహరణకి స్త్రీలు ఉద్యోగాలు చెయ్యటానికి ముఖ్యమైన ఆటంకం ఆమె శరీర

దౌర్బల్యం అనే వాదన ఒకటి వున్నది. "శరీర పరిశ్రమకి పురుషులు ఓర్చినంత స్త్రీలు ఓర్చలేకుండా వున్నారు" అనే ప్రస్తుత వాస్తవ విషయాన్ని తీసుకుని, "శరీర పరిశ్రమకి పురుషులు ఓర్చినంత స్త్రీలు ఎన్నటికీ ఓర్చలేరు" అని శాశ్వత సత్యం అన్నట్లు ప్రవచించటంలో అర్థం లేదు. ప్రఖ్యాత గ్రీసు తత్త్వవేత్త ప్లేటో స్త్రీలు బానిసలతోనూ పసిపిల్లలతోనూ సమానమన్నాడు. నెపోలియన్ స్త్రీలు సాంఘిక జీవితంలో పాల్గొనరు గనుక వారికి ప్రజలకు సంబంధించిన విజ్ఞానం అనవసరమన్నాడు: పై వాటినిబట్టి ఆ రోజుల్లో ఫ్రాన్సు, గ్రీసు దేశాలలో స్త్రీల పరిస్థితి ఎలా వుండేదో బోధపడుతుంది కాని అదే శాశ్వత సత్యమనీ న్యాయమనీ అనుకోవటం పొరపాటు, ఏ కాలంలోనైనా సంఘం ఒక స్వరూపంలో వుండదనీ, మానవుల మధ్య సంబంధ బాంధవ్యాలు ఒక విధంగా వున్నాయనీ చెప్పటానికీ, అవి ఎల్లప్పుడూ అలాగే ఉండాలీ, ఉంటాయీ అని అనుకోవటానికీ చాలా తేడా వుంది. ఈ తేడా తెలియకపోవటంవల్లే మనం తరుచూ కొన్ని అపోహలకి గురి అవుతూ వుంటాము.

మానవులమధ్య సంబంధాలు కొన్ని ప్రకృతి నిర్దేశించినవి వున్నాయి. అవి మారటానికి ఒకప్పుడూ వీలుండదు. ఈనాటి స్త్రీలపరిస్థితినే తీసుకుందాం. ఆమె యిల్లు చూచుకుంటుంది; వంట చేస్తుంది; పిల్లల్ని పెంచుతుంది. మాతృత్వం అనేది స్త్రీకి ప్రకృతి ఏర్పాటు చేసినవిధి. అంతమాత్రాన వంటచేయటం, పిల్లల్ని చూచుకోవటం కూడా ప్రకృతి ఏర్పాటు చేసిన విధి అని అపోహ పడకూడదు. ఇవి మనుషులు ఏర్పాటుచేసుకొన్న విధులు: ప్రకృతి నిర్దేశించినవి కొన్ని వున్నప్పటికీ, వాటితో బాటు మార్పుకు అవకాశం వున్నవి కొన్ని వుంటాయని గ్రహించి, ఆ రెండింటినిగురించీ వేరు వేరుగా ఆలోచించటం మంచిది. "పాశ్చాత్యదేశాలలో స్త్రీలకి స్త్రీత్వమే లేదు. వాళ్లపిల్లల్ని ఆయాలు పెంచుతారు. వాళ్లకి సంతానప్రేమా మాతృప్రేమా లేవు. మన దేశంలో అటువంటిది సంభవించటానికి మన జాతీయసంస్కృతి ఎన్నటికీ ఒప్పుకోదు" అని చాలామంది వాదిస్తూ వుంటారు. ఇలా విమర్శించేవారిని ఏమనాలో తెలియటం లేదు.

కొందరు వారి వాదనలోని లోపాలను సమర్థించుకోవటానికి "సంస్కృతి" అనే పదాన్ని అడ్డుపెట్టుకోవటానికి ప్రయత్నిస్తారు. స్త్రీ సుకుమారమైనది. నిర్మలమైనది. జీవితపు ఒడిదుడుకులనుంచి కాపాడబడవలసినది. ఎటువంటి దౌర్బల్యానికీ గురి కాకుండా నాలుగుగోడలమధ్య కాపాడబడవలసినది. పురుషులుచేసే పనులు చేసినట్టయితే ఆమెలోని సౌకుమార్యమూ, సహజ ఆకర్షణా క్షీణిస్తాయి" ఇవన్నీ కూడా సౌందర్యంతో కూడుకున్న భావాలుగానే కనిపిస్తాయి. ప్రఖ్యాత కథకుడు, కవి, విమర్శకుడు జి. కె. చెస్టర్‌టన్ స్త్రీకి నిజమైన స్వేచ్ఛా సౌఖ్యాలు సంసారంలోనే దొరుకుతాయన్నాడు. స్త్రీలంటే ఎంతో ఆదరాభిమానాలుగల జాన్ రస్కిన్ కూడా స్త్రీలతత్త్వం ఎంతో సుకుమారమైనదనీ, పురుషునితత్త్వం సుడిపోటులతో సాగగలిగితే గాని వికాసం పొందదనీ అన్నాడు. నిజం చెప్పొద్దూ! ఇటువంటిమాటలు వింటూండే స్త్రీలే ఎక్కలేని ఆనంద పారవశ్యంలో మునిగిపోయి ఉక్కిరి బిక్కిరి అయిపోతారు. స్త్రీలు సుకుమారులు గనుక మరెందుకూ పనికిరారు ఈ మొదలైనవి స్త్రీలనుగురించి సృష్టించబడ్డ అభూతకల్పనలంటే చాలామందికి నవ్వకపోవచ్చు; కొంచెం కోపం కూడా రావచ్చు. బెర్నార్డుషా అన్నట్లు, నాలుగు గోడలమధ్య సంసారపు గొడవల్లో కొట్టుకుపోయే స్త్రీ ఎప్పటికీ పంజరంలో బంధింపబడ్డ చిలుక!

మన అపోహలకి అండగా నిలబడేది మన "సంస్కృతి" మన మనస్తత్వాలని మైకు చేస్తుంది. మనోనేత్రాన్ని విప్పి ముందున్న ప్రపంచాన్ని చూడనివ్వదు. అందువల్లే ఘోషా స్త్రీలే ఆదర్శప్రాయులనుకునేవారు వీధిలో ఆడది కనబడితే ముఖం చిట్లిస్తారు. వీధి గుమ్మంవైపు తొంగిచూసే స్త్రీల గుణశీలాలు ధ్వంసమండిపోతాయనే సంస్కృతిలో పెరిగినవారు కొద్ది చదువుకుని నలుగురితో స్వేచ్ఛగా తిరిగే యువతిని గౌరవించలేక పోతున్నారు. అటువంటి యువతికి సతీత్వంగానీ మాతృత్వంగానీ సక్రమంగా ఉంటాయని ఊహించలేకుండా వున్నారు. ఈనాటికీ ఉద్యోగాలు చేసే స్త్రీలు భర్తలతో సవ్యంగా కాపురాలుచేస్తారనీ, పిల్లలమీద ఆపేక్షగా వుంటారనీ చెబితే చాలామంది నమ్మలేకుండా వున్నారు. పరదా సంస్కృతిలో విశ్వాసం వున్నవారు బహిరంగంగా తిరిగే స్త్రీలని తృణీకారభావంతో చూస్తున్నారు. అలాగే తమభార్యలు ఉద్యోగాలు చెయ్యాలంటే సహించలేని పురుషులు ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలపట్ల తేలిక భావం ప్రకటిస్తున్నారు. చైనా, జపాను, యూరపులలో ఫ్యాక్టరీలలో పనిచేసే స్త్రీలసంఖ్య అప్పుడప్పుడు పురుషుల సంఖ్యని మించుతుందంటే వాళ్లు చెవులు మూసేసుకుంటారు. ఇటువంటి వ్యక్తులనీ, వీరి సంస్కృతినీ ఇప్పటికీ మనం తప్పించుకోలేకపోవటం చాలా విచారించవలసిన విషయం. వారిమీద మనకి జాలికలిగినా ఆగ్రహంకలిగినా వారిని అర్థంచేసుకోవటం మటుకు అంతకష్టం కాదు. వారిని సమర్థించటానికి ప్రయత్నించటంలో అర్థం లేదు.

మనదేశంలో పిల్లలకు సక్రమమైనశిక్షణ, విద్యాబుద్ధులు లభించడానికి తల్లులే ఎక్కువ బాధ్యులనే ఒక నమ్మకంవుంది. 'తల్లినిబట్టే పిల్లలు' అని ఏ పిల్లయినా కొద్ది అల్లరి చేసినా మంచి బుద్ధులు ప్రదర్శించక పోయినా చటుక్కున విమర్శిస్తూ వుంటాము. పిల్లలు కొద్ది తప్పుత్రోవను బడితే 'ఆ! ఆ తల్లినిచూడు! పిల్లలు అలా కాక ఏమవుతారు' అని ఆక్షేపించటం కొందరికి ఓ సరదలవాటు. మన దేశంలో పిల్లలు తల్లిదగ్గరే ఎక్కువసేపు గడపటం, ఎక్కువచాకిరీ చేయించుకోవటం జరుగుతోంది. అంతమాత్రాన వారు తల్లిమాటే వింటారనిగానీ, వారు బాగుపడటానికీ చెడిపోవటానికీ తల్లులే ఎక్కువ బాధ్యులనీ అపోహపడుతూంటారు కొందరు. ప్రత్యక్షంగా చూస్తున్నదేమిటంటే, పిల్లలు తల్లులకంటె తండ్రులకే ఎక్కువ సులభంగా లొంగుతున్నారు పిల్లలు మారాం చేస్తే 'అదిగో నాన్న వస్తున్నారు!' అని బెదిరిస్తుంది తల్లి, లేదా "ఏమండోయ్! ఇలా రండి ఒక్కసారి" అని భర్తని అతిజాలిగా బతిమాలుతుంది.

పిల్లలకి సక్రమమైన శిక్షణలభించాలంటే తల్లిదండ్రులిద్దరూ సమానంగా బాధ్యులు. ఇంతేకాదు. పిల్లలు పెరిగే వాతావరణం కూడా వారి మానసిక వికాసానికి తోడ్పడుతుంది. మన సమాజంలో మగపిల్లలకీ తల్లులకీ మధ్య చాలా తొందరగా అగాధం ఏర్పడుతోంది. వివాహానికి పూర్వమే కొడుకు తల్లికి దూరమయిపోతున్నాడు. ఇక భార్య కాపురానికి వచ్చిన తరువాత ఆ తల్లిసంగతి చెప్పనక్కరలేదు. మనదేశంలో అత్తాకోడళ్లకి మధ్యవుండే వైషమ్యం మరెక్కడా లేదేమో అనిపిస్తుంది. ఇటువంటి మన సంస్కారమే ఆదర్శప్రాయమైనదని అనుకోనవసరము లేదు.

పాశ్చాత్య దేశాలలో స్త్రీలకి "స్వాతం

మధురస్మృతి

మూలం:
కమలా త్రివేణీశంకర్

అనువాదం:
పాలపర్తి భానుమతి

వెలుగువరాగానే భరతమాత వందనము చేస్తున్న వారికుమధురకంఠధ్వనులు వినవచ్చాయి. ఏమిటో అని బాల్కనీమీద నుండి తొంగిచూచాను. స్వాతంత్ర్య దిన ప్రభాతభేరీ... యువకులు ఉల్లాసంతో జాతీయగీతాలు పాడుకుంటూ పూరేగుతున్నారు.....ఎక్కడో నా హృదయాంతరాళంలో ఒకమూల నిద్రిస్తున్న మధురస్మృతి ఒకటి స్మృతి పథములో మెదలసాగింది. * * *

......ఎప్పటివలెనే ఆరోజుకూడ తలుపులు కిటికీలు వేసికొని నిద్రపోవటానికి గదిలోకి వచ్చేసరికి పదిగంటలయింది. అంతవరకువారు రానేలేదు ఇక ఆరోజుకు వస్తారనే ఆశకూడలేదు. ఆ రోజుల్లో సాధారణంగా నైట్ డ్యూటీ వుంటూవుండేది. పగలుకూడ ఒక్కొక్కప్పుడు భోజనానికి ఇంటికి వచ్చేవారు, ఒక్కొక్కప్పుడు భోజనం అక్కడికే తెప్పించుకునేవారు. కాని ఆరోజు సాయంత్రము ఇంటికి వస్తాననీ భోజనంకూడ ఇక్కడే చేస్తానని చెప్పి వెళ్ళారు. కానిరాలేదు. పిల్లలు తండ్రికోసం ఎదురు చూచిచూచి నిద్రపోయారు.

పుస్తకం తీసుకుని రెండుమూడు పేజీలు తిరిగేశాను. చదువబుద్ధిపుటలేదు. దాన్నక్కడ పడేసి గ్రామఫోను తెచ్చా...కాని చిన్నవాడు ఎంతోకష్టంమీద ఇంతకుముందే నిద్రపోయాడు. మళ్ళీ లేస్తాడేమోననే భయంచేత ఫోన్ పెట్టుకునే ధైర్యం లేకపోయింది. రెండుమూడు నిముషాలు ఏవో ఆలోచనలతో అలాగే నిలబడిపోయా...తిరిగి నూలుదారాలు తెచ్చి "రాఖీ*" తయారుచేద్దా మనుకున్నాను. అయితే మా అన్నయ్య ఇక్కడకు వస్తాడనే ఆశలేదు. ఆ రోజుల్లో దేశమంతటా ఆగస్టు ఆందోళనము వ్యాపించివుంది. ఇప్పటికే అన్నయ్య అరెస్టయివుంటాడు; లేకపోతే పరారైవుంటాడు; ఇది మాత్రం నిశ్చయమే. ఈ సంగతి తెలిసివుండీ ఈ పుణ్యదినము కొరకు ఎంత ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాను!......ఈసారి అన్నయ్య మాయింటికి రాడు... నేనుకూడ వెళ్ళలేను......రెండురోజుల క్రితము రాఖీ విషయముజ్ఞప్తికి తెస్తూ 'అన్నగారింటికి వెళ్తాను'అని అన్నాను. అప్పుడు వారు కొంచెంకోపంతో "నీవు ఈ ప్రస్తావన తెచ్చేముందే ఇది సంభవమా? అని విచారించుకోవాలి. కొంచెం నా పదవీ మర్యాదకూడ ఆలోచించు." అన్నారు.

అయినప్పటికీ నా శుభాకాంక్షలన్నీ గుచ్చి వదినకు పంపుదామనుకున్నాను. స్నేహపురస్సరమైన నా ఈ కానుకలు అన్నకు ఆమె అంద చేస్తుందనుకున్నా... ఇంతలో నౌకరువచ్చి— "బాబుగారు భోజనం అక్కడికే తెమ్మన్నారు. వారు రావటానికి వీలులేదుట. పిల్లలతో జాగ్రత్తగా వుండమని చెప్పమన్నారమ్మా" అన్నాడు.

నాకప్పుడు కోపంతోపాటు దుఃఖంకూడ వచ్చింది. కాని అపుడుని టిఫిన్ కేరియర్ తెచ్చి వాడికిచ్చి పంపి తలుపులు గట్టిగా వేశాను. ఇంతవరకూ తుప్పర్లుగాపడుతున్న వర్షము ఇప్పుడు ధారాపాతంగా కురవసాగింది. అప్పుడెప్పుడు భయంతో హృదయం కంపించసాగింది. రోజులుకూడ అలాగే వున్నాయి. ఇవాళ టెలిగ్రాఫ్ తీగలు తెంపారనీ...నిన్న స్టేషను కాల్చారనీ ... రాత్రి మేజిస్ట్రేట్ బంగళాను యూనివర్సిటీ విద్యార్థులు నిప్పంటించారని ... ఎవరో ఇనస్పెక్టరుగారిల్లు తగులబెట్టారనీ...ఇలాగే రోజూ ఎన్నోవార్తలు వస్తూవుండేవి. నిజంగా అది అలాటి విషమసమయం. పిల్లలను పెట్టుకుని ఒక్కదాన్నే వుండటానికి సాహసం లేకపోయింది. కాని ఆందోళన అకస్మికంగా అరంభమైంది. అనేక సంవత్సరాలతర్వాత విప్లవం అనే అగ్ని రగుల్కొంది. దేశంలో మూలమూలల వున్నవారు సచేతనులై స్వాతంత్ర్యప్రకాశం కోసమై ఆ విప్లవాగ్నిలోనికి దుముకుతున్నారు.

... మేఘాలుచేసే ఆ గర్జనలు చూస్తే అనేకమంది మనుష్యులు బంగాళాలోనికి తోసుకునివచ్చి "ఎక్కడున్నారా దేశద్రోహులబిడ్డలు? ముందువారినంతమొందించి మా స్వాతంత్ర్య పథాన్ని కంటకరహితం చేస్తాం" అని గర్జిస్తున్నట్లనిపించింది.

శ్రావణమాసపు భయంకరనిశీథం. ఆ సమయంలో ధారాపాతంగా కురుస్తున్న ఆ వర్షము మరింత భయం గొలుపుతున్నది. ఇంతలో ఎవరో తలుపుకొట్టటం విని ఉలిక్కిపడ్డాను. పై కిటికీనుండి వంగిచూచి "ఎవరు?" అని అడిగాను. సన్నగా ఒక అస్పష్టస్వరం వినిపించింది. "తలుపు తెరవండి...తలుపు...భాయీ ... తలుపు..." బహుశః అన్నయ్య గొంతేమో...ఈ భయంకరవర్షంలో ... నేను పరిగెత్తుకువెళ్ళి వెంటనే తలుపుతీశాను. నీళ్ళతో తడిసి తలుపు నానుకుని వున్నాడు కాబోలు, ముద్దయి తలుపుతీయగానే ముందుకు పడబోయిసంబాళించుకున్నాడు... నేను స్విచ్ వేశాను. వెలుతురు అతనిముఖంమీద పడింది. ...నేను ఉలిక్కిపడ్డాను. అతను మా అన్న కాడు.

అతను ఇరవైరెండు ఇరవైమూడుసంవత్సరాల యువకుడు. సన్నటివాడు; కాని ఆరోగ్యవంతుడు. గాభరాపడ్డట్టుగా అన్నాడు. "అక్కా! మీరు భయపడకండి. వీధులన్నీ నీటితో నిండిపోయినాయి. మోకాళ్ళవరకు వస్తున్నాయి. ముందుకు పోవటం కష్టమైపోయింది. చీకటి కమ్ముకున్నా కనబడటంలేదు...."

"కాని...కాని నీవు ఎవరు?" అన్నాను నన్ను నేను కాస్త సంబాళించుకుని.

* (శ్రావణ పూర్ణిమనాడు సోదరుని చేతికి కట్టురక్షాసూత్రము. ఇది ఉత్తర దేశాచారము.)

త్ర్యం" యిచ్చారు. ఉద్యోగాలు చెయ్యటానికి సదుపాయాలున్నాయి. కొన్ని ప్రాంతాలలో పిల్లల పెంపకం, విద్యాబోధన విషయాలలో ప్రభుత్వం కొంత భారం వహిస్తోంది. మన దేశంలో ఆర్థిక స్తోమతని చక్కబెట్టుకోవటానికి ఉద్యోగాలు చెయ్యాలంటే మన "సంస్కృతి" అడ్డుపడుతోంది. పిల్లలని చూచుకోవటానికి ఆయాలని పెట్టడానికి చాలామందికి తాహతులేదు. దారిద్ర్యమే కారణంగా మన దేశపు స్త్రీలు పిల్లలకి క్షేమకరమైన పనులు చెయ్యవలసిన అవసరం కలుగుతోందనే విషయం అందరూ విచారించవలసినదే. సాంఘిక ఉద్యమాల్లో పాల్గొనటానికి మనస్త్రీలు ఏవిధంగానూ ముందుకు రాలేకపోతున్నారు.

సామాజికపరిణామంలో మనకు పైగా వున్న మెట్లన్నింటినీ మనకు కిందిగావున్న మెట్లని భావిస్తూ కూర్చుంటే, మనం ఒక్క అడుగు ముందుకు వెయ్యలేం. ★

యువకుడు చిరునవ్వు నవ్వి - "నేనా? నేను ఎవరు? నేను మిమ్మల్ని 'అక్కా' అన్నాను" అన్నాడు ధోవతి పిండుకుంటూ.

నా గాభరా కొంచెం తగ్గింది. యువకుడు సామాన్యంగా వున్నాడు. అతని ముఖంమీద సరళత్వము, కొద్ది అలసట కనిపిస్తున్నది. అయినప్పటికీ అతని పెదవుల మీద చిరునవ్వు ప్రకాశిస్తున్నది. అతను గుడ్డలు పిండుకోవటం చూచి అన్నాను. "మీ రిల్లెక్కడ? అరే! బొత్తిగా తడిసి ముద్దైపోయారు. ఆ షర్టు విప్పేయండి. ఉండండి గుడ్డలు తెస్తాను." నేను లోపలికి వెళ్ళి మావారి ధోవతి, కండువా తెచ్చాను. అతను వాటిని అటు ఇటు త్రిప్పిచూచి ఒక ప్రక్కన పెట్టి అన్నాడు "ఇవి వద్దు అక్కా. ఇవి నాకు పనికిరావు, నేను నా గుడ్డలే ఆరవేసుకుని ధరిస్తాను."

"నేను ఆశ్చర్యంతో "ఈ గుడ్డలు ధరించకుండా అవి ఎట్లా ఆరవేస్తారు?" అన్నాను.

అతను షర్టు విప్పుతూ "అవి విదేశీ వస్త్రాలు" అన్నాడు.

"అయితే వుండండి" అని నేను తిరిగి రెండు ముద్దుకండువాలు తెచ్చాను. అవీ ఖద్దరువి కావు కాని స్వదేశీమిల్లులో తయారుచేసినవి. అతను అవి తీసుకున్నాడు. తిరువాత కొంత సేపటికి నేను కుంపటి రాజేసి చలి కాచుకొనుటకు తెచ్చేటప్పటికి అతను గుడ్డలుమార్చి కిటికీవద్ద నిలుచుని బయట ఏదో చూస్తున్నాడు. కుంపటి అతనివద్ద పెట్టూ అడిగాను. "మీరు ఎవరూ? ఇంతకూ మీ సంగతి చెప్పనేలేదే? మీ పేరేమిటి?"

అతను చిరునవ్వు నవ్వుతూ కుంపటివద్దకు జరిగి—"పేరా?... పేరు దినేశచంద్రుడు. ఎప్పుడూ వినలేదా?"

"దినేశ్ చంద్ !...అయితే నీవు దినేశ చంద్ వా?...నిజమేనా?...ఏమిటీ? నీవు అతనేనా?" ఆదుర్దాగా అడిగాను.

అతను నా గాభరా చూచి అదేవిధంగా మందహాసం చేస్తూ అన్నాడు "అవునక్కా! నిజమే చెపుతున్నాను...నేనే...కాని.."

నా ధైర్యం సడలింది. అయ్యో! ఆలోచించకుండ ఎంతపనిచేసి కూర్చున్నాను. చాలకాలం క్రిందటనే దినేశచంద్రుని ప్రాణాలతో గాని చంపిగాని తెచ్చినవారికి పదివేలరూపాయలు బహుమానమివ్వగలరని ప్రభుత్వం ప్రకటించింది. అటువంటి భయంకరాపరాధికా నేను ఆశ్రయమిచ్చినది!......

నేను కొంచెం స్థిమితపడి "ఇది ఎవరియిల్లో మీకు తెలుసునా?" అన్నాను.

అతను నిర్లక్ష్యంగా – అన్నాడు. "తెలియదు. బయట ఎంత చీకటిగా వున్నదీ:"

"అవును బయట అంధకార బంధురంగా వున్నది. ఆ తీగెలన్నీ త్రెంపింది మీ శ్రేణికి చెందినవారేగా?" నేను కొంచెం ఆగాను. ఎవరైతే నన్ను అక్కా అని పిలిచి, నావద్ద ఒక మహత్వపూర్ణస్థాన మేర్పరచుకొందలచాడో, అతనియెడ విరక్తి భావము ప్రకటించటానికి నేను సంకోచించాను. అయినా అతనిని హెచ్చరించటానికి మెల్లిగా అన్నాను. "ఈ బంగళా సబ్ మేజిస్ట్రేటు గారిది." అన్నాను.

"సబ్ మేజిస్ట్రేటుగారిదా? అయితే... మీరు...వారి...ఓహో...తెలిసింది. కాని ఈ అర్ధరాత్రి ఎక్కడకు వెళ్ళగలను? ఈ రాత్రి మీరు నాకు శ్రయమీయవలసిందే"

నేనునవ్వి "కాని మీ కీచోటు నిరపాయకరమైనది గాదు." అన్నాను.

"ఏమంటున్నారు?...నారీచ్ఛాయ పురుషుని సదా రక్షిస్తూనే వుంటుంది" అని పసిబాలు నిలా నవ్వాడు అతను.

"కావచ్చు కాని ఒక సామాన్యపురుషుని కాదు. ఒక విద్రోహి, విప్లవకారుడు" అన్నాను నేను.

అతను పెద్దగా నవ్వాడు "కాని... అక్కా నేను ఎవరిఆశ్రయం పొందానో ఆమెయెడ నిశ్చింతుడను...ఆమె ఎవరైనా కావచ్చు ... కాని ఆమె స్త్రీ హృదయం కలిగివుంటుంది. సోదరియొక్క స్నేహపూర్ణమైనవాత్సల్యం ఆమెలో ధ్వనిస్తూ వుంటుంది. మాతృప్రేమ ఆమె నలువైపులా ఆవరించి వుంటుంది ... ఆమె ముఖంమీద విశ్వాసదీప్తి ప్రకాశిస్తుంటుంది" అన్నాడు.

నేను నవ్వుతూ "ఒకవేళ వారువ స్త్రీనో" అన్నాను. అతను కొంచెం ఆలోచనలో పడ్డాడు.

"అయ్యో బలేదాన్నే! మాటల్లో పడి నీభోజనం సంగతి విచారించడమే మరిచిపోయినాను. నీకు బాగా ఆకలివేసి వుంటుంది?" అన్నాను.

"అవును...కాని లేదు. ఆకలితో వుండటం నాకు అలవాటయిపోయింది. నేను రెండు మూడు రోజులు నీళ్లుత్రాగి గడిపేయగలను."

నేను పిల్లలకు పెట్టగా మిగిలిన పాలు పూరీలు అతనికి తెచ్చియిచ్చాను. అతను పడుకోవటానికి నిరపాయకరమైనచోట పడక ఏర్పాటుచేశాను. భోజనం అయిన తిరువాత అతను చాలసేపు నాతో మాట్లాడుతూ కూర్చున్నాడు. నేను ఎన్ని వాదనలు చేసినా వాటిని తన మృదుమధుర వాక్కులతో ఖండించాడు. నా రాత్రి పూర్తి అయింది. నేను లేస్తూ అన్నాను. "ఇక నీవు కూడ వెళ్ళి పడుకో" అతను నా ఆజ్ఞను పాలించే బాలకునిలా లేచాడు. మంచంమీద నిద్రిస్తున్న నా ఇద్దరి పిల్లలను చూచి "ఈ అమాయిక బిడ్డల భవిష్యత్తును మీ రెప్పుడైనా వూహించారా అక్కా!" అని అడిగాడు.

"ఊహించాను. బిడ్డ జన్మించినప్పటి నుంచి ఆ బిడ్డ భవిష్యత్తును గురించిన కల్పనలతోను వూహాలతోనే తల్లి గడుపుతుంది దినేశ్!" అన్నాను.

"కాని అక్కా! మీ బిడ్డలను మీరు ఏ రూపంలో వూహించుకుంటున్నారు? ఈ బానిసత్వపు శృంఖలాలను త్రెంచివేసే వీరులుగానా? లేక వానిని ధరించే బానిసలుగానా? ఈ విషయం ఈ యుగంమీద ఆధారపడివున్నది. మీరు బహుశః ఈ విషయముగాన్ని విశ్వసించరనుకుంటాను. నేటి

ఈ విప్లవం మా భవిష్యత్సౌభాగ్యానికి సూచన గాదా?"

"కావచ్చును. కాని దానికి చాల ఆలస్య ముంది. నీవంటి దినేశ్‌లు ఇంటింట బయలు దేరిన రోజున తప్పకుండా విశ్వసిస్తాను."

"అందులోనూ ఆలస్యంలేదు అక్కా" అంటూ దినేశ్ నిద్రపోవటానికి వెళ్ళిపోయాడు. నేను కూడ పిల్లలప్రక్క పడుకున్నాను.

ఇంతలో కొంచెం చప్పుడయింది. కారు హారన్ వినిపించింది. మెలకువ వచ్చింది. గడియారం చూచాను. 4 10 నిముషాలు అయింది. బయట వారు డ్రైవరుతో అంటున్నారు. "ఇక నీవు వెళ్లి విశ్రాంతి తీసుకో. సరిగా 7 గంటలకు తిరిగి నేను డ్యూటీలో

★

వెళ్తాను. కారు సిద్ధంగా వుంచు."

నా వెంబడి ఆయన పైకి వచ్చేశారు. గుడ్డలుమార్చి మంచం మీద పడుకుంటూ నన్ను చూచి "కుముదరాణీ! నీవు ఏదో కొంచెం అలసటగా వున్నట్లున్నావు! ఏమిటి విషయం?" అన్నారు.

నన్ను నేను సంబాళించుకుని "ఏమిటి! నేనా!...నేను బాగానే వున్నానే... మీరే బాగా అలసి పోయారు. కళ్ళుఎఱ్ఱగా వున్నాయి. అందుకని మీరు సరిగా చూడ లేక పోతున్నారు." అన్నాను.

"అవును రాత్రంతా పరిగెడుతూనే గడిచింది. 11 గంటలకు భోజనం చేయటానికి కూర్చున్నాను. అప్పుడే అనుకోకుండా కబురొచ్చింది—పరారైన కొందరు విద్రోహులు మూడుమైళ్ళదూరంలో ఒక గ్రామంలో దాగి వున్నారు అని. అక్కడకు చేరేసరికి వారంతా అక్కడ నుండి మాయమయినారని తెలిసింది. పరిసరాలన్నీ వెతుకుతుండగానే 2 గంటలయింది. బసకు వచ్చేసరికి ఈరోజు పరారైనవారిలో ఒక గొప్ప విప్లవకారుడు కూడ వున్నాడని తెలిసింది... పేరు నీవూ వినేవుంటావు... దినేశ్!..."

"దినేశ్! ఏమన్నారు?...దినేశా!" నా నోటినుండి అప్రయత్నంగా వచ్చాయా మాటలు. కానివారు నామాటలమీద ధ్యాస ముంచలేదు. వారు చెప్పుకుపోతున్నారు. "అవును. అతని మాటే చెపుతున్నాను. ఎన్నో నెలలుగా పోలీసులు అతనిని వెంటాడుతున్నారు. అతను ఎప్పుడూ పోలీసుల కళ్ళల్లో దుమ్ముకొట్టి పారిపోతున్నాడు. అతనికోసం నేనుగూడ వెతికి వెతికి అలసిపోయాను. ఇవ్వాళ వర్షంకూడ అతనికి చక్కగా అనుకూలమయింది."

నా గుండెలు కొట్టుకొంటున్నాయి. వారు మళ్ళీ ఇలా అన్నారు "పట్టణంలో దాక్కొవటానికి వీలున్న స్థలాలన్నీ గాలించేశాను. కాని ఎక్కడా అతనిజాడ దొరకలేదు. పోలీసు సూపరింటెండెంటయితే యింకా తిరిగి రానేలేదు...... బహుశః అతను తనబసకువచ్చిన తరువాత ఫోన్‌చేస్తాడేమో...నన్ను వెంటనే లేపు."

"అలాగే, మీరు నిద్రపొండి"అని నేను వారికి దుప్పటికప్పి దోమతెర దింపాను. వారికి పదినిమిషాలలో నిద్రపట్టేసింది. వారు ఎవరికొరకు రాత్రంతావర్షంలో తిరిగారో అతను నా ఆశ్రయంలో సుఖంగా నిద్రపోతున్నాడు.

నేను సవ్వడి చేయకుండా క్రిందకు వచ్చాను. అతను కూడ లేచే వున్నాడు. నన్ను చూచి ఎంతో వినయంగా "ఇక వెళ్ళుతున్నాను అక్కా! నీకు నా ధన్యవాదాలను ఎలా తెలియజేయాలో అర్థం కావటంలేదు. కాని నీవంటి సోదరీమణులను ఇంటింట సృష్టించమని భగవంతుని అనుదినమూ ప్రార్థిస్తూవుంటాను"అన్నాడు.

"అటు చూశావా? ఇప్పుడుకూడ వర్షం కురుస్తూనేవున్నది. నేను నిన్ను ఎలా వెళ్ళనివ్వగలను?"

"మీరు విచారించకండి నేను చీకటిలోనే చాలదూరం వెళ్ళిపోగలను."

"వీల్లేదు. వర్షం ఆగనంతవరకు నిన్ను వెళ్లనివ్వను. ఇంకా ఈరోజుకూడ పోలీసులు నిన్ను వెతుకుతూనే వున్నారు. ఏమార్గమూ నీకు సుగమంగా లేదు."

"పోలీసుల కళ్ళు ఎప్పటివలెనే నేడు కూడ మోసపోతాయి. మీరు నమ్మండి. నన్నుగురించి నాకేం భయంలేదు. నాకు ఏం జరిగినా సరే......నా రక్షణకొరకు మిమ్మల్ని చిక్కులలో పెట్టను."

"ఏమిటి నీవనేది? నాకు అర్థం కావటంలేదు"

"ఇంతవరకు గృహాయజమానిలేకపోవటంచేత మీరు గృహ యజమానురాలుగా వున్నారు. కాని ఇప్పుడు గృహాయజమాని స్వయంగా వచ్చి వున్నారు." అన్నాడు మందహాసం చేస్తూ.

నేను విచారంలోపడ్డాను. అతను రెండు కండువాలూ నా యెదుట పెట్టుతూ "నమస్తే! ఇక నేను వెళుతున్నాను" అన్నాడు.

నా హృదయం స్పందించింది ... విలపించింది. ఒకానొక సోదరికి ప్రియసోదరుడు, ఒకానొకతల్లికి ముద్దుల బిడ్డడు అయిన దినేశ్ అభాగ్యుడు ... కాదు ... కాదు మాతృభూమికోసం ప్రాణాల్ని అర్పించే తల్లియొక్క కిరీటములోని అమూల్యరత్నం. అలాంటి దినేశ్ నేడు బంధింపబడితే, అతనికిలభించే శిక్ష మృత్యువు!...మృత్యువా!...కేవలంమృత్యువా?..." నేను అతని చేయి పట్టుకుని ఆపి "కొంచెం ఆగు ఇప్పుడే వస్తాను" అని లోనికి వెళ్ళి అన్నగారికోసము తయారుచేసిన 'రాఖీ' తెచ్చి అతని చేతికి కట్టాను. నా కాలువ అతనికి కప్పాను.

"ఇదేమిటి?"

"ఏమీలేదు. ఇది సోదరీ ప్రేమయొక్క పవిత్ర సూత్రము. దీనిని భగవంతుడు నీకు రక్షాకవచము చేయుగాక! నేనుకూడ ఎప్పుడైనా గర్వంతో స్వాతంత్ర్యోన్మాదంతో విప్లవకారుడైన ఒక సోదరుని చేతికి నేనూ ఒకప్పుడు రాఖీ కట్టాను అనుకుంటాను... నా విశీర్ణ హృదయానికి ఇది ఎంత ఆనందాన్నిస్తుంది!"


అతను వంగి నా పాదములకు ప్రణమిల్లాడు కనులతో తిరిగిన కన్నీళ్లను చిరునవ్వు చాటున దాచివేస్తూ వేగంగా బయటకు వెళ్ళిపోయాడు.


దగ్గరలో ఎక్కడో గంట మ్రోగింది. పక్షుల కలకలారావములు శ్రవణగోచరములవుతున్నాయి, నేను నెమ్మదిగావచ్చి మంచంమీద పడుకున్నాను.

* * *

అది పరాధీన భారతదేశంలో ఒక నిశ రాత్రి. ఇది స్వతంత్రభారత సుప్రభాతం.

★








కా


ధృ

కె. లక్ష్మీ















శ్రీ ర
శ్యాలు


★


ఫో లు:

రఘురామ్









వనితాలోకం సీరియల్



10

వధువుకి వ్యతిరేకంగా నివారణుడు రాణీవద్ద ఫిర్యాదు చేసి వెళ్ళిపోయాడు. అంతేకాదు; ఆమె చేసినదానికి తగినశాస్తి చేస్తాననికూడా సగర్వంగా చెప్పి వెళ్లాడు. ఆ అప్రీతికరమైనవిషయంలో తా నెంతవరకు అపరాధో. ఆసంగతి పైకి చెప్పకుండా అతను కప్పిపుచ్చినట్టే - ప్రత్యక్షంగా చూసినవారుకూడా యువరాజుగారి నేరం విషయమై ఏమీ నోరెత్తలేదు. కొంచెం ధైర్యస్థులు, ఏదైనాసరే నిర్మొహమాటంగా చెప్పగలరు అని పేరున్నవారూ ఇచ్చిన సాక్ష్యంమాత్రం ఇలా ఉంది. "ముందుగా యువరాజుగారు ఏదో కాస్త తొందరపడి నోరు జారారే అనుకోండి. అయితేమాత్రం వేళాకోళం అనే పేరుతో కోపిష్ఠి చటుక్కున అంతమాటఅనెయ్యటం మాత్రం ఏం బావుంటుంది? వెయ్యి చెప్పండి, లక్ష చెప్పండి, ఏమైనా ఆమె పేదయింటి పిల్ల. అందులోనూ క్రొత్త పెళ్లికూతురు. అతడంటారూ ఆ యింటిమగబిడ్డ - అందులోను యువరాజుకదా!"

అసలింతకీ జరిగిన సంగతి ఇది: పేరంటం వగైరాలన్నీ ఇంచుమించు అయిపోతున్న సమయంలో అక్కడచేరిన ఆడవాళ్ళలో కలవరం పుట్టింది. అక్కడికి అతిముఖ్యుడైన పురుషుడెవరో వస్తున్నాడని తెలిసింది. అతడిపేరు వింటేనే ఆడవాళ్ళకందరికీ అదో - చెప్తేసిగ్గు. "యువరాజుగారట! యువరాజుగారు!" అంటూ అందరూ చెవులు కొరుక్కోసాగారు. ఇప్పటివరకూ మేలిముసుగులు లేకుండా స్వేచ్ఛగా ఆ ఆనందంలో మునిగిఉన్నవారందరూ వచ్చిన వ్యక్తి ఫలానా అతడని తెలిసేసరికి, కంగారు పడుతూ అవగుంఠనాలు మళ్ళీ సరిచేసుకుని ముఖాలు దాచుకున్నారు.

వధువు యింతవరకూ తల వంచుకుని అక్కడ జరుగుతున్న తంతులో లీనమై ఉంది. పాము పేరు చెపితే ఎలా అదిరిపడతారో యువరాజు పేరు వినేసరికి చండి కూడా అలాగే ఉలిక్కిపడి, ద్వారంకేసి తీవ్రంగా చూస్తూ కూచుంది. ఆరోజున భర్త చెప్పిన మాటలు ఆమె ఇంకా మరిచిపోలేదు—"అలా చెపితే ఇంకేమైనా ఉందా, చిన్న జమీందారు వచ్చి నీవు తాట ఒలవడే! ఒక్కొక్క రోజున కొట్టాడంటే—" ఇప్పుడా వ్యక్తే తన ఎదుటికి రాబోతున్నాడు.

ముఖవైఖరిలో, నడకలో - ఒకవిధంగా అన్నమాటేమిటి? అన్నివిధాలా తన ఆభిజాత్యాన్ని వెల్లడి చేసుకుంటూ నివారణుడు దాలాల్లోకి వచ్చాడు. అక్కడున్న స్త్రీలంతా హడావిడిగా అవగుంఠనాలు సరిచేసుకోవటం అతడి కంటపడింది. అతను అతి-మొరటుగా "నేనేం పెద్దపులిననుకున్నారా ఏం! నన్ను చూడగానే అంత భయంతో ముడుచుకుపోతా రెందుకు?" అన్నాడు.

ఇంకాకూడా ఏదో అనబోయాడు నివారణుడు. కాని సరిగ్గా అదేసమయానికి నవవధువు విశాలనేత్రాల్లోని తీక్ష్ణదృష్టి-విచిత్రమైన అతడి చూపులతో తారసిల్లింది. విచిత్రమైన చూపు అనటంలో అర్థం లేకపోలేదు. నివారణుడి కనుగ్రుడ్లు పిల్లిగ్రుడ్లు లాగా విచిత్రంగా ఉంటాయి. ఈ అందమైన యువకుడి ఆకృతిలో అవలక్షణ మనుకున్నా ప్రత్యేకతనుకున్నా అదే.

తను జమీందారీలోని ఓ సామాన్య గృహస్థుని కూతురు ఈ వంశానికి కోడలయ్యే గౌరవాన్ని పొందగలిగింది—కాని తను వంశానికి కళంకంలాంటివాడు - మతిలేనివాడూ అయిన తన అన్నతో ఈమెకి జత ఎలా కుదురుతుందా అని ఆలోచన వచ్చేసరికి అతడిలోని కుతూహలమూ, కొంటెతనమూ అన్నీ ఒక్కసారి ఈ ఆడవాళ్లందరిముందటా పైకి ఉబికాయి. తాను అక్కడికి రాగానే వధువు చూపులు, తన చూపులు తారసిల్లుతాయని గాని, ఆమె నిస్సంకోచంగా మేలిముసుగును ప్రక్కకి తొలగించుకుని తనకేసి తేరిపార చూస్తుందని కాని అసలతడి ఊహకి తట్టనేలేదు. సంకోచరహితమైన ఆమె తీక్ష్ణదృష్టి, ఆ సుందరమైన ముఖం, సర్వావయవాల్లోనూ అనవద్యమైన ఆ లాలిత్యం చూసేసరికి నివారణుడి బుర్రంతా పురుగులు తొలిచినట్లు అయింది. ఒక్క క్షణం వధువు ముఖంకేసి రెప్పవాల్చకుండా చూసి, "ఏమయినా మా పిచ్చాడికి మంచి పెళ్ళామే దొరికింది. కోతి తలకాయకి బంగారు కుచ్చుల కుళాయి తొడిగినట్లే ఉంది సుమా!" అన్నాడు వెటకారంగా.

పరాయి ఇల్లు, పరిచయంలేని చోటు, ప్రక్క నెవరూ ఆత్మీయులైనా లేరు... తాను ఇలాంటి నిస్సహాయస్థితిలో ఉన్నానన్న సంగతి కూడా చండి ఆ క్షణంలో మరిచిపోయింది. విష్ణుడూ రుద్రుడూ అని తాను ఇన్నాళ్లనుంచీ అనుకుంటూఉన్న వ్యక్తి యిప్పుడు ప్రత్యక్షంగా ఎదుటపడేసరికి అతడ్ని చూడటానికి ఆమెకళ్లు రెపరెపలాడాయి. కాని ఒక్క రెప్పపాటులోనే అతడు ఆ నాగరికుడిలా తనను అభూతపరచగలడన్న ఆలోచనమాత్రం ఆమెకి రాలేదు. ఉత్తేజనతో ఆమె సర్వావయవాలూ కండరాలూ ఉబికి ఎర్రబడ్డాయి. ఆమె హృదయంలో రగులు

మూలం: మణిలాల్ వంద్యోపాధ్యాయ   అనువాదం: మద్దిపట్ల సూరి

తున్న జ్వాల కళ్ళలో ప్రస్ఫుటం కాసాగింది. ఆ ఉజ్జ్వలదృష్టి భర్తముఖంమీదికి ప్రసరించగానే ఆమె నిలువెల్లా వణికిపోయింది. భర్తముఖం కాలిన కాగితంలా వివర్ణమైపోయింది. గజగజలాడిపోతున్నాడతను. అతడి నోటమాట లేదు. అతడి కాతర దృష్టిలో ఏదో ముప్పుమాత్రం ముందుకు దూకుతున్నట్లుంది.

భర్తచూపులతో తన చూపులు కలియగానే చండి దీర్ఘంగా నిట్టూర్చి, తన ఉద్రిక్తముఖాన్ని క్రిందికి వంచుకుంది. తల క్రిందికి వంచుకుంటూనే అవగుంఠనాన్ని కూడా ముందుకు లాక్కుంది.

నివారణుడి మేనమామకూతురు మృణాళిని వధూవరులకు దగ్గరగానే కూర్చుని ఉంది. ఆమె పదిహేడేళ్ళపడుచు. చక్కదనాలకుప్పే కాకుండా చదువుకున్న భామ. బస్తీబడాయి, అభిజాత్యంతోబాటు అహంకారం, ఆమెలో అడుగు అడుగునా వ్యక్తమవుతూంటాయి. రాజా అనే బిరుదం ఉన్నాయన మనుమరాలసలామె. కాబోయే భర్తకూడా మరెవరో కాదు. విఖ్యాతుడైన ఓ బారిష్టరుకొడుకు - అతనుకూడా విదేశాలకి పోయి బారిష్టరీ చదువుతున్నాడు.

ఇలాంటి పల్లెటి దిక్కునుండే స్త్రీలల్లో ఆమెస్థానం అరడుగు లెత్తున ఉండటం అసహజం కాదు. ఆమె ఎవరితో పడితే వారితో అతిగా మాట్లాడదు. ఆత్మమర్యాదను కాపాడుకోవటంలో అప్రమత్తురాలయే ఉంటుంది. మాధురీదేవికి మేనకోడలంటే అంతర్యంలో చాలా అపేక్ష. 'శ్రీమంతుల బిడ్డలికి ఆభిజాత్యపు అహంకారం మరింత అందాన్నే చేకూరుస్తుం' దంటుంది ఆమె. విదేశాలనుంచి భర్త వచ్చేంతవరకు చక్కనిచుక్క అయిన మేనకోడల్ని రాణీగారు తనదగ్గిరే ఉంచుకో తలచుకుంది.

వధువు చటుక్కున అవగుంఠనాన్ని సవరించుకోవటం చూసి ముఖం పక్కకి తిప్పి నవ్వుకుని, "మా బావ ఒక్కమాటతో ఆవిడ్ని సిగ్గుతో ముడుచుకుపోయేట్లు చేశాడే!" అంది.

నివారణుడు వధువుకేసి వంకర చూపు చూసి, "మన మేం చెయ్యగలం ఆవిడ సాహసం ముందు?... కాని చివరి కలాంటి ఆవిడకూడా మూరెడు ముసుగు ముందుకు లాక్కుని మిగతావాళ్లతో కలిసిపోయింది. అది చిత్రం! అలా కన్నుగిలికి చూశాక ఇంక ఆ సిగ్గు నప్పదు. దాన్ని వదిలించాల్సిందే. ఆ మేలిముసుగును ముందు నువ్వ ప్రక్కకి తప్పించు" అన్నాడు నివారణుడు ఆనందంతో తుళ్ళిపడుతూ...

నివారణుడి మాటప్రకారం - మృణాళిని వధువు మేలిముసుగు అంచుమీద చెయ్యి వెయ్యగానే ఆమె ముంజేతిమీద చండి చెయ్యి యాదాలాపంగా పడింది. మరు క్షణంలోనే ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లు మృణాళిని శరీరం యావత్తూ బిగుసుకుపోయినట్లయి 'అమ్మో' అని కేకేసిందామె. ఆమెకి ఫిట్సు వస్తూఉంటాయి అప్పుడప్పుడు. అలాగే ఇప్పుడూ ఫిట్ వచ్చిందనుకున్నారందరూ - ప్రక్కనున్న వాళ్ళందరూ కంగారు పడిపోయారు. కాని కాస్సేపటికల్లా ఆమెలో ఆ బెదురు పోయింది. మళ్ళీ మామూలుమనిషయి అవ

★ స్వయంసిద్ధ ★

గుంఠనవతియైన వధువుకేసి భయ సంశయ దృష్టితో చూసింది.

"ఏం జరిగింది మీనా? అలా బేజారయి పోయావేమిటి?" అని అడిగాడు నివారణుడు.

మృణాళినిశరీరం అప్పటికీ యింకా గజగజవణుకుతూ నేఉంది. ఆవణుకు ఆమె కంఠంలోకూడా వ్యక్తం అవుతోంది. ఆమె నెమ్మదిగా సమాధానం ఇచ్చింది - "వధువు అవగుంఠనాన్ని తొలిగిందామని పట్టుకోగానే నాశరీరమంతా ఒక్కసారి ఝల్లుమంది. ఎవరో నా నరాలులాగి మెలివేస్తున్నట్లు అనిపించింది. 'ఫిట్' రాబోతోందేమో అనుకున్నా. కాని అదికాదు. ఆమె ఏదో కిటుకు చేసిఉంటుందనుకుంటా"

నివారణుడు వ్యంగ్యంగా "అవునవును. ఆయుర్వేదవైద్యుడి కూతురుటగా! మంత్ర తంత్రాలు చాలా తెలిసిందయిఉంటుంది. కాని నువ్వు భయంతో ప్రక్కకి తప్పుకున్నావు. అవగుంఠనాన్ని లాగెయ్యానే లేదు" అన్నాడు.

"ఇంకానా? ఇంక నావల్ల కాదుబాబూ! నీకంతకోరికగాఉంటే నువ్వే వెనక్కి లాగెయ్" అన్నది మృణాళిని.

నివారణుడు తీక్ష్ణంగా "మేలిముసుగు తీస్తావా? లేక నా చేతుల్తోనే తీసెయ్యమన్నావా?" అని అడిగాడు.

వధువు మాట్లాడలేదు. ప్రాణంలేని ప్రతిమలాగా నిశ్చలంగా కూచుని ఉంది.

మృణాళిని కూడా—"నీ బడాయి చూస్తే చాలా చోద్యంగా ఉందే! మరిది అంటే అంత సిగ్గున్నదానివే అయితే— అతడు గుమ్మంలోకి రాగానే ముఖంమీది ముసుగు తప్పించుకుని అలా యెందుకు చూశావో చెప్పమరి!" అని ఓ విసురు విసిరింది!

ఈసారి అవగుంఠనంలోంచి వధువు కంఠస్వరం ఖంగున విన్పించింది. "నేనలా ఎందుకు చూశానో మీకు తెలుసుకోవాలని ఉందా?"

వండి అలా అనటంతో అక్కడున్న వారందరికీ అపరిమితాశ్చర్యం, ఆపుకోలేని కుతూహలమూ కలిగాయి.

ఆమె వెంటనే మళ్ళీ వదురూ బెదురూ లేకుండా "మా నాన్నగారు నన్ను చూడటానికి వచ్చినప్పుడు ఒక కొరడాని కానుకగా ఇచ్చారు" అని ఒక్కక్షణం ఆగింది.

ఎవరి నోటా మాట లేదు. ఆమె ఇంకా ఏమనబోతోందో అని అందరూ చెవులొగ్గి ఊరుకున్నారు.

"తమ యింట్లో ఓ గాడిద ఉన్నదనీ, ఆకొరడాతో ఆ గాడిదని లొంగతీసుకోవాలనీ చెప్పారు. ఆ గాడిద ఎలాంటిగా అన్న కుతూహలంకొద్దీ అలా చూశాను."

వధువుముఖతః ఈమాటలు రావటం విని అందరూ శిలాప్రతిమలైపోయారు. మరో క్షణంపోయాక మేలిముసుగుల్లోంచి నివారణుడిముఖంకేసి చాటుగా చూశారు. అతడి అందమైనముఖం - ఎవరోవచ్చి తారు పులిమినట్లు - నల్లబడిపోయింది.

11

అత్తవారింటికి కొత్తగా వచ్చిన కోడల్ని చక్కగా ముస్తాబుచేసి, మంగళవాయిద్యాలు మోగుతుండగా అంతఃపురంలోని ధనాగారానికి తీసుకెళ్లటం ఈ గంగూలీవంశీయుల సంప్రదాయం. ఆ గదిలో ఓ పెద్ద ఇనుపమందసంలో దుర్లభములైన రత్నాలు, విలువగల బంగారు నగలు భద్రపరచి ఉంటాయి. శుభముహూర్తంలో నూతన వధువుయెదుట ఆ మంద

పాన్ని తెరిస్తే అందులో ఉన్న అధర ణాల్ని ఆమె చేత్తో ఒకసారి స్పృశించాలి.

ఆ సంప్రదాయం ప్రకారం మాధురీదేవి - కొంతమంది పేరంటాండ్రను పిలిచి శుభ లగ్నంలో చండిని ముస్తాబు చేయించి ఆ మందసం ఉన్న చోటుకు తీసుకెళ్ళింది. ఆ మందసాన్ని దానికి తగిన పెద్ద పెద్ద తాళాలతో బిగించికూడా ఉంచారు.

యజమానిఆజ్ఞప్రకారం దుర్గాదాసనే నౌకరు మున్రవాడు తాళాలగుత్తి తీసుకొచ్చి ముందు తాళాలు తీశాడు. మరొకప్పుడెప్పుడైనా ఈ మందసాన్ని తెరవవలసిన అవసరం వస్తే జమీందారుగారి సన్నిహిత భృత్యుడు - వస్తాదు అయిన పంచాననుడు తాళాలు తీసుకొచ్చి తీసి, ఆ మూత పైకి ఎత్తుతాడు.

దుర్గాదాసు తాళాలన్నీ తీసి, ప్రక్కకి తప్పుకుని నిలబడగా నే మాధురీదేవి కొంచెం విసుగ్గా "పంచాననుడు వచ్చినట్టు లేదు - దీనిమూత ఎవ రెత్తుతారు పైకి?" అని అడిగింది.

"దీన్ని తెరవటానికీసారి వస్తాదును పంపాల్సిన అవసరంలేదని బాబుగారు సెలవిచ్చారు" అని దుర్గాదాసు సవినయంగా మనవిచేశాడు.

రాణి కనుబొమలు చిట్లించి - "అయితే నువ్వే దీన్ని తెరిచేంత మొనగాడివయినా వనుకుంటాను" అన్నది.

ఆ మున్రవాడు భయపడుతూ "నేనా! ఇంత దయ్యమంతమూతని నేనెక్కడ ఎత్తగలను రాణీగారూ? రెండు చేతులతో నాబలమంతా ఉపయోగించినా అంగుళంకూడా పైకి లేవదు" అన్నాడు.

"అయితే ఇహ నేం. పహిల్వాన్ని పంపి తెరిపించాల్సిన అవసరం లేకపోతే - దొరగారినే వచ్చి తెరవమని చెప్పు - వెళ్లు" అని గద్దించింది రాణి.

చండి వారిద్దరిసంభాషణా శ్రద్ధగా

స్వయంసిద్ధ

విన్నది. ఈమాటను పైకి ఎత్తించటంలో యజమాని మనస్సులోని అభిప్రాయమేమైందీ గ్రహించి, తనలో తాను నవ్వుకుంది. కాని ఆ సంగతి బయటపెట్టకుండా అత్తగారికేసిచూసి, "మామగారు చెప్పింది యుక్తంగానే ఉంది అత్తయ్యా. దీన్ని తెరవటానికి అంతఃపురంలోకి వస్తాదు రావాల్సిన అవసరం ఏముంది? మనం తెరవలేమా?" అన్నది.

భర్త చెప్పిపంపిన మాటలు వినేసరికే రాణిగారికసలు మహా అభిమానంగా ఉంది. ఇహ ఈ కోడలిమాటలు వింటూంటే ఆమెకి ఒళ్లు మండిపోయింది. ఆమె పైకి యేమీ అనలేదుకాని కోడలికేసి మహాపరుసుగా చూసింది. ఆమె పెదవి కదల్పకపోయినా ఆ చూపులో ఆమె అభిప్రాయం స్పష్టంగా వెల్లడయింది. ఆమె జ్వాలాదృష్టిలోని అంతర్యాన్ని - ఆమె మేనకోడలు మృణాళిని మాటల్లో వెల్లడించింది. ఆమె వదినకేసి ఈసడింపుగా చూస్తూ ఎకసక్కెంగా అన్నది—

"పదిమందియెదుట మాట్లాడుతున్నప్పుడు - కాస్త వెనకా ముందూ పారచూసుకుని మాట్లాడుతూ ఉండాలమ్మా కొత్తకోడలా! చేతుల్లో కాస్త సత్తువుంటే చటుక్కున పైకి ఎత్తెయ్యటానికి - మీ పుట్టింటారి యింట్లో ఉండే జాజిచెక్కల పెట్టెలాంటి దనుకున్నావా యేం? రెండు మణుగుల బరువున్న ఈ మూతి పైకెత్తాలంటే - మనం నువ్వులూ తెలకపిండీతింటూ రెండేళ్లు తాలింఖానాలో కసరత్ చెయ్యాలి."

ఆ రక్తమైన చండిముఖంలో అలవోకగా ఓ చిరునవ్వు మెరిసింది. "నీ మాటలు నిజమే చెల్లీ! కాని అసలుసంగతి మరిచిపోతున్నావు నువ్వు ఈ వంశమర్యాదని కాపాడుతూ ఈ యింటికి కోడలుగా వచ్చే ఆమె - కులదేవతలాంటి ఈ మందసాన్ని తెరవగల యోగ్యతను కూడా తెచ్చుకో గలిగినదై ఉండాలి. మామగారి ఆదేశాన్ని శిరసావహించి, వారి ఆశీర్వాదంతో - మా పుట్టింట జాజిచెక్కలపెట్టని తెరచిన చేత్తోనే ఈ ఇనుపమందసాన్ని కూడా తెరుస్తాను. వస్తాదుని పిలిపించవలసిన అవసరం వాస్తవంగా నే లేదు."

చండి తన సహజమైన ధోరణిలోనే ఈ రెండు మాటలూ అని, తాళాలు తీసిఉన్న - కబంధ శరీరంలాంటి ఆ యినుప మందసంపై తలుపును రెండు చేతుల్తో చులాగ్గా యెత్తి వెనుకనున్న గోడకి ఆన్చింది.

దోర్దండప్రతాపుడైన జమీందారుగారి గృహిణి - అంతఃపురంలో రాణిగారు - అయిన మాధురీదేవిలగాయతు అక్కడ ఉన్న చిన్నా - పెద్ద మొత్తం యాభైమంది స్త్రీలూ, వెనుక నిలబడిఉన్న దాసీలూ - వంటలక్కలూ - యావన్మందీ ఆమె చర్యకు ఆశ్చర్యపోతూ ముక్కుప్పగించి చూడసాగారు. ఈ నవవధువు ఈ మందసం తలుపును నిజంగానే తన చేతుల్తో ఎత్తిందా? లేక వీరి కులదేవత ఆమె హస్తాల్లో ప్రవేశించి ఆమె గౌరవాన్ని కాపాడిందా? మృణాళిని మొహం ముడుచుకుపోయింది. ముడుచుకు ... సినట్టయింది. అహంకారపూర్ణమైన రాణి ముఖం నల్లగా బొగ్గయింది నౌకరుకుర్రాడు దుర్గాదాసు వధువునుద్దేశించి, తలవంచి నమస్కరిస్తూ "నమస్కారాలు తల్లీ! ఇట్లాంటి యిది నేనెప్పుడూ చూడలేదు" అన్నాడు.

చండి ఎవరి స్తోత్రాలనీ చెవికెక్కించుకోకుండా రాణి మాధురీదేవిని ఉద్దేశించి, "ఇహానిప్పుడేం చెయ్యాలి అత్తయ్యా" అని అడిగింది.

గృహిణి ఇప్పటివరకూ నవవధువును పీటలంతవరకు తప్పించుకు తిరుగుతోంది. ఉభయులూ ఏదో ముక్తసరిగామాత్రమే మాట్లాడుతున్నారింతవరకు... మరీ ముఖ్యం అనుకున్న ఏవో మూడు నాలుగుప్రశ్నలే ఆమె కోడల్ని అడిగింది. ... ఆ ప్రశ్నలికి ఆమె చెప్పిన సమాధానం అత్తగారికంతగా నచ్చలేదు. ఇక్కడికి నౌకరు దుర్గాదాసు తాళాలుతీసుకుని రావటం - అతడు చెప్పిన మాటలు ఈ సందర్భంలో కోడలి ప్రవర్తన - ఇవన్నీ తనని అఘాతపరచటానికే సంఘటిల్లినట్లు కన్పించాయి ఆమెకి. ఆమె కోపమంతా యజమానిమీదికి పోయి పడింది. ఈ పరిస్థితిలో వధువు వేసిన ప్రశ్న ఆమెని మళ్ళీ మామూలుస్థితికి తీసుకొచ్చింది. దాంతో పాటు ముఖంలోని భావం కప్పిపుచ్చుకోటానికి, బలవంతాన నవ్వు తెచ్చిపెట్టుకుని, "ఆసంగతే ఆలోచిస్తూంటే ఏమీ పాలుపోకండా ఉంది. ముందుగానే తెలిసి ఉంటే ఊళ్లో స్త్రీలనందర్నీ ఆహ్వానించి - నీ చేతుల్లోని సత్తువను వారి అందరియెదుట ప్రదర్శింపచేసేదాన్ని" అన్నది.

చండి చిరునవ్వు నవ్వి - "ఈ భాగ్యానికి మీరింత ఆలోచించటం దేనికత్తయ్యా. ఇవాళ రాత్రి వెయ్యిమందిని విందుకు పిలిచారటగా! వారికందరికీ వడ్డన చెయ్యటానికి పంపండి నన్ను! దాంతో వారికి నా చేతుల్లోని బలం ఇంతకన్న స్పష్టంగా తెలుస్తుంది. దానివల్ల మీకుకూడా కొంత శ్రమ తప్పుతుంది" అన్నది.

మాధురీదేవిముఖంలోని నవ్వు కాస్తా మాయమైపోయింది. ఆమె ఈసారి కొంచెం గంభీరంగా "సరేలే, ఆ యేర్పాటేదో అప్పుడు చూసుకోవచ్చు.. ముందు ఇక్కడీ గదిలో జరగవలసిన పని కానియ్" అన్నది.

తర్వాత ఆ మందసంలో భద్రపరిచిఉన్న ఆభరణాలను చండి స్పృశించింది. సరిగ్గా అదేసమయంలో గంగూలీ వంశీయుల లక్ష్మీభాండారం మంగళవాయిద్యాలతో మారుమ్రోగిపోయింది.

[సశేషం]

బొమ్మరిల్లు

గాంధీ పథము

★

చిట్రెపోలు కృష్ణమూర్తి

వినుడి బాలకు లార!
వినుడి బాలిక లార!
వినిపింతు మీకొక్క
విమలమౌ గాథ.

పలుపాట్లుబడి మనకు
స్వాతంత్ర్యమునగూర్చి
తరలిపోయిన గాంధి
తాతయ్య గాథ!

తాతయ్య మీవలెనె
వీధిబడి లోపలను
చదువుకొను కాలాన
జరిగిన గాథ.

బడి లోని పిల్లలను
పరీక్షించుట కొఱకు
ఇన్‌స్పెక్టరొకనాడు
ఏతెంచినాడు.

బాలకుల విద్యాభి
వృద్ధి గ్రహియించుటకు
అధికారి ఆనాడు
ఇచ్చెనొక లెక్క

బాలురందఱు లెక్క
బాగుగా చేశారు
తాతయ్య ఒక్కడే
తప్పు చేశాడు

పంతులది చూచాడు
ప్రక్కగల బాలుని
పలకలో జూడుమని
సైగ చేశాడు.

కాని మన తాతయ్య
'కాపి' చేయుట తగని
పనిగ తన మనసు లో
భావించి నాడు.

ఇన్‌స్పెక్టరా రోజు
వెళ్లి పోయిన పిదప
మేష్టారు గాంధీని
పిలిచి అడిగాడు

"ప్రక్క బాలుని జూచి
వ్రాయుమని చెప్పినను
తప్పేల వ్రాశావు
తగునె? చెప్పు?"

"ఒరుల పలకలు జూచి
ఒప్పు వ్రాయుట కంటె
తనకు తోచిన తప్పు
వ్రాయుటే మేలు."

అన్నాడు తాతయ్య
ఆ మాటలను విన్న
పంతులయ్యకు చాల
ఆశ్చర్యమయ్యె.

"చిన్న వాడవె యైన
పెద్దలకు నీతులను
గఱప జాలినయట్టి
ఘనుడవే నీవు."

అని మెచ్చుకొన్నాడు
ఆ నాటినుండియును
పంతులయ్యకు తాత
ప్రియశిష్యుడయ్యె.

దీపం బుడ్డి

అలవర్తి వెంకటసుబ్బారావు

రామయ్య, ఒక సామాన్యరైతు. పదెకరాల సుక్షేత్రమున్నది. ఒక పెంకుటిల్లు వున్నది. ఆ పెంకుటింట్లో, చీకటిపడగానే ఒక కిరసనాయిల్ బుడ్డి వెలిగించి పెడతాడు. ఆ బుడ్డిముందు కూర్చుని రామదాసు కీర్తనలు చదువుకుంటూ వుంటాడు. అందువలన ఆ బుడ్డికిగూడ ఛాలా రామదాసు కీర్తనలు కంఠస్థమైనాయ్!

రామయ్య, ఎలానైతేనేం కష్టపడి సంపాదించి మొత్తం 16 ఎకరాలు జేసి, తను కాస్తా యీలోకం విడిచి మరోలోకం చేరుకున్నాడు. ఆ తరువాత ఆ 15 ఎకరాలకు రామయ్యకొడుకు జగన్నాథం అధిపతి అయ్యాడు.

జగన్నాథం జల్సారాయుడు. కన్నుమిన్నుగానక తిరుగుతాడు. తండ్రి చనిపోవడం, ఆస్థి చేజిక్కడం ...అతను ఆడింది ఆట! పాడింది పాట!! అయింది. వెంటనే పెంకుటిల్లు పడకొట్టించి చిన్న 'డాబా' వేయించాడు. కరంట్ పెట్టించాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా వైరింగ్ చేయించాడు. ఇంజనీరుగారికి ఆర్డర్ కోసం అప్లికేషన్ పెట్టాడు.

ఈ విషయం తెలిసినప్పటినుంచీ కిరసనాయిల్ బుడ్డి దిగులుపడసాగింది, ఇక తన నెవ్వరూ సరిగా చూడరుకాబోలునని.

కాని, ఆరాత్రి ... జగన్నాథం భార్య జానకమ్మ "ఏమండీ! ఎందుకండీ బోలెడుఖర్చు? కరంటు లేకపోతేనేం? యీ కిరసనాయిల్ బుడ్డి కాంతి చాలదా మనకు?" అని, తనను బలపరుస్తూ భర్తతో అంటూవుంటే, కొంచెం ఉత్సాహంతో, తన ప్రతిభను వెల్లడించేలా కిరసనాయిల్ బుడ్డి ఒక ఎగురు ఎగిరింది. "ఛీ! ఛీ! యీ బుడ్డితో ఎలా గడపటం! చూడు ... ఎలా ఎగిరెగిరి పడుతుందో! అలా ఎగిరెగిరి చివరకు ఆరిపోతుంది. కాకపోయినా, కరంటువుంటే రేడియో ... ఫ్యాన్ అన్నీ పెట్టుకోవచ్చు" అన్నాడు జగన్నాథం. "పైపెచ్చు అదొకఖర్చా? ఎందుకుస్వామీ యీ పనికిమాలిన దండుగలు!" అని జానకమ్మ ప్రాధేయపూర్వకంగా అడుగుతుంటే, "పిచ్చిదానా! కరంటుతో నే వంటగూడ చేయవచ్చు. అప్పుడు పచ్చిపుల్లలు పొయ్యిలో పెట్టి పొగతో వేగలేకపోవడం ఏమీ వుండదు" అన్నాడు జగన్నాథం!

ఈ మాటలతో జానకమ్మగూడ మెత్తబడింది. అవును మరి, రోజూ పొయ్యిదగ్గర పొగలో ముక్కుచీదుతూ, చెంగుతో కళ్లు తుడుచుకుంటూ కూర్చోవడమేనాయె! పొయ్యినిండా కిరసనాయిల్ పోసినాగాని ఆ పచ్చికట్టెలుమండుతాయా? చస్తాయా?

"సరే! కానివ్వండి ... వద్దంటే మాత్రంవూరుకుంటారు గనుకనా?" అంటూ జానకమ్మ తెలివిగా తన అంగీకారాన్ని తెలియజేసింది. జానకమ్మగూడ దిగిజారిపోవటంతో, కిరసనాయిల్ బుడ్డి తన దురవస్థకు ఏడ్చిఏడ్చి నీళ్లన్నీ కారిపోగా గమ్మున ఆరిపోయింది...

* * *

డాబాయింటికి కరంటు ఇచ్చారు. ఇప్పుడు ప్రకాశవంతంగా యింట్లో లైట్లు వెలుగుతున్నాయ్! రేడియో మ్రోగుతుంది. ఫ్యాన్ తిరుగుతుంది. కరంటు పొయ్యిమీదనే వంట జరుగుతుంది.


కిరసనాయిల్ బుడ్డి మూలకుపోయింది. ముసుగు తన్నింది. పాపం! ఏడ్వడానికిగూడ కన్నీళ్లు లేవు.

ఒకరోజు జనఇంట్లో ఫ్యూజుపోయింది. ఆనాడు మూలనున్న కిరసనాయిల్

బుడ్డి వెలిగించారు. వెలిగించారు. కిరసనాయిల్ బుడ్డి యించుక ఆనందించింది. కాని యింతలో ఫ్యూజు వేయడానికిగాను కరెంటు పనిమనిషి వచ్చాడు. బుడ్డిని చేతిలోనికి తీసికొని ఏఫ్యూజుపోయినది చూస్తున్నాడు. "ఈఫ్యూజు వెయ్యకు! నా బ్రతుకు నన్ను బ్రతుకనివ్వు!" అనిబుడ్డిఅతడ్ని బ్రతిమలాడింది. కాని, అతడా మాటలను లెక్కించక ఫ్యూజు వేసి వెళ్లాడు.

మళ్ళీ కిరసనాయిల్ బుడ్డి బ్రతుకు మామూలే! అమూలే!!

గత్యంతరంలేక, చివరికి వాన దేవుడ్ని గూర్చి తపస్సు చేసింది కిరసనాయిల్ బుడ్డి. ఎందుకంటే! వాన వస్తే కరంటు ఆపు జేస్తారుగదా! అప్పుడైనా తిరిగి తన ముఖం చూస్తారుగదా!



బుడ్డి తపస్సుకు మెచ్చి, వాన దేవుడు ప్రత్యక్షమయ్యాడు. వర్షం జోరుగా కురుస్తోంది. లైట్లన్నీ ఆరిపోయాయ్! జగన్నాధం, యింట్లో కేకలేస్తున్నాడు, "జానకీ! ఆ మూలనున్న కిరసనాయిల్ బుడ్డి వెలిగించవే!" అని.

తనకు ఏ అవకాశం కావాలని తపస్సుజేసిందో, ఆ అవకాశం రానే వచ్చింది. కాని, చీకట్లో వారి ఆరాటం చూచినకొలది, . వారినలా చీకట్లోనే చిందులు వేయించాలనుకున్నది కిరసనాయిల్ బుడ్డి. ఇంకా మూలకు నక్కింది.

జానకమ్మ బుడ్డికోసం మూలను చెయ్యిపెట్టింది మూలనున్న తేలు కుట్టింది. ఇంకేం! ఒక్కసారిగా కెవ్వన కేక వేసింది. "ఏమి టేమిటి?" అంటూ జగన్నాధం పరుగున రాబోయి, దారిలో కుర్చీ తగిలి పడిపోయాడు.

ఇంతలో వర్షం తగ్గింది. లైట్లు వచ్చాయి, జానకమ్మబాధకూడ తగ్గింది. జగన్నాధానికి దెబ్బ తగుల లేదులెండి!

జానకమ్మ, గబగబా వెళ్ళి కిరసనాయిల్ బుడ్డి, తీసుకొని "దీని కోసం వెళ్ళితేనే తేలుకుట్టింది. [illegible]ధ వది! ఇది యిక మన యింట్లోనే వుండగూడదు" అంటూ కసికొద్దీ విసురుగా పెంటకుప్పల్లోకి విసరి వేసింది. ఆ దెబ్బకే కిరసనాయిల్ బుడ్డికి ప్రాణం పోయింది. ★

ఇల్లు నిండిన వస్తువు

లక్ష్మీపురంలో రామశర్మ అనే బ్రాహ్మణుడు వుండే వాడు. అతడు కడు బీదవాడు. భగవంతుడు ఎప్పుడు బీదలకే సంతానాన్ని ఎక్కువగా ప్రసాదిస్తాడు. లక్షల కొద్ది డబ్బున్న భాగ్యవంతులకు ఎంత తపస్సుచేసినా ఒక్క బిడ్డ కూడ కలగకపోవడము చూస్తూ వున్నాము. అలాగే రామశర్మ ఎంతబీదవాడో సంతానం అంత ఎక్కువ. ప్రతిరోజు భార్య తెల్లగా తోమియిచ్చిన రాగిచెంబు పట్టుకొని చుట్టుపక్కల ఊళ్లకు వెళ్ళి ఉపాదానం చేసుకొనివచ్చేవాడు. ఆ వచ్చిన బియ్యంతోనే చాలీ చాలని వంటచేసుకొని సగం కడుపులే నింపుకొని జీవిస్తూవున్నారు.

లక్ష్మీదేవి, జేష్ఠ్యాదేవి, అక్కచెల్లెండ్రు అని అందరకు తెలుసు. లక్ష్మి ఏ యింట్లో వుంటే ఆ యిల్లు భోగభాగ్యాలతో తులతూగుతూ వుంటుంది. జ్యేష్టాదేవి వున్న యిల్లు దానికి వ్యతిరేకంగా వుంటుంది. జ్యేష్టాదేవి వున్న యింటిలో దరిద్రం 'ఓ' అని పిలిస్తే పలుకుతూవుంటుంది.

ఒకరోజున లక్ష్మి, జ్యేష్ఠ, ఒక

బారు సరోజినీ దేవి

రావిచెట్టుక్రింద నిలబడివున్నారు. ఆ సమయంలో రామశర్మ చెంబు పట్టుకొని వస్తున్నాడు. లక్ష్మికి ఆ బ్రాహ్మణుని చూచేసరికి జాలి వేసింది. అప్పుడు జ్యేష్ఠాదేవి వేపు తిరిగి "అక్కా ఆ బ్రాహ్మణుడు దరిద్రంతో ఎన్నో సంవత్సరాల నుంచి బాధపడుతున్నాడు. ఇప్పటికయినా అతన్ని నువ్వు వదలిపెట్టు. ఇంక నేను అతన్ని బాగుచేస్తాను" అని అంది. కాని జ్యేష్టాదేవి దానికి ఒప్పుకోలేదు: "చెల్లీ, లక్ష్మీ! ఇంకా అతని కర్మ పరిపక్వం కాలేదు. అందుచేత నేను అతన్ని యింకా వదలను" అంది. ఆ మాటకు లక్ష్మి "అయితే నేను అతన్ని బాగుచేస్తాను చూడు" అంది. "నీవు ఏ విధంగాను నన్ను గెలవలేవు" అంది జ్యేష్ఠ. ఈ విధంగా లక్ష్మి, జ్యేష్టా చాలపట్టుదలగా మాట్లాడుకొన్నారు.

ఇంతలో ఆ బ్రాహ్మణుడు ఆ చెట్టుదగ్గరకు వచ్చాడు. లక్ష్మి ఆ బ్రాహ్మణుని "ఓ బ్రాహ్మణుడా ఇలారా" అని పిలిచింది. ఆ బ్రాహ్మణుడు ఆ మాటకు తల పైకి ఎత్తిచూచాడు. ఒకామె నగలు నాణ్యాలతో కలకలాడుతూ లక్ష్మీదేవిలా అగుపడింది. రెండవ ఆమె చింపిరిజుట్టు, చిరిగిన బట్టలతో చూచేందుకు భయంకరంగా వున్నది. రామశర్మ ఎప్పుడూ అచ్చట జనసంచారము చూడలేదు. అటువంటిది ఆ స్త్రీలను చూచి ఆశ్చర్యపోయాడు. లక్ష్మి పిలుపుకి ఆమెదగ్గరకు వెళ్లాడు. లక్ష్మి ఆ బ్రాహ్మణునితో "ఓ బ్రాహ్మణుడా! నీ బీదరికం చూస్తూవుంటే నాకు చాల జాలి కలుగుతోంది. నీ బీదరికాన్ని పోగొట్టుటకే నిన్ను పిలిచాను," అంటూ ఆమె మెళ్ళోవున్న కంటె తీసి రామశర్మకు ఇచ్చి "ఈ కంటె

నీ భార్య చేతికి యిచ్చి రోజూ పూజ చేస్తూవుండమను. ఈ కంబెలో ఓ చిన్న ముక్క తీసుకొని నీకు కావసిన సామగ్రి కొనుక్కుంటూవుండు. తిరిగి తెల్లవారేసరికి ఆ ముక్కతో సహా కంబె పూర్తిగా వుంటుంది" అని చెప్పింది. రామశర్మ సంతోషముతో ఆ కంబె తీసుకొని అంగవస్త్రములో చుట్టుకొని చంకలో పెట్టుకొని వెళ్ళిపోయాడు. అప్పుడు లక్ష్మి "అక్కా చూడు, నా మహిమ. ఈ బ్రాహ్మణుని భాగ్యవంతునిగా చేస్తాను" అని అంది. కాని జేష్ఠాదేవి లక్ష్మితో "పిచ్చిదాన! నా ముందు నీ మహిమ గొప్పది కాదు. ఈ బ్రాహ్మణుని యింకా దరిద్రముచేత బాధపడేటట్లే వుంచదలచాను. నా మహిమచూడు అంది." ఈ విధంగా లక్ష్మి, జ్యేష్ఠలు పందెం వేసుకొన్నారు.

రామశర్మ సగందూరం వెళ్లి మంచినీళ్లు త్రాగడానికి అక్కడకు దగ్గరలోనున్న కాలవగట్టు దగ్గరకు వెళ్ళాడు. అతను లేచేటప్పుడు ఆ కంబె మూటలోనుంచి జారి క్రింద పడిపోయింది. రామశర్మ అది గమనించకుండా తొందరగా వెళ్లిపోయాడు. ఆ కంబె త్రోవన పోతున్న బాటసారికి దొరికింది. ఆ బాటసారి ఊళ్లోకి వెళ్ళి ఒక కోమటికి అయివందలకు ఆ కంబె అమ్మేశాడు. ఆ కోమటి ఈ వస్తువు దొంగవస్తువేమో అని భయంకొద్దీ కొన్నిరోజులుపోయిన తరువాత యింటికి పట్టకొని వెళ్లవచ్చునని తన గల్లాపెట్టెలో ఆ కంబె పడేశాడు.

ఆరోజు రామశర్మకు రోజు దొరికేటన్ని బియ్యంకూడ దొరకలేదు. ఇంటికివచ్చి చెంబు భార్య చేతికిచ్చి చంకలోనున్న అంగవస్త్రము తీశాడు. కాని ఆ కంబె అగుపడలేదు. బట్టలు అన్నీ బాగా దులిపి చూచాడు. ఏమీ అగుపడలేదు. భార్య "ఏమిటి వెతుకుతున్నారు" అని అడిగింది. రామశర్మ ఆ మాటకు వస్తువ ఎలాగ పోనే పోయినది కదా! ఇంక భార్యతో చెప్పడం ఎందుకని ఏమిలేదని ఊరుకున్నాడు. ఆ మరుచటి రోజు రామశర్మ మామూలు ప్రకారమే చెంబు పట్టుకొని బయలుదేరాడు. ఆ చెట్టుక్రింద తిరిగి అక్కచెల్లెళ్లు నిలబడి వున్నారు. "నా మహిమ చూచావా" అని గర్వంగా జ్యేష్ఠ అంది. ఆ మాటకు లక్ష్మి "ఈ రోజు చూడు నా మహిమ" అంది.

రామశర్మనుచూచి "ఓ బ్రాహ్మణుడా ఇలారా" అంది. రామశర్మ వాళ్లదగ్గరకు వచ్చుటకు భయపడ్డాడు. లక్ష్మిదేవి బలవంతంచేత రాకతప్పలేదు. నేనుయిచ్చిన కంబె వుందా అని అడిగింది. ఆ మాటకు

★ ఇల్లునిండిన వస్తువు ★

రామశర్మ "అమ్మా నీవు యిచ్చిన కంటె ఎక్కడనో జారిపడిపోయింది" అని అన్నాడు. "పోనీలే ఇప్పుడు వడ్డాణం ఇస్తున్నాను. ఇదికూడా పోకుండా మొలకుపెట్టుకో దీన్ని కూడా పెట్టెలోపెట్టి పూజచేస్తూ వుండమని నీభార్యతో చెప్పు." అని చెప్పియిచ్చింది. రామశర్మ ఆ వడ్డాణం తీసుకొన్నాడు. కాని అతనికి పెట్టుకోవడం చేతకాలేదు. నడుముకి వడ్డాణం పెట్టుకొని పైని అంగవస్త్రము చుట్టపెట్టుకొని వెళ్లిపోయాడు. అతని దురదృష్టంచేత అదికూడ జారి ఎక్కడో పడిపోయింది. అదికూడా ఒకబాటసారికి దొరికింది. ఆ బాటసారి కూడ మునుపు కంటె అమ్మిన కోమటికే అమ్మేశాడు. కోమటి ఆ వస్తువుకూడ దొంగవస్తువని అనుమానంతో గల్లాపెట్టెలోనే పడేశాడు.

మరుచటిరోజు రామశర్మ మామూలు ప్రకారం బయలుదేరాడు. ఈమాటు వాళ్లు పిలిచినా వెళ్లకూడదని అనుకొన్నాడు. "అక్కా నీమాటే నెగ్గింది. ఆ రెండు వస్తువులుకూడ అతనికి దక్కకుండా చేశావు. ఈమాటు అయినా ఆ బ్రాహ్మణుని ఒదలిపెట్టు" అని లక్ష్మి జ్యేష్ఠాదేవిని బ్రతిమాలుకొంది. జ్యేష్ఠకుకూడ ఆ బ్రాహ్మణునిమీద దయకలిగింది. "చెల్లీ అతనికర్మ ఈరోజుతో పూర్తిఅయిపోయింది. ఇంక నేను అతన్ని ఒదిలిపోతున్నాను." అని చెప్పింది. ఇంతలో రామశర్మ ఆ చెట్టుదగ్గరకు వచ్చాడు. లక్ష్మి అతన్ని పిలిచింది. కాని రామశర్మ "అమ్మా! మీకో నమస్కారం. నన్ను ఇలా బ్రతకనీయండి. మీరిచ్చిన వస్తువులా నాకు దక్కలేదు. మీరు కనపడిన దగ్గరనుంచి నా దరిద్రంకూడ ఎక్కువయిపోయింది. నన్ను నా దారిని పోనీయండి" అంటూ రామశర్మ పోబోయాడు. లక్ష్మి అతన్ని పోకుండా ఆపుచేసి" ఓ "బ్రాహ్మణుడా ఈరోజు నీ అదృష్టము పండుతుంది. నామాట నమ్ము. ఇదిగో ఈ రాగికాని తీసుకొని వెళ్లి నీ భార్యచేతికిచ్చి, ఇల్లునిండిన వస్తువు, కొనమని చెప్పు"అని ఒక రాగికాని రామశర్మచేతిలో పెట్టింది. రామశర్మ ఆ కాని తీసుకొని బయలుదేరాడు. "అంత బంగారు వస్తువులు యిచ్చినప్పుడే నాకు దక్కలేదు. ఇంక ఈ రాగి కానీకి ఏమివస్తుంది? ఒక్క కానీతో యిల్లునిండినవస్తువు మాత్రం ఏదివస్తుంది. అయినా నా భార్యకి యిస్తాను, ఎలాగవుతే అలా అవుతుం"దని రామశర్మ మనస్సులో అనుకొన్నాడు.

ఆరోజు రోజుకన్న బియ్యం ఎక్కువ దొరికాయి. ఇంటికి వచ్చి భార్యతో తనకు రెండురోజుల నుంచి అగుపడిన స్త్రీలనుగురించి వారుయిచ్చిన వస్తువులు గురించి చెప్పాడు. తరువాత రాగి కాని భార్యచేతిలో పెట్టాడు. ఆమె సంతోషముతో లక్ష్మీదేవే మనకు ఈ రాగికాని యిచ్చిందేమో అని కానీకి యిల్లునిండిన వస్తువు ఏది వస్తుందా అని ఆలోచనలోపడింది. చటుక్కున ఆమెకు ఆలోచన తట్టగానె ఆమె ముఖము కలకలలాడింది. వెంటనే ఓ దమ్మిడి ప్రమిద, ఓదమ్మిడి ఆముదము, దమ్మిడీ ఒత్తి తెప్పించింది. సాయంత్రము అవగానే ప్రమిదలో ఆముదముపోసి ఒత్తివేసి దిపం వెలిగించింది. చావడి

మధ్య ఆ దీపంపెట్టింది. ఆ దీప కాంతికి యిల్లు నాలుగుమూలలా కలకల లాడుతూ కాంతితో ప్రకాశిస్తోంది.

వాళ్ల యింటికి ఎదురుగుండానే కంటె, వడ్డాణం కొన్న వర్తకుని దుకాణంవుంది. ఎప్పుడూ రామశర్మ యింట్లో దీపంపెట్టి ఎరుగరు. అటువంటిది ఈరోజు దీపంచూచి వర్తకుని ఆశ్చర్యపోయాడు. అప్పుడు తన దగ్గరనున్న వస్తువులు చటుక్కున జ్ఞాపకం వచ్చాయి. ఇవి దొంగ వస్తువులయితే ఏ రాజభటులయినా తనని పట్టుకొంటారని భయం వేసింది. "ఈ బ్రాహ్మణుడు ఎలాగూ బీదవాడు ఈ వస్తువులు వాళ్ల దొడ్లో పడేస్తే మంచిది. ఏ పోలీసులయినా ఆ వస్తువులుచూచి అతన్నే పట్టుకొని పోతా"రని నిశ్చయించుకొని, రాత్రివేళ రామశర్మ దొడ్డి గోడకు నిచ్చెన వేసుకొని ఆ వస్తువులు రెండూ వాళ్ల దొడ్లోకి విసిరేసి యింటికివచ్చిన నిశ్చింతగా పడుకొన్నాడు.

తెల్లవారుఝామున రామశర్మ భార్య దొడ్లోకి వెళ్లి చీపురితో దొడ్డి తుడుస్తుంటే నూతి దగ్గర తళ, తళ మెరుస్తూ కంటె, వడ్డాణం అగుపించాయి. ఆమె అవి చూచి కంగారుపడి భర్తను లేపింది. రామశర్మ ఆ వస్తువులుచూచి ఆశ్చర్యముతో "నాకు ఆరోజు ఈ వస్తువులనే ఆమె యిచ్చింది" అని భార్యతో చెప్పాడు. ఆమె సంతోషముతో లక్ష్మీదేవే మనకు ఈ వస్తువులను ప్రసాదించింది, అని ఆ వస్తువులు రెండూ తీసుకొని లక్ష్మీదేవిపెట్టెలో పెట్టుకొని రోజుపూజిస్తూ వుండేది. వాళ్లకు డబ్బు కావలసి వచ్చినప్పుడు దానిలో ఒకముక్క తీసుకొని అమ్మి కావలసిన సామగ్రి కొనుక్కునేవారు. తెల్లవారేసరికి ఎందులో ముక్కతీసినా ఆ వస్తువు తిరిగి పూర్తిగా వుండేది. ఆరోజునుంచి వాళ్లని జ్యేష్ఠాదేవి వదలి, లక్ష్మి పట్టింది. అందుకే ఇప్పటికీ పెద్దలు శ్రావణ శుక్రవారం కాని శ్రావణ మంగళవారం కాని బంగారాన్ని పెట్టెలో పెట్టి పూజచేస్తూ వుంటారు. శ్రావణమాసంలో క్రొత్తకోడళ్లని తీసుకొచ్చి తప్పకుండా బంగారం పెట్టి పూజచేయిస్తారు. ★

సీరియల్ :-



మూలం: ఆల్ఫాన్స్ డాడే

జరిగిన కథ

[మా నాన్నగారు—మఘ్యా ఐసెట్టి—లాన్గ్యుడాక్ లో పెద్ద సిల్కు వ్యాపారి. సొంత ఫ్యాక్టరీ అవీ వుండేవి. నేను (చిన్నా) పుట్టినరోజు లగాయతూ మా కుటుంబాన్ని ఏదో ఒక ఆపద చుట్టు ముట్టేస్తూనే వుంది. చివరికి దేశంలో వచ్చిన విప్లవం మూలంగా మా నాన్నగారిస్థితి పూర్తిగా చితికి పోయింది. కొంతకాలానికి మా నాన్నగారు దివాలా తీసి మా ఫ్యాక్టరీని అమ్మేశారు. మేము మా స్వస్థలం విడిచిపెట్టి లయన్స్ పట్టణానికి వెళ్ళిపోవలసి వచ్చింది. ఆ తరువాత కొంతకాలానికే మానాన్నగారు వ్యాపారంలో మళ్లా దెబ్బతిన్నారు. మా సంసారం రెండోసారి చితికి పోయింది. ఉన్న నలుగురం విడిపోవలసి వచ్చింది. మా అమ్మని పుట్టింటికి పంపేశాం. జాక్ ని లయ్యన్స్ లోనే ఒకకొట్లో గుమాస్తాగా చేర్చారు మానాన్న. తను సారా వుత్పత్తిదార్ల సంఘంతరఫున ఒక వుద్యోగం సంపాదించుకొన్నారు. నన్ను తనదగ్గరకు పంపితే దాక్షిణాత్య విశ్వవిద్యాలయంలో 'అషర్' వుద్యోగం యిప్పిస్తానని మా నాన్నగారి స్నేహితుడైన 'రెక్టర్' జాబు రాశాడు. తక్షణం బయలుదేరి ఆవూరు వెళ్లాను. 'రెక్టరు' నన్ను 'సర్లాన్డీ' కాలేజీలో 'అషర్' వుద్యోగానికి సిఫార్సు చేస్తూ జాబు రాసియిచ్చాడు. వెంటనే బయలుదేరి చీకటిపడే సమయానికి ఆవూరు వెళ్ళి ప్రిన్సిపాల్ గారి దర్శనం చేసుకొన్నాను. ఆయన, పొట్టిగా వున్నందుకు నన్ను ఆ వుద్యోగంలోకి తీసుకోవటానికి ముందు సందేహించినా తరువాత మనసుమార్చుకు వుద్యోగం యిచ్చాడు. ఆ మాట అనిపించుకొని చీకట్లో పడివస్తున్నాను.

ప్రిన్సిపాల్ గారి దర్శనం చేసుకొని ఒంటరిగా చీకట్లో దేవుళ్లాడుకొంటూ వస్తున్నాను. ఇంతలో ఎవరో దీపం పట్టుకుని నావైపే వస్తున్నట్టు అనిపించింది. దగ్గరకు వచ్చినట్లే వచ్చి, ఆ దీపం గోడమలుపు తిరిగి దూరంగా కదిలిపోయింది. దీపపుకాంతి వున్నది అరనిమిషమే అయినా, అంతా పరిశీలనగా చూచాను.

నాకు కనిపించింది ఇద్దరు స్త్రీమూర్తులు - కాదు కాదు; స్త్రీమూర్తుల ఛాయలు...అందులో ఒకామె బాగా ముసలిది. నడుం వంగిపోయింది. ముఖంలో సగానికి పైగా కప్పుకుపోయేలా పెద్ద కళ్ళజోడు పెట్టుకొంది. రెండో ఆమె చిన్నది. చక్కగా బక్కపలచగా వుంది. నల్ల కలువరేకుల్లాంటి ఆమె కళ్లు అతి ఆకర్షవంతంగా వున్నాయి. ఆ స్త్రీమూర్తులు త్రుటిలో నా కళ్లముందునుంచి కదిలిపోయారు. వారుభయులూ నన్ను చెరోక రకంగానూ నిశ్చేష్టుణ్ణి చేశారు. ముసలామెను చూచి వణికిపోయాను. పడుచు ఆమె అందం చూసి పులకాంకితుడనయ్యాను. వారి నీడలు కనుచూపుమేర దూరం దాటిపోయేవరకూ అక్కడే నిలబడ్డాను. ఆ తరువాత కూడా ఆదేదృశ్యాన్ని మననం చేసుకుంటూ ముందుకు నడిచాను. నడుస్తున్నంతసేపు కళ్ళద్దాల భూతకే మాటిమాటికీ జ్ఞాపకం వచ్చి కడుపులో దేవుతున్నట్లు బాధపడ్డాను...

వాళ్ళసంగతి ఆచూకీ తీయడంకంటే, నాకాపూట ప్రధానమైన సమస్య - ఆ రాత్రి ఎక్కడ బస చెయ్యటమా అనేది. ఏం చెయ్యాలో, ఎక్కడికి పోవాలో, పమీ పాలుపోవటం లేదు. పెద్ద గేటు దగ్గరకు వచ్చేసరికి, అక్కడ నా అదృష్టం కొద్దీ, యిందాకటి మీసాలాసామి పైపు కాల్చుకొంటూ నిలబడి వున్నాడు. కొద్దిఖర్చుకే సకల రాజోపచారాలూ జరిగే హోటల్ ఒకటి దగ్గరలోవుంది, చూపిస్తాను;

అనువాదం: విశ్వాత్ముల నరసింహమూర్తి

తనతో రమ్మన్నాడు. నాకు మాత్రం అంతకంటె కావలసిందేముంది—అతని వెనకాలే వెళ్ళాను.

మొత్తానికి ఆ మీసాలాసామి చాలా మంచివాడనిపించింది. దారిపొడుగునా ఏవేవో కబుర్లు చెప్తూ, ఆ మాటలసందున తనపేరు 'రోజర్' అనీ, తనో కాలేజిలో పిల్లలకి నాట్యమూ, కుస్తీ, స్వారీ, వ్యాయామమూ విద్యలు వగైరా నేర్పుతుంటాననీ అన్నాడు. అంతకుముందు చాలాఏళ్ళపాటు పదాతి దళంలో పని చేశాడట. ఆ మాటవినగానే నాకాయనమీద అపారమైన గౌరవభావం పుట్టుకొచ్చింది. చిన్నపిల్లల్లాగా నాకూ, సైన్యంలో పనిచేసేవాళ్ళనుచూస్తే చెడ్డసరదా.

హోటల్ గుమ్మంలో యిద్దరమూ ఇకముందు ఒకరికొకరం ప్రాణస్నేహితులం కావాలనే ఆకాంక్షను వెలిబుచ్చుతూ, బోలెడంతసేపు పరస్పరం కరస్పర్శలు చేసుకొన్నాం. తరువాత ఆయన వెళ్ళిపోయాడు.

ఈ ఘట్టంలో ఒక్క విషయం సిగ్గు విడిచి చెప్పాలి; తప్పదు.

ఇంతసేపూ పైకి అంత బింకంగావున్న యీ వేదాంతికి, హోటల్ గదిలో ఒంటరిగా వున్న సమయంలో గుండెనిబ్బరం కాస్తా సడలిపోయింది. ఆత్మీయులందరికీ తను ఎంత దూరమైపోయిందీ తెలిసిరాగా పసిపిల్లాడల్లే వెక్కి వెక్కి ఏడ్చాడు. ఆ క్షణంలో జీవితం అనేది చాలాభయంకరంగా కన్పించింది; దాని శక్తిముందు తనూ, తన శక్తి సామర్థ్యాలూ ఎంత అల్పాతి అల్పమైనవో తలచుకొని తెగబాధపడ్డాడు. ఆ విధంగా శోకాంబుధిలో పడి కొట్టుకుపోతూవుండగా తటిల్లతలా ఒక భావన వీడి బుర్రలో మెరిసింది. చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెదిరిపోయిన తన వాళ్ళందరూ జ్ఞాపకంవచ్చారు. తల్లిఒకచోట: తండ్రియింకొకచోట! అంతా ఒకచోట వుండాలన్నా, తలదాచుకొనేందుకు తగ్గ చూరు ఎక్కడా లేదు! కుటుంబం యావత్తూ పడుతున్న బాధలు జ్ఞాపకానికిరాగానే, తానొక్కడే అనుభవిస్తున్న విచారాన్నంతా మరచిపోయాడు. ఏ కష్టమైనా పడి, తన శక్తినంతా ధారపోసి, అనతికాలంలో చెల్లాచెదురై పోయిన కుటుంబాన్నంతటినీ ఒకచోట కూడదీసి, యిల్లూవాకిలీ ఏర్పాటు చెయ్యాలని కంకణం కట్టుకున్నాడు. ఇంత ఉదాత్తమైన ప్రతిజ్ఞ



ఏంటి తింటున్నావ్?

—ఫొటో : శంకర్, విజయవాడ.

అన్నా - చిన్నా

కట్టినందుకు తన్నుచూసి తనే గర్వపడి, చెంపల వెంట కారుతున్న కన్నీళ్ళను తుడిచేసుకున్నాడు. కార్యవాదికి కన్నీళ్లు తగవు!

కుక్కిలావున్న పక్కమీద పడుకొని, ఎం. వియట్‌గారు చదవమని నాకు యిందాక యిచ్చిన పుస్తకం చదువుదామని పైకి తీశాను.

పుస్తకాన్ని యీ చివరినుంచి ఆ చివరివరకూ ఆయనే తన స్వదస్తూరీతో రాశాడు. పుస్తకాన్ని మొత్తం మూడు భాగాలుగా విభజించాడు; పై అధికారులపట్ల, తన సహోధ్యాయులపట్ల, విద్యార్థులపట్ల 'అమర్' నిర్వహించవలసిన బాధ్యతలు విడివిడిగా మూడు శీర్షికల క్రింద కేటాయించాడు. ఎవరైనా ఒకడు ఒకజీవితకాలంపాటు 'అమర్' ఉద్యోగం చేస్తే, అతని ఉద్యోగకాలంలో ముందుగా చెప్పికాని, చెప్పక

కాని పుట్టుకురాగల ప్రతిసమస్యనీ, ఎం. వియట్ వూహించి వాటి పరిష్కారమార్గాలను నిర్దేశించాడు పుస్తకం చివరని, యిట్టి కట్టుబాట్లు నియమ నిబంధనలు పాటించటంవల్ల వ్యక్తిగతంగానూ, సంస్థపరంగానూ ఎటువంటి ఎటువంటి మేల్లు ఒనగూరుతాయో, అవన్నీ కూడా అతి శ్రద్ధగా వుటంకించాడు. అంతటి ఉద్గ్రంధాన్ని సొంతం చదవే ఓపిక లేక, సగంలో నిద్ర పోయాను.

నిద్రకూడా సరిగా పట్టలేదు. అంతులేకుండా ఒకటే కలలు. ఒకసారి ఏమిటో భయంకరమైన చప్పుడు. తీరాచూస్తే అది ఎం. వియట్‌గారి తాళం చెవి గుత్తులు చేస్తున్న చప్పుడు. ఇంకోసారి ఆ కళ్ళద్దాల భూతకి వచ్చి నా పక్కమీద కూర్చున్నట్టు కలగన్నాను. దాంతో ఉలిక్కిపడ్డాను. మళ్ళీ నిద్ర పట్టింది. ఈసారి ఆ నీలోత్పలాక్షి నా మంచానికి కాళ్లకట్టవైపు కూర్చుని నావంక జాలిగా చూస్తూవుండిపోయింది.

మరునటిరోజు వుదయం ఎనిమిదిగంటల కల్లా కాలేజిదగ్గర హాజరైనాను. గేట్లోనే ఎం. వియట్ ప్రత్యక్షమైనాడు. నన్ను చూడగానే చిరునవ్వులు ఒలకబోశాడు. "విద్యార్థులందరూ రావటం ఐపోయాక మిమ్మల్ని మిగిలిన మాస్టర్లకి పరిచయం చేస్తాను; అందాకా ఆ వసారాలో వుండండి" అన్నాడు.

అలాగే వసారాలోకి పోయి నిలబడ్డాను. ఏమీ తోచక చాలాసేపు అటూయిటూ పచారు చేశాను. టైం ఐపోయిన తొందరలో నురుగులు కక్కుకొంటూ వస్తున్న ప్రతి ప్రొఫెసర్‌కీ విడవకుండా సలాములు పెట్టాను. అందులో నా సలాము అందుకొన్నవాడు ఒక్కడే. ఆయన ఫిలాసఫీ ప్రొఫెసర్. ఆయన్ని అటు పోనిచ్చి "అదొకరకం కయ్యాళిమనిషి లెండి" అన్నాడు నాతో ఎం. వియట్.

కయ్యాళిమనిషి అయితే అయినాడు: చూసీ చూడగానే నా కాయనమీద విపరీతమైన అభిమానం ఏర్పడింది.

గంటమోగింది. క్లాసురూములు అన్నీ కిటకిటలాడుతున్నాయి. ఇరవై ముప్ఫైఏళ్ళ మధ్య వయస్సులోవుండే నలుగురైదుగురు ఆజానుబాహులు వీధిలోంచి వుక్కిరిబిక్కిరి అవుతూ పరిగెత్తుకొస్తున్నారు. అందరూ సూపరింటెండెంట్ ఎం. వియట్ గారిని చూడగానే కంగారుపడిపోయారు.

ఎం. వియట్ వాళ్లకి నన్ను చూపించి "వీరు కొత్తగా వచ్చిన 'అపర్': మన్యూ డేనియల్ ఐసెట్టీ" అని పరిచయంచేశాడు. ఆ మాటఅనేసి ఒక పక్కకు వంగిపోయిన తలను నేలకు అంటేలా వంచి సలాంచేసి, చిరునవ్వులు నవ్వుకొంటూ చక్కాపోయాడు. అతని చేతిలో తాళంచెవులు మాత్రం చప్పుడు చెయ్యటం మానలేదు.

కొత్తగా పరిచయమైన నా సహోద్యోగులూ నేనూ మౌనంగా ఒకొళ్లనొకళ్లం తృటికాలంచూస్తూ నిలబడిపోయాం.

వాళ్లందర్లోకీ పొడుగ్గావున్నాయన ముందుగా పలకరించాడు. ఆయనే ఎం. సిరియర్స్. ఏ సిరియర్స్‌గారి స్థానమైతే నేను ఆక్రమించబోతున్నానో ఆ సిరియర్స్‌గారే!

ఆయన నావంకచూస్తూ "పాత 'అపర్'కీ, కొత్త 'అపర్'కీ పోలికేలే" దని ఆశ్చర్యపోవటం మొదలు పెట్టాడు.

ఆ మాట విని అక్కడివాళ్లందరూ గొల్లున నవ్వారు. వాళ్లందరికంటే బిగ్గరగా యీ 'డింభకుడూ' నవ్వాడు. పైకి అంత పటాటోపంగా నవ్వినా, ఆక్షణంలో మరొక్క మూడు అంగుళాలు ఎత్తు పెరగటంకోసం ఏంచెయ్యమన్నా,— ఆఖరికి తన ఆత్మని అమ్మెయ్యమన్నా అమ్మెయ్యటానికి సిద్ధపడ్డాడు.

"అయితే ఏంలెండి! మన యిద్దరికీ ఎత్తుల్లో యింత వ్యత్యాసంవున్నప్పటికీ గ్లాసులు ఖాళీచెయ్యటంలో మాత్రం మనం ఒకరికొకరు తీసిపోమనుకొంటాను." అన్నాడు ఎం. సిరియర్స్, నా భుజం మీద చెయ్యివేసి వూపుతూ. "ఇవ్వాళ కేఫ్ బార్ బెట్టీలో చిన్నవిందూ గట్రా ఏర్పాటుచేశాం. మీరుకూడా దయచెయ్యాలి" అంటూ నన్ను అతి ఆప్యాయంగా ఆహ్వానించాడు.

నా సమాధానంకోసం అయినా ఆగకుండా చెయ్యిపట్టుకు వీధిలోకి లాక్కువెళ్లాడు.

కేఫ్ బార్ బెట్టీ పెద్ద బజారులోవుంది. సైన్యంలో కొంచెం కిందిహోదాకి చెందిన వుద్యోగులూ వాళ్ళూ తరుచు యిక్కడికి వస్తుంటారు. ఆరోజు ఎం. సిరి

★ అన్నా - చిన్నా ★

యర్స్‌గారు వెళ్లిపోతూ వుండటంమూలంగా నాటి విందుకి అలాంటివాళ్లు చాలామంది వచ్చారు. ఎం. స్క్రియర్స్ నన్ను వాళ్ళకు పరిచయం చేశాడు. వాళ్లుకూడా నన్ను మొదట్లో, ఎంతో ఆప్యాయంగా పలకరించారు కాని కొత్తవాణ్ణి కావటంచేత కొద్ది క్షణాలు గడిచేసరికి అంతమందిలోనూ నేను ఒంటరి వాణ్ణి ఐపోయాను. కొట్టి కోలాహలంగా వాళ్లంతా కేకలువేస్తూ కేరింతాలు కొట్టుతూవుంటే, ఒకమూల కూర్చునిచూస్తూ వూరుకోవలసివచ్చింది. అంతహడా వుడిలోనూ ఎం. స్క్రియర్స్ వీలుచేసుకొని నన్ను వెతుక్కొంటూ వచ్చి, నా పక్కనే కూర్చున్నాడు.

"చూడండీ; మన యీ వుద్యోగంలోకూడా కొన్ని మధురక్షణాలు లేకపోలేదు. ఎవరు ఏమను కొన్నప్పటికీ-మీరు మొట్టమొదటిసారిగా వుద్యోగంలో చేరటానికి యిక్కడికి రావటం, మంచిపని చేశారు. అలా ఎందుకంటున్నానంటారా?— అందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి—ఇక్కడ యీ కేఫ్‌లో కమ్మని సారాదొరుకుతుంది; రెండు—మన ఆ

'కొఠారు' మరీ అంత అధ్వాన్నంగా వుండదు." అన్నాడు.

కొఠారు అంటే నేపనిచేయబోయే కాలేజి తాలూకు ముద్దుపేరు.

"మరీ చిన్న పిల్లలు మీా పాలబడతారు. వాళ్ళని కొంచెం గట్టిరకం కమ్చీలతో అదుపులో పెట్టాల్సి వుంటుంది. చూస్తారుగా, ఆ కొరకరాని కొయ్యల్ని నేనెలా అదుపులో పెట్టానో! మన ప్రిన్సిపాల్ కూడా మరీ అంత చెడ్డవాడు కాదు. ఆ ముసలాడు ఎం. వియట్టూ, ఆ ముసలితొక్కూ తప్ప మిగిలిన మాస్టర్లు అంతా కూడా మంచివాళ్లు..."

"ముసలితొక్కూ అంటున్నారు; ఎవరేమిటీ?" వులిక్కిపడి అడిగాను.

"ఎవరో మీాకూ త్వరలోనే తెలిసొస్తుంది. ఇంతింత పెద్ద కళ్లద్దాలు పెట్టుకొని పగలూ రాత్రీ కాలేజీకి కాపలా కాస్తుంటుంది, ఓ ముసలిదయ్యం. అది మన ప్రిన్సిపాల్ గారి పినతల్లి. ఇక్కడ వంటయింటి అజమాయిషీ అంతా ఆవిడదే. అది బతికున్నంత కాలం యిక్కడ ఎవడైనా తిండికి ముఖంవాచి చావాల్సిందే!"

స్క్రియర్స్ గారి వర్ణననుబట్టి క్రితంరాత్రి నాకు కనిపించిన ముసలిదీ, యీాయన చెప్పే ముసలిదీ ఒకరే నని బోధపడింది.

నీలోత్పలాక్షి ఎవరైందీ, ఆమె ఎక్కడ వుండేదీ అడుగుదామని పదిసార్లైనా ప్రయత్నించాను; కానీ పబ్లిక్ హోటల్ లో ఆమె వూసు ఎత్తటానికి ధైర్యం చాలక వూరుకొన్నాను.

ఈలోగా సారా వడ్డిస్తున్నారు. ఖాళీగ్లాసులు నిండుతున్నాయి: నిండినగ్లాసులు ఖాళీఅవుతున్నాయి. ఎటుచూసినా కేకలూ కేరింతాలు, చప్పట్లు, చమత్కారాలు చెలరేగిపోతున్నాయి.

కట్టలు తెగి ప్రవహిస్తున్న ఆ ఆనందోద్రేకాలను కొంతసేపు దూరంనుంచీ చూస్తూవున్న మీాదట, నాకు పట్టుకొన్న సిగ్గూ బిడియం ఒక్కసారిగా వదిలిపోయాయి. నేనూ చేతిలో సారాగ్లాసుపట్టుకుని, కొత్తఅన్నది లేకుండా, హోటల్ అంతా చెడతిరిగేశాను.

అక్కడున్న సార్జెంట్లూ సైనికులలో కొందరితో నాకప్పుడే చనువు ఏర్పడిపోయింది. వాళ్లల్లో ఒకరితో ఆమాటా యీామాటా మాట్లాడుతూ, మాదొక జమీాందారీ కుటుంబమనీ, నేను చేసిన ఒకానొక అఘాయిత్యానికి మా నాన్నగారికి కోపంవచ్చి నన్ను యింట్లోనుంచి తగిలేశారనీ, అందువల్ల ఏదో కాలక్షేపంకోసమే యీా కాలేజీలో వుద్యోగానికి వచ్చాననీ నమ్మకంగా కోసేశాను. అంతగొప్ప కుటుంబంలో పుట్టిన నాకు యీా వెధవవుద్యోగంలో అష్టకష్టకాలం వుండవలసిన అగత్యం ఏమిటని అతని పట్టుకు అడిగేశాను. "అవును, ఏమిటి?" అని అతనూ నేను అన్నమాటనే బలపరిచాడు.

మనుషులు మహా చిత్రమైనవాళ్లు. ఎప్పుడైతే నేను గొప్పకుటుంబానికి చెందిన వాణ్ణి అని పబ్లిక్ హోటల్లో చెప్పుకొన్నానో, అప్పటినుంచీ నన్ను అందరూ అదొక రకమైన గౌరవభావంతో చూడటం మొదలు పెట్టారు. బతకలేక బడిపంతులు వుద్యోగానికి వచ్చిన నిరుపేదనని తెలిస్తేమాత్రం వాళ్లు నాపట్ల యింకోలా ప్రవర్తించివుండేవారు : అందుకు సందేహం ఏమీా లేదు. తెలిసో తెలియకో నేను కోసినకోత మహా బాగా పనిచేసింది. పెద్ద పెద్ద హోదాలు గల సైనికోద్యోగులుకూడా నన్ను భుజంతట్టి పలుకరించారు. విందుముగిసేముందు డాన్స్ మాస్టర్ రోజర్ లేచి నిలబడి, ప్రత్యేకం నా ఆయురారోగ్యాలకోసం 'టోస్టు' చెప్పాడు. అదంతా చూస్తుంటే గర్వంతో నా భుజాలు పొంగాయి.

అంతటితో నాటి విందు ముగిసింది. అప్పటికి పావుతక్కువ పదిఅయింది. అందరూ కాలేజి చేరుకోవలసిన టైము.

అప్పటికే ఎం. వియట్ తాళంచెవులగుత్తులు ఆడించుకొంటూ కాలేజీ గుమ్మంలో నిలబడి మాకోసం ఎదురుచూస్తున్నాడు.

వీడ్కోలు విందులో మోతాదుమించి సేవించిన సారా నిషాలో తూలుతూవస్తున్న ఎం. స్క్రియర్స్ ని

అన్నా - చిన్నా

పిలిచి, ఆఖరుసారి పిల్లల్ని హాలులో సమావేశపరచవలసిందనీ, తదనంతరం తనూ, ప్రిన్సిపాల్ గారూ కలిసి కొత్తమాస్టార్ని (నన్ను) పిల్లలకి పరిచయం చేస్తామనీ ఎం. వియట్ చెప్పాడు.

ఆయన నిర్దేశించిన ప్రకారం మరికొన్ని క్షణాలలోనే ప్రిన్సిపాల్ గారూ, ఎం. వియట్, యీ కొత్త మేస్టారూ హాలులోకి అతిగంభీరంగా అడుగు పెట్టారు. పిల్లలంతా లేచి నిలబడ్డారు.

నన్ను పిల్లలకి పరిచయం చేస్తూ ప్రిన్సిపాల్ సుదీర్ఘ గంభీరోపన్యాసం యిచ్చాడు. ఆయన తరువాత, సారాస్మైకం వదలని ఎం. సిగ్రియర్స్ మాట్లాడాడు. ఎం. వియట్ గారు తానైతే మాట్లాడలేదు కాని, ఆయనతరఫున ఆయన తాళంచెవులు భయంకరమైన భాషలో ఏదో మాట్లాడుతునే వున్నాయి. ఆ భాష బోధపడినా పడకపోయినా పిల్లలంతా హడిలిపోయి బల్లలక్రింద తలలు దాచేసుకొన్నారు. ఈ కొత్త మాస్టారుసంగతి చెప్పనే అక్కరలేదు.

తాళంచెవుల రాక్షసుడు అటు వెళ్లిపోగానే, పుట్టల్లోనుంచి పడగలుపైకి ఎత్తిన పాముల్లాగా, పిల్లల తలలన్నీ ఒక్కసారి అల్లరిగా పైకి లేచాయి. ఎవరి కళ్లల్లోచూసినా కొంటెతనం కనుపిస్తోంది. కొత్త మాస్టర్ని ప్రతివాడూ గుచ్చుకుపోయేలా చూడటమూ, ఒకరిచెవులో ఒకరు ఏదో గుసగుస లాడుకోవటమూ సాగించారు.

ఆపిల్లలూ, వాళ్ళవైఖరీ, ఆ కొంటెచూపులూ, అవన్నీ చూస్తుంటే నాకేమిటో యిబ్బందిగా వుంది. కళ్లల్లో కావలసినంత కాఠిన్యం తెచ్చిపెట్టుకొని, రొమ్ములనిండా గాలిపీల్చుకుని, పిల్లలందరివంకా కాల్చిపారేసే చూపులు రెండుమూడు చూసి, తుపాకీ పేల్చినట్లు ఒక్కసారిగా "ఊ! పుస్తకాలు తియ్యండి" అని రంకెవేశాను.

ఆవిధంగా ఆరంభమైంది నా వుద్యోగం.

(ఇంకావుంది)

ఫిలిం సెన్సార్ షిప్ రద్దు కావాలి

రాజమన్నార్, వాసన్ గార్ల అభిప్రాయాలు

ఈ నెల 8 వ తేదీన జరిగిన దక్షిణ భారత సినీ టెక్నీషియన్ల దశమ వార్షికోత్సవ సభలో మద్రాసు చీఫ్ జస్టిస్ పి. వి. రాజమన్నార్, జెమినీ అధిపతి ఎస్. ఎస్. వాసన్ గార్లు మాట్లాడుతూ, ఫిలిం సెన్సార్ షిప్ వల్ల కలుగుతున్న అనర్థాలను గూర్చి, అది రద్దు కావలసిన అవసరాన్ని గూర్చి ఉద్ఘాటించారు.

ఘంటసాల వెంకటేశ్వరరావు గారి ప్రార్థన గీతంతో సభ ప్రారంభమైంది. సభకు పి. వి. రాజమన్నార్ గారు అధ్యక్షత వహించారు. వాసన్ గారు ఉపన్యాసం చేశారు.

ఈ సందర్భంలో 1953 వ సంవత్సరంలో వెలువడిన చిత్రాలలో ఉత్తమ నైపుణ్యం చూపిన టెక్నీషియన్లకు బహుమతులివ్వబడినవి. ఫోటోగ్రఫీ:—"నాయిల్లు" చిత్రంలో ఎమ్. ఎ. రహమాన్; దర్శకత్వం:-"మణిదన్" చిత్రంలో కె. రామనాథ్; శబ్దగ్రహణం:-"దేవదాసు"-చిత్రంలో కె. రామచంద్రన్, టి. ఎస్. రంగస్వామి, ఎన్. శేషాద్రి, వి. రంగాచారి; కళ:—"అవ్వయ్యార్" లో ఎ. కె. శేఖర్, కె. ఆర్. శర్మ, ఎమ్. ఎస్. జానకిరామ్; సంగీతం:—"అవ్వయ్యార్" లో ఎమ్. డి. పార్థసారథి, పి. ఎస్. అనంతరామన్, మాయవరం వేణు.

సెన్సార్ షిప్ X వాసన్

వాసన్ గారు సినీ టెక్నీషియన్ల సభలో ప్రసంగిస్తున్నప్పటికీ, ఎక్కువగా నిర్మాతల కష్టసుఖాలనుగూర్చి, ముఖ్యంగా ప్రభుత్వ ప్రాతికూల్యం, సెన్సార్ షిప్ వల్ల కలిగే ఇబ్బందులుగూర్చి మాట్లాడారు. టెక్నీషియన్లను ప్రశంసిస్తూ, వారికి టెక్నికల్ తర్ఫీదు ఇచ్చే పాఠశాలలేమీ లేకపోయినప్పటికీ, అనుభవజ్ఞానం వల్ల, పాశ్చాత్య చిత్రాలను జాగ్రత్తగా చూడడం వల్ల టెక్నికల్ నైపుణ్యం సంపాదించుకొంటున్నారనీ, ఇది చాల గొప్పసంగతనీ ఆయన అన్నారు. "టెక్నీషియన్లను ట్రేడ్ యూనియన్లలో సంఘటించాలనీ కొందరంటున్నారు. వారికి ఫ్యాక్టరీ చట్టం వర్తింపచేయాలంటున్నారు. కాని టెక్నీషియన్లలో ప్రసిద్ధ సంగీత దర్శకులు, ఇతర శాఖలలో పెద్దలు ఉన్నారు. వీరందరూ ఫ్యాక్టరీచట్టానికి లోబడడానికి ఎలా ఒప్పుకుంటారో తెలియడంలేదు," అని టెక్నీషియన్లలో ట్రేడ్ యూనియనిజం తల ఎత్తడం మంచిది కాదనే ధోరణిలో మాట్లాడారు.

తరవాత ఒక హితబోధ చేశారు. "ఫిలిం పరిశ్రమ కష్టసుఖాలు టెక్నీషియన్లకు కూడా వర్తిస్తాయి. నిర్మాతలు వస్తూంటారు, పోతూఉంటారు. కాని టెక్నీషియన్లు పరిశ్రమలో స్థిరంగా ఉండిపోతారు. అందుచేత వారు పరిశ్రమ అభివృద్ధినే ముఖ్యంగా మనస్సులో ఉంచుకొని, దానికోసమే పని చేయాలి."

ఇటీవల మన చిత్రాలస్థాయి తగ్గిపోయిందని అంగీకరిస్తూ వాసన్ ఇలా అన్నారు: "కళలపై ఎటువంటి కంట్రోలూ ఉండగూడదని ఈమధ్య మౌలానా ఆజాద్ అన్నారు. అయితే ఫిలింపరిశ్రమ విషయంలో కొన్ని చిక్కులున్నాయి. చలనచిత్రం అనేకకళల సముదాయం. దానిని ఉత్తమకళగా రూపొందించడానికి అందరూ కలిసి మార్గాలు అన్వేషించాలి.

ప్రపంచంలోని పెద్దదేశాలలో ఫిలిం పరిశ్రమపై ప్రభుత్వానికి కంట్రోలు ప్రత్యక్షంగా లేదు. అమెరికాలో పరిశ్రమవారే తమ చిత్రాలను కంట్రోలు చేస్తారు. బ్రిటన్, జపాన్‌లలోకూడా అంతే. అగ్నిప్రమాదాలు రాకుండాను, థియేటర్లకు లైసెన్సు ఇవ్వడంలోను, ఇటువంటివే మరి కొన్ని విషయాల్లోను మాత్రమే ప్రభుత్వం కలగజేసుకొంటుంది. మనదేశం చాల పెద్దది. సాంస్కృతికంగా అతి ప్రాచీన చరిత్ర కలది. ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉండేట్లు మన ఫిలిం పరిశ్రమను వృద్ధి చేయాలి. కళాభివృద్ధికీ, వినోదానికీ మాత్రమే కాకుండా ఇతర రంగాలలో కూడా దేశపు అవసరాలను తీర్చడానికి ఈ పరిశ్రమను మనం ఉపయోగించాలి. అయితే ప్రభుత్వం మనకు ఈ విషయంలో అవకాశాలను ఇవ్వలేదు."

పౌరాణిక చిత్రాలు

ప్రభుత్వంపై ఈ వింత ఆరోపణను సమర్థించడానికి వాసన్ గారింకా ఇలాగన్నారు: "ప్రస్తుతం అమల్లో ఉన్న సెన్సార్ షిప్ విధానం ఏ విధంగానూ సమర్థనీయం గాలేదు. ఇది తమకు సంబంధించని సమస్య అని టెక్నీషియన్లు ఊరుకోగూడదు. గడిచిన ఆరు నెలల్లో, నిర్మాతలు పౌరాణిక చిత్రాలవైపు, స్టంటు చిత్రాలవైపు మొగ్గు చూపుతున్నారని మీరు గమనించి ఉంటారు. పౌరాణిక, జానపద కథలను నేను నిరసిస్తున్నాననుకోకండి. కాని దీనివల్ల మనమింకా చిత్రనిర్మాణపు బాల్యదశలో ఉన్నామనీ, మనకు నూతనభావాలు లేవనీ కొందరు విమర్శించడానికి వీలుంది. ఈ విమర్శ నిర్మాతలకు, టెక్నీషియన్లకు కూడా తగులుతుంది. ఈవిధంగా నిర్మాతలు వెనక్కి నడవడానికి ముఖ్య కారణం సెన్సార్ షిప్ విధానమే. సాంఘిక కథా చిత్రాల్లో ఎక్కడన్నా కొత్త భావం, కొత్త సంగతి కనిపిస్తే చాలు సెన్సార్లు దాన్ని కత్తిరించేస్తున్నారు. అందుచేత నిర్మాతలు సురక్షితమైన పాత కథావస్తువులనే తిరిగి తీసుకుంటున్నారు."

పౌరాణిక నిర్మాణాల నిందను



“జగన్నాథ స్వామి [illegible]”

యూనియన్ పిక్చర్సువారి “శ్రీ జగన్నాథ మాహాత్మ్యం” (తెలుగు) చిత్రంలో రాణి, విద్యావతి, లలిత.

★ సెన్సార్ షిప్ ★

సెన్సార్షిప్పై మాట్లాడిన తరువాత వాసన్ ఇంకా ఇలా అన్నారు: “సెన్సార్ షిప్ కోడ్ ఒకటి ఉండాలి కాని దానిని కఠినంగా అమలు చేయకూడదు. ప్రస్తుతపు సెన్సార్ షిప్ ప్రకారం, సెన్సార్ అధికారి న్యాయాధికారిలాగ ప్రవర్తిస్తాడు. నిర్మాతలు ఆయనతో మాట్లాడడానికి వీలు లేదు. రాజీ అవకాశమే లేదు. కళకు ఈవిధంగా న్యాయం జరగడంలేదు. ఇతర దేశాల్లోకూడా పాతకథలే తిరిగి నిర్మిస్తున్నారు కాని దానికి కారణం సెన్సార్ షిప్ కాదు. పశ్చిమదేశాల్లో టెక్నికల్ గా కొత్తమార్పులు జరుగుతున్నాయి. త్రీ-డీ మొదలైన కొత్త టెక్నికల్ విధానాలవల్ల వాళ్ళు పాతకథలనే తిరిగి తీసుకోవలసి వస్తోంది. ఆ దేశాల్లో ఫిలిం పరిశ్రమకు పోటీగా టెలివిజన్ మొదలైన అనేక ఇతర సాధనాలున్నాయి. వాటినుంచి ప్రజలను మళ్లించి చిత్రాలకు రప్పించడానికి ఫిలిం పరిశ్రమ రకరకాలమార్గా లనుసరిస్తోంది కాని ఇండియాలో చలనచిత్రం ఒక్కటే వినోదసాధనం. పైగా మనం కొత్త టెక్నికల్ పద్ధతులను ధరించేస్థితిలో లేము. వాటివల్ల టెక్నీషియన్లు కొత్తగా సాధించేది కూడా ఏమీలేదు.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ వాక్స్వాతంత్ర్యం, భావస్వాతంత్ర్యం ఇస్తోంది. సృజనాత్మకమైన ఫిలిం పరిశ్రమలో పనిచేసేవారికి ఆ స్వాతంత్ర్యం ఇవ్వకపోవడం అన్యాయం.

“ఫిలిం పారిశ్రామికులు తమంతట తామే సెన్సార్ షిప్ అమలు చేసుకోడానికి ప్రయత్నించాలి. అలా స్వయంగా సెన్సార్ చేసుకునే రోజు అట్టే దూరం లేదని నా నమ్మకం. ఫిలిం విచారణ సంఘం వారు సూచించిన ఫిలిం కౌన్సిల్ ను స్థాపించడానికి ప్రభుత్వం అంగీకరించకపోవడం ముదావహంగా ఉన్నది. ఈ పరిశ్రమను కంట్రోలు చేయడంలో ప్రభుత్వం చాలా ఇబ్బందిపడుతోంది అయితే పరిశ్రమ తనను తాను కంట్రోలు చేసుకోనేందుకు ప్రయత్నించనంతవరకూ ప్రభుత్వం తన బాధ్యతను వదిలిపెట్టలేదు. అందుచేత క్రమేణా ఫిలిం పరిశ్రమలోని వారు ‘సెల్ఫ్ రెగ్యులేషన్’ కోసం ప్రయత్నించాలి”

రాజమన్నార్‌గారి వ్యక్తిగత అభిప్రాయాలు

మద్రాసు చీఫ్ జస్టిస్ పి. వి. రాజమన్నార్ గారు అధ్యక్షోపన్యాసం చేస్తూ, వాసన్ గారి వాదాలను సమర్థిస్తున్నట్లే మాట్లాడారు. ఆయన న్యాయాధిపతిగా కాక వ్యక్తిగతంగానే తమ అభిప్రాయాలు వెల్లడించారు. అయినా వాటిని బహిరంగంగా వెల్లడించినందున, అవి కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ఉన్నందున, వాటికి కొంత విలువ ఇవ్వకతప్పదు.

“చలనచిత్ర నిర్మాణం పరిశ్రమ అన్న



ప్రతిభా వారి "రేణుక" లో ప్రమీల

★ సెన్సార్ షిప్ ★

మాట నిజమే. కాని సంగీత దర్శకుడు, దర్శకుడు మొదలైనవారికి ఫ్యాక్టరీల చట్టం వర్తింపజెయ్యాలనడం చాలా విరుద్ధంగా ఉంది," అని ఆయన అన్నారు.

సెన్సార్‌షిప్ విషయంలో వాసన్‌గారి వాదాన్ని తాను ఒప్పుకుంటున్నానని చెబుతూ ఆయన ఇలా అన్నారు: "బయటి వారిచేతిలో కంట్రోలు ఉన్నంతకాలమూ కళ అభివృద్ధి కాదు. దానివల్ల కళ నాశన మవుతుంది. కళ విషయంలో ప్రభుత్వ జోక్యం ఉండరాదు. కళకు సంబంధించని వాటిలో వుండవచ్చును. నాకు సెన్సార్‌షిప్‌లో నమ్మకం లేదు. ఒక చిత్రం ఒకానొక నిర్ణీత స్థాయిలో ఉన్నదా లేదా అని పరిశీలించడం సెన్సార్ల బాధ్యత కాదు. సెన్సారింగ్ ఆశయాలు రెండే ఉన్నాయి. దౌర్జన్యానికి దారితీసేవాటిని, దేశంలో సాంఘిక, రాజకీయ సామరస్యాన్ని భంగం చేసేవాటిని అరికట్టడం మొదటి ఆశయం. నైతికమైన విలువలను చెడగొట్టే అసభ్యతను నిరోధించడం రెండో ఆశయం. ఒక చిత్రం పూర్తిగా గాని, కొన్ని భాగాల్లో గాని, అసభ్యంగా ఉన్నట్లయితే ప్రభుత్వం న్యాయస్థానాలద్వారా చర్యలు తీసుకోవచ్చును. రోజూ అనేక పుస్తకాలు ప్రచురితమవుతున్నాయి. వీటిలో అసభ్యమైన విషయాలుంటే ఉండవచ్చును. అయినా వాటిని ప్రచురించేముందు ప్రభుత్వం సెన్సార్ చేయడం లేదుగదా. అదేవిధంగా చిత్రాలనుకూడా సెన్సార్ చేయకుండా వదిలిపెట్టవచ్చుగదా.

ఏ చిత్రంలోనైనా హింసకు, అశాంతికి దారితీసే విషయాలున్నట్లయితే, అటువంటి అల్లర్లు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అలా చర్యలు తీసుకోలేని ప్రభుత్వం దేశాన్ని పరిపాలించడానికి తగదు."

ఈ విషయంలో అమెరికా చాలా ఆదర్శప్రాయమైన దేశమని రాజమన్నార్ గారు భావిస్తూ ఇలా అన్నారు: "పత్రికల సంగతి తీసుకోండి. మన దేశంలో వున్న పత్రికా శాసనాలవంటివి అమెరికాలో లేనే లేవు. అమెరికాలో ఒక ఉపన్యాసం గాని, చిత్రం గాని, ఒక పత్రికావ్యాసం గాని అల్లరులకు దారితీస్తుందని తోస్తే ప్రాసిక్యూటింగ్ చర్యలు తీసుకుంటారు. అంతేకాని భావ, వాక్స్వాతంత్ర్యాలను నిరోధించరు. అమెరికాలాంటి పెద్ద దేశంలో, రాజకీయంగా బాగా చైతన్యం కలిగిన దేశంలో అలా ఉంటే మన దేశంలో కూడా అలాగే ఎందుకుండగూడదో అర్థం కావడం లేదు.

అందుచేత సెన్సార్‌షిప్ రద్దుకావాలని వాసన్‌గారి కంటే ఎక్కువగా నేను కోరుతున్నాను. అయితే మన దేశం ఇంకా అంత ఉన్నతస్థాయికి రాలేదని అనుకునేటట్లయితే, సెన్సార్‌షిప్ చాలా పరిమితంగా ఉండడం అవసరం. ఏ చిత్రంలోనైనా కొంతభాగం అసభ్యంగా ఉందనో, దౌర్జన్యకారకంగా ఉందనో తోస్తే సెన్సార్లు, ఫిలిం పరిశ్రమ ప్రతినిధులతో సంప్రదించినమీదట పరస్పరాంగీకారంతో ఆ భాగాన్ని తొలగించవచ్చు. సెన్సార్ బోర్డులో ఫిలిం ప్రతినిధులకు కూడా స్థానముండాలి."

సినిమాలు అవినీతికరంగా ఉన్నాయని నిరసించడం తప్పనీ, ఆ వైఖరివల్ల గొప్ప పరిశ్రమలలో ఒకటైన సినిమా పరిశ్రమ నశిస్తుందనీ ఆయన అన్నారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే చిత్రాలను మన నిర్మాతలు నిర్మించగలరని ఆశిస్తూ, దానికి టెక్నీషియన్లుకూడా తోడ్పడాలని ఆయన ఉద్బోధించారు. ★

నృత్యాంజలి

గాన నృత్య కళాకేంద్రంవారు గడిచిన 8వ తేదీన అన్నామలై మందిరంలో "నృత్యాంజలి" నృత్యప్రదర్శనాలు ఇచ్చారు. నృత్యదర్శకులు గణేశ్ జోషీ, సి. రామమూర్తిగార్లు. గీతాంజలి ఆర్కెస్ట్రావారు కూడా ఈ ప్రదర్శనాలలో పాల్గొన్నారు. సంగీతదర్శకులు ఎమ్. రంగారావు, పి. ఎల్. శ్రీరామ్‌గార్లు.

"మా గోపి"

విక్రమ్ ప్రొడక్షన్స్ వారి "మాగోపి" ముప్పాతిక భాగం తయారైనట్లు తెలుస్తోంది. త్వరలో విడుదల కావచ్చునట. జమున, నాగయ్య, జి. వరలక్ష్మి, రేలంగి, నరసింహారావు మున్నగువారు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత, దర్శకుడు, ఫొటోగ్రాఫరు శ్రీ బి. ఎస్. రంగా. రసవంతమైన కథ కలిగిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరించగలదని ఆశించవచ్చును. ★

గ్రంథస్వీకారము

తెలుగు ఫిలిం డైరీ

1954 సంవత్సరపు తెలుగు ఫిలిం డైరీ:— సంపాదకుడు: బి. బలరామరెడ్డి; పబ్లిషర్సు ఫిలిం బుక్ పబ్లిషర్సు, మద్రాసు—17. వెల 1-0-0. దక్షిణభారత సినిమా పరిశ్రమను గూర్చిన అనేక వివరాలు ఈ డైరీలో పొందుపరుపబడినవి. ప్రముఖ సినిమా వ్యక్తుల అడ్రెసులు, ఫొటోలు, డిస్ట్రిబ్యూటింగ్ సంస్థల, థియేటర్ల వివరాలు ఈ పుస్తకంలో ఇవ్వబడినవి. ఎస్. వరలక్ష్మి త్రివర్ణముఖచిత్రం. సినిమా పరిశ్రమ అభిమానులకు ఈ పుస్తకం ఉపకరిస్తుంది. ★

★ పౌరాణిక చిత్రాలపై చర్చ ★

తిరోగమనం కాదు

పౌరాణిక చిత్రాలు తీయడం నిర్మాతల దౌర్బల్యానికి సూచనఅని కొంతమంది పాఠకులు అభిప్రాయపడుతున్నారు. కాని, నిజానికి అది ప్రేక్షకులలోని లోపమే. ఎందుకంటే "హంలోగ్" వంటి చిత్రాలు తెలుగులో తీసినయెడల పబ్లిసిటీ ఖర్చుకూడ రాదు అని నిర్మాతలకు బాగా తెలుసును. పిక్చరు (*True-to-Life*) తీస్తే ఆర్థికంగా దెబ్బ తింటవి. మన ప్రజలు అటువంటివి చూచి మెచ్చుకొనే స్టాండర్డుకు యింకా రాలేదు. హిందీలో అవి జయము పొందుటకు చాలకారణము లున్నవి. అందులో ముఖ్యముగా ఆలిండియామార్కెట్ వాటికి వున్నది.

'సాంఘికాలు కావాలి' అనే నివాదము చేసేముందు ప్రస్తుతము రిలీజు అవుతున్న సాంఘికముల్లోని ఇతివృత్తం చూడండి. అన్ని ఇతివృత్తములు ఒకే ధోరణిలో యుంటవి. అంతగొప్పగా చెప్పుకొన్న 'దోబిఘాజమీన్' లో కూడ కారు ప్రమాదమునకు కథానాయకి గురికావలసి వచ్చింది. దీనికి కారణము: డైరెక్టరుకు ఆసమయానికి ప్రేక్షక మనస్తత్వము జ్ఞాపకమొచ్చి యుంటుంది.

విజయావారు "శశిరేఖాపరిణయము" తీయుచున్నందుకు 'మిస్సమ్మ' పేరును మార్చలేదుగదా? అని ఒకపాఠకుడు వ్యంగ్యముగా వ్రాసినాడు. కాని శశిరేఖాపరిణయములో యిప్పుడు సాంఘికాల్లోయున్న చెత్త రొమాన్సు బదులు ఒక పవిత్రమైన రొమాన్సును చూడగలుగుతాము. పాశ్చాత్యులు వాళ్ల 'ఇలియడ్, యులిసెస్' గ్రంథములను గౌరవముగా చూస్తారు. కాని మనము పవిత్రమైన భారతములోని కథను తీయబోతే ఇంద్రుడూ, చంద్రుడూ, శ్రీకృష్ణుడూ పేరేడ్ చేస్తారుకాబోలు అని అంటున్నాము. దీన్ని బట్టి మన మన స్తత్వము ఏమార్గములోపోయిందో తెలుస్తున్నది. పౌరాణికాలు మన గొప్ప గ్రంథముల్లోని రాజనీతి, ప్రజలబాధ్యలు, పవిత్రమైన ప్రేమ, భగవంతునియెడల భక్తి మొదలగునవి ప్రచారములోనికి తప్పక తీసుకొస్తవి. వీటివల్ల మనకు లాభమేగాని నష్టముకాదు.

కె. సత్యమూర్తి-మద్రాసు.

* * *

అవాంఛనీయం

మన ఆంధ్ర సినీపరిశ్రమలోకల సుప్రసిద్ధ సినీకళాకారులందరూ, నిజమైన వారి కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, చిత్ర నిర్మాణానికి పూనుకునేటట్లు, నిర్మాతలు తగిన స్వాతంత్ర్యం యిస్తే, ఆ చిత్రం తప్పక విజయవంతమవుతుంది.

నిర్మాతలు పౌరాణిక చిత్రాలను నిర్మించినా, అవి సాంఘిక చిత్రాలంత విజయవంతమవవని, మన నిర్మాతలు పౌరాణికచిత్రనిర్మాణానికి పూనుకున్నట్లైతే, నూతన మార్గాసక్తులైన ఆంధ్ర ప్రజల ఆదరాభిమానాలకి దూరమౌతారని, ఇందువల్ల, ఆంధ్ర సినీజగత్తుకే తీరనికళంకం ఏర్పడుతుందని, ఆంధ్ర ప్రేక్షకులలో ఒకడనైన నా యొక్క నిశ్చలమైన అభిప్రాయం. పౌరాణిక చిత్రాలు, ఆంధ్ర ప్రజలకంత వాంఛనీయం కాదని నా విశ్వాసం.

పి. వి. జె. కృష్ణారావు
—నర్సాపురం.

* * *

శోచనీయం

చిత్రపరిశ్రమలో అనేక సంవత్సరాలు అనుభవం సంపాదించిన వారుగూడ ప్రజాభిప్రాయాన్ని గమనించటంలేదు. తమ ప్రయత్నంలో లోపం వుండి చిత్రం విజయవంతం గానియెడల అదే ప్రజాభిప్రాయంగా భావించి వెంటనే సాంఘికాల్లో నుండి పౌరాణికాల్లోకి గంతువేయుట శోచనీయం. ముఖ్యంగా మన చిత్రాలు అనుకరణలవలన, సారంలేని సంగీతంవలన, వ్యర్థపు నాట్యాలవలన, సందర్భ శుద్ధిలేని హాస్యంవలన దెబ్బతింటున్నవి. ప్రతి చిత్రంలో ఒక నవ్యత్వం వుండాలి. ప్రజా వ్యతిరేకంగా అసభ్య చిత్రాలు నిర్మిస్తే అవి ప్రజాదరణ ఎలా పొందకలుగుతవి? ప్రజలకు చిత్రాలంటే ఇంత అనాదరణ ఎందుకు కలిగింది? ప్రజలు ఊరికే డబ్బుపెట్టి సినిమాలకు రారు. వారిచ్చిన విలువకు తగిన, సంగీతం, నటన, హాస్యం, కథా పటుత్వం, వాస్తవికత, ఆ చిత్రంలో ప్రతిపాత్రకి ఒక స్థానం వుండేటట్లయితే ఆ చిత్రం విజయం పొందుతుంది.

టి. కొండలరావు—తెనాలి.

* * *

పాత చింతకాయ పచ్చడి

నేటి తెలుగు చిత్రాలలో అనేక లోపాలున్నాయి. ఈ లోపాలను సరిదిద్దుకోనిదే నిర్మాతలు పౌరాణికాలు తీసినా దానిలో గూడా విజయం సాధించలేరు. పాత చింతకాయ పచ్చడిలా ప్రతిప్రేక్షకుడు పౌరాణిక చిత్రాలను నిరసించడమే గాని అన్యము జరుగదని నొక్కి వక్కాణించవలసియున్నది.

"ఘంటా"—నల్గొండ.

* * *

కథలకు కరువు లేదు

పౌరాణిక చిత్రాల తొలూరు ప్రకటనలు చాలామందిని ఆశ్చర్యచకితులను చేస్తున్నవి. ఎవరో ఒకరు పౌరాణికచిత్రం మొదలుపెడితే - మిగతావారుకూడా ఆ పౌరాణిక చిత్రాల నిర్మాణానికి ఎగబ్రాకడం బాగాలేదు. అదీకాకుండా ఇదివరకు నిర్మితమైన చిత్రాలనే - మళ్లీ ఇప్పుడు పునర్నిర్మించడం హాస్యాస్పదం. ఈపౌరాణికచిత్రాలవల్ల మళ్లీ 20 ఏళ్లు వెనక్కి వెళుతున్నాము.

ఈ 20 వ శతాబ్దంలో సాంఘిక పరిణామాలకు తగిన కథలను తయారుచేయించి చిత్రాలు తీయడం నిర్మాతల విధి. చాలామంది నిర్మాతలు కథలు కరువంటారు. శరత్, ప్రేమ్‌చంద్, వంటి హేమాహేమీలు రచించిన నవలలు అనేకం వున్నాయి. మన తెలుగువాళ్లు రచించిన వాటిలోకూడా ఉత్తమ నవలలున్నాయి. ఇలాంటి ఇతివృత్తాలను సవ్యంగా తెరకెక్కిస్తే ప్రేక్షకులు ఎంతో ఆదరాన్ని చూపిస్తారు. అలాంటివి నిర్మించడంవల్ల నిర్మాతలకు ఖ్యాతి, ఆర్థికవిజయం కలుగుతాయి. కాని పౌరాణికాలతో చిత్రనిర్మాణం కొనసాగించడం ఎంతమాత్రం ఉత్తమంగా లేదని నా అభిప్రాయం.

ఆరిపాక సూరిబాబు
—విశాఖపట్నం.

* * *

వాస్తవికత కావాలి

నిజానికి ప్రజలకు అసలు సినిమాలపైనే ఆపేక్ష తగ్గిపోతూందనే చెప్పాలి. ప్రజాసామాన్యం అభిరుచిని గమనించే నిర్మాతలు కరువు గావడమే ఇందుకు కారణం; కేవలం "బాక్సాఫీసు హిట్" గావాలని చిత్రం తీస్తారేగాని, ఆ ప్రయత్నంలో వారు వాస్తవానికి ఎంత దూరం వెళుతున్నదీ లెక్కపెట్టరు. ఈమధ్య తయారయే చిత్రాలన్నీ - చాలవరకు - బొత్తిగా,



చదువుకుని కలెక్టరు అవుతాడనుకున్న కొడుకు బ్రతుకు తెరువుకోసం బస్సు కండక్టరు అవవలసవచ్చింది.
జనతా వారి "పరివర్తన"లో నాగేశ్వరరావు, దొరస్వామి.

★ పౌరాణిక చిత్రాలపై చర్చ ★

"వాసిరకం" అనిపించుకొంటున్నాయి. పైగా అలాంటివి, కొన్ని ఒకేసారి, విడుదలవడం తరచు సంభవిస్తూంది. అన్ని చిత్రాలు చూసేటందుకు ప్రజలకు సావకాశం, డబ్బు - ఎక్కడివి? అవన్నీ ఇంచుమించు ఒకేరకం కథ చుట్టూ తిరుగుతూంటవాయెను!

"పెళ్లిచేసిచూడు," "బ్రతుకుతెరువు," "పెద్దమనుష్యులు" - మొదలయిన చిత్రాలు విజయవంతమయినవంటే అవి ఈనాటి సంఘానికి ప్రతిబింబాల్ని చూపి, కొన్ని విషయాలను బాహాటంగా విమర్శించినై. సంఘాన్ని సహజంగా చిత్రించే సాంఘికాలు ఎప్పుడూ రాణిస్తాయి.

అంతేగాని, సాంఘిక చిత్రాలతో ప్రేక్షకులు విసిగిపోయారేమోనని, పౌరాణికాలవేపు మొగ్గుజూపడం ఆత్మవంచనే కాగలదు.

ఒకవేళ పౌరాణిక ఇతివృత్తాలకే నిర్మాతలు ప్రాధాన్యంఇచ్చినా ఏ ఒకటి రెంటికో గిట్టుబాటు అవుతుందిగాని తరువాతి వాటి మాట చెప్పనక్కరేదు. అంతేగాక పదిమందీ వాటికే ఎగబడితే చిత్రాలన్నీ పూర్తిగా దెబ్బతిని తిరిగి సాంఘికాలవేపే మళ్లవలసి వస్తుందేమో? ఒక కంపెనీ తీస్తున్న కథనే మరోకంపెనీ వేరే తారాగణంతో తీస్తారు. ఆ చిత్రాల భవిష్యత్తు అంచనా వేయడానికే భయంగా వుంది!

ఏమయినా, పౌరాణికాలు నిర్మించేకంటే వారికున్న అనుభవంలోనే కళావిషయికలోపాల్ని సవరించుకొని - కేవలం ధనార్జనే ప్రధానాశయంగా పెట్టుకోక (అంటే, నిర్మాతలు దివాళా తియ్యాలని నాభావం గాదు) నేటి సమాజాన్ని ప్రతిబింబించేలాగ సాంఘిక చిత్రం తీస్తే, ప్రజాదరణతోపాటు మంచిసొమ్ముకూడా చేసుకోగలుగుతారు.

శ్రీమతి యం. శోభారాణి
—మద్రాసు.

* * *

మళ్ళీ పౌరాణిక చిత్రాలు వాంఛనీ



"లైమ్‌లైట్"లో చార్లీచాప్లిన్ →

ఈ చిత్రం ఇతరదేశాల్లో విడుదలయి చాలకాలమైనా ఇంతవరకూ మన దేశానికి రాలేదు. అమెరికానుండి బహిష్కరించబడడానికి ముందు చాప్లిన్ ఈ చిత్రం తీశాడు. ఇది మనదేశంలో ఇంతవరకూ విడుదల కాకపోవడానికి ఎవరు కారణమో తెలియడంలేదు.

యమా, కాదా అనేది అవి తీసేవారి సమర్థత, చాతుర్యంపై ఆధారపడి వుంటుంది. కథాగమనం మంచి బిగిగా, క్రొత్త పోకడలు పోతూ ఉన్నట్లయితే పౌరాణికమే కానీండి, జానపద సాంఘిక చిత్రాలే కానీండి, అవి తప్పక విజయవంత మవుతాయి. కాని నిర్మాతలు బాక్సాఫీస్ సిద్ధాంతాల ప్రకారం నిర్మాణం సాగిస్తేనూ, ఒకే ఇతివృత్తానికి సంబంధించిన చిత్రాలు అంతా తీస్తేనూ, గాలిలో పెట్టిన హారతి కర్పూరంలా హరించిపోవలసివస్తుంది.

ప్రేక్షకులు చిత్రంలో చక్కటి వినోదాన్ని విజ్ఞానాన్ని ఆశిస్తున్నారు కాని చెత్త ప్రేమ, అభూతకల్పనా చిత్రాలు కాదు. మంచి చిత్రం ఏ థియేటరులోను లేకపోవడం, ఉన్న తుక్కు సాంఘికాలపై విరక్తితో వచ్చిన ఒక్క జానపదచిత్రంపైకి ఎగబ్రాకుతున్నారు కాని లేకపోతే ఆ చిత్రం మరునాటికే మరలవలసి వచ్చేది. అంతేకాని ప్రేక్షకులు మళ్ళీ పౌరాణిక జానపదాలపైకి ఎగబ్రాకుతున్నారనేది భ్రాంతి మాత్రమే.

జవ్వాది వెంకటరామారావు
—కోరుమిల్లి.

* * *

ఆస్తికత్వ ప్రచారం

ప్రజల్లో సాంఘిక చిత్రాలంటే విలువ తగ్గిపోయింది. మొన్న మా బంధువుల యింట్లో పెళ్ళికి వెళ్ళాను. అక్కడ ఒక పెద్దమనిషి "ఏముందండీ ఈ కాలపు సినిమాలు? పూర్వపు సినిమాలే సినిమాలు. ఇంట్లో గోలే అక్కడా అవుతే ఎట్లాగండీ? ఈ యింట్లో గొడవల్తో ప్రాణం విసుగెత్తి కాసేపు హాయిగా వుండొచ్చని పడితే అక్కడా యిదే గోలేగా" ఇట్లా వుంది సాంఘిక చిత్రాలపైన విమర్శ.

ప్రజల్లో నాస్తికత్వం నానాటికి ప్రబలిపోతూంది. ఏదన్నా నీతి ప్రజల్లో ప్రచారం చేయాలంటే సినిమాలే సాధనాలు. పౌరాణిక చిత్రాలద్వారా ప్రజల్లో ఆస్తికత వృద్ధి చేయవచ్చు. మన చిత్ర నిర్మాతలు యిప్పటికయినా పౌరాణిక చిత్రాలవైపు మొగ్గినందుకు వార్ని నేను అభినందిస్తున్నాను.

వి. కామేశ్వరశర్మ—విజయవాడ.

* * *

"నిరుత్సాహపరచరాదు"

పౌరాణికాలైనాసరే మంచి యితివృత్తంతో ప్రతిభగలదర్శకత్వంతో బాగా మెరుగులుదిద్దితే అది తప్పక ప్రజాదరణ పొందగలదు. పౌరాణికచిత్రాలుతీసే ప్రతిభ మనవారికి లేదని కాదు. ప్రేక్షకులు ఏ చిత్రాలనైనా ఆదరించవచ్చు. లోకోభిన్నరుచిః అన్నారు. ఈ సమయంలో సాంఘికాలేతప్ప పౌరాణిక చిత్రాలు తీయరాదనడం ముందంజవేస్తున్న ప్రొడ్యూసర్లను నిరుత్సాహపరచడమే ఔతుంది. పైగా మన ప్రోత్సాహము ఆ నిర్మాతల కెంతైనా అవసరం. అందుచేత కేవలం సాంఘిక చిత్రాలే ప్రజలు వాంఛిస్తున్నారనటం పొరపాటు. పౌరాణిక చిత్రాలు పాతవి కాక క్రొత్తవి తీసుకొని వాటిని ఉత్తమంగా నిర్మిస్తే అవి ప్రజాభిరుచిని చూరగొంటవి. పాతచిత్రాలే అయితే అవి ప్రేక్షకులకు ఉత్సాహాన్నివ్వవు. పైగా అసహ్యం కల్గిస్తాయి. మన హిందూదేశం నైతికంగా దైవభక్తి, పాపభీతి గల దేశం. పతివ్రతలకు పుట్టినిల్లు. అటువంటిదేశంలో పౌరాణికాలు రాణించలేకపోవట మేమిటి?

"మిత్రశ్రీ"—విశాఖపట్నం.

* * *

రెంటికీ చెడ్డరేవడి

ప్రేక్షకుడు చిత్రం చూస్తూంటే ముందేమి వస్తుందో అన్న ఆత్రుత కల్గచెయ్యాలి. ఇప్పుడు పౌరాణికాలు తీస్తే, ఆ కథ తీసేవారికన్న, చూచేవారికే బాగా తెల్సివుంటుంది. అందుచేత చిత్రంలో సస్పెన్సు వుండదు. కనుక మంచి కథలతో సాంఘిక చిత్రాలను తీసి భేష్ అనిపించుకోవాలిగానీ అవి డబ్బు చెయ్యవని పౌరాణికాలకు పరుగెత్తి, మళ్ళీ అవి వెనకపడేటప్పటికి సాంఘికాలకోసం పరిగెత్తే నిర్మాతలపని "రెండిటికీ చెడ్డ రేవడి" లాగుంటుంది. కనుక 'డబ్బు' దృష్టితోనే కాకుండా, వినోదం, విజ్ఞానం దృష్టిలో పెట్టుకొని సాంఘిక చిత్రాలు తీస్తే ఎందుకు విజయవంతం కావు? నిజంగా మన నిర్మాతల ఈ తిరోగమనం ఏమంత ప్రోత్సహించదగినదిగా లేదు.

టి. రామలింగేశ్వరరావు-ఏలూరు.

* * *

మంచి నటులు లేరు

ప్రస్తుతం చిత్రపరిశ్రమ ఏమంత మంచి స్థితిలో లేదు. కలకత్తాలో ప్రజ బొంబాయిలో పరిశ్రమ విజయవంతంగావుందని, బొంబాయిలోని ప్రజ మద్రాసులోని పరిశ్రమ విజయవంతంగా వుందని అపోహపడ్డం, తీరా చిత్రాలనుచూశాక నిస్పృహ చెందడం మాత్రమే మిగులుతోంది.

తెలుగు నిర్మాతలు కొన్ని విషయాలను గుర్తించవలసి యుంటుంది. పూర్వపు రోజుల్లో పౌరాణిక చిత్రాలలో అతిప్రశంసనీయంగా నటనాశక్తిని ప్రదర్శించిన వ్యక్తులు యీ రోజుల్లో లేరు. ఒకవేళ ఉన్నా, మనం యింత నవనాగరికతను పొందిన పిమ్మట అదే నటనాచాతుర్యంతో ప్రేక్షకులను ముగ్ధులను చేయలేరన్న సంగతి ప్రతి వ్యక్తికీ తెలుసును. ఈ విషయాన్ని నటీనటులు ప్రదర్శిస్తున్న అవకతవక పౌరాణిక నాటకాలవల్ల వెల్లడి అవుతోంది. ఇలాంటి అవకతవక నటనతో పౌరాణిక కథలను వ్రాసిన మహానుభావుల పేరు ప్రతిష్ఠలను రూపుమాపవద్దని నా మనవి. మరియొక విషయం. నీటిలో గేదని పెట్టి బేరమాడినట్టు, ప్రజని ఆంధ్రదేశంలో యుంచి మద్రాసు స్టుడియోలలో చిత్రాలని తీస్తున్నమూలంగా నిర్మాతలు ప్రేక్షకుల అభిప్రాయాలను గుర్తించలేకపోతున్నారు.

ఓ. ఆర్. కృష్ణారావు—కలకత్తా.

చర్చముగింపు


పౌరాణిక చిత్రాలపై చర్చలో పాఠకులు అసంఖ్యాకంగా పాల్గొని అతి దీర్ఘములైన వ్యాసాలు పంపించారు. వీరందరి వ్యాసాలనూ ప్రచురించడానికీ, ప్రచురించిన వారివైనా పూర్తిపాఠంతో ప్రచురించడానికీ స్థలాభావంవల్ల వీలు కలుగనందుకు చింతిస్తున్నాము. మళ్లీ పౌరాణిక చిత్రాలు వాంఛనీయం కాదనేవారే ఎక్కువగా ఉన్నా, అవి కావాలనే వారు కూడా పరిగణించదగినంత సంఖ్యలో ఉండడం గమనార్హం. పౌరాణికాలు కావాలనేవారు, సాంఘిక చిత్రాలు విసుగెత్తిస్తున్నాయనీ, ప్రస్తుత కథావస్తువులలో కొరవడిన నూతనత్వం పౌరాణికాలవల్ల తీరగలదనీ, వాటివల్ల దేశంలో దైవభక్తి, పాపభీతీ పెరుగగలవనీ అంటున్నారు. వద్దనేవారు పౌరాణిక చిత్రాలు మళ్ళీ తీయడం తిరోగమించడమేననీ, సాంఘిక కథలను నేర్పుతో చిత్రిస్తే వాటికి ప్రజాదరం తప్పక ఉంటుందనీ అంటున్నారు. ఈ చర్చవలన ఒక విషయం మాత్రం స్పష్టపడుతోంది. ప్రేక్షకులు, కనీసం విద్యావంతులూ, ఆలోచనాపరులు అయిన ప్రేక్షకులు ప్రస్తుతం వెలువడే చిత్రాలపట్ల అసంతృప్తులై ఉన్నారు. తమ అభిరుచులు అభివృద్ధి అయినంత వేగంగా, తమ దృక్పథం మారినంత నిశితంగా సినిమా కళాకారుల నైపుణ్యం అభివృద్ధి కావడంలేదని వీరు భావిస్తున్నారు. ఇలా భావించే ప్రేక్షకవర్గం అల్పసంఖ్యాకమని, వీరు తమ ప్రధాన పోషకులు కారనీ నిర్మాతలు అనవచ్చు. కాని ఈ అల్పసంఖ్యాక వర్గం క్రమంగా పెరుగుతున్నది. వీరి అభిప్రాయాలకు ఒక బలం, స్పష్టమైన ఆకారంకూడా ఏర్పడుతున్నాయి. ఇది నిర్మాతలు గుర్తించడం అవసరం.

పౌరాణిక చిత్రాల చర్చ ఇంతటితో ముగించబడుతున్నది. ★



విక్రమ్ ప్రొడక్షన్స్‌వారి "మా గోపి"లో జి. వరలక్ష్మి, జమున.

... Press, 7, Thambu Chetty St. Madras




విశాలాంధ్రలో
ఆగస్టు 27 విడుదల
నరసు స్టూడియోస్ వారి
రాజగురువు
శివాజీ గణేశన్ • రంగా రావు • ముక్కామల
కే.ఆర్.రామస్వామి • కృష్ణకుమారి • పి.కే.సరస్వతి
నటించిన తెలుగు చిత్రం
పూర్ణా రిలీజ్
G.H.RAO
దర్శకత్వం:
ఎ.యస్.ఏ.స్వామి
పాటలు, మాటలు:
దేవులపల్లి కృష్ణశాస్త్రి